Published by Telangana

TS-25-0034017

# సత్యమేవ జయతే

తెలుగు దినపత్రిక

- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్

సంపుటి : 01 సంచిక : 160 ప్రచురణ : తెలంగాణ, ఎడిటర్ : జె. భాస్కర్ బుధవారం 18-06-2025 పేజీలు :12 వెల :2/-

విలేఖర్లు కావలెను

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా లో
జిల్లాలు,నియోజకవర్గాలు
మండలాల వారీగా
" సత్యమేవ జయతే "
తెలుగు దినపత్రికకు
రిపోర్టర్లు కావలెను

ఆసక్తి ఉన్నవారు ఈ నెంబర్ కి సంప్రదించగలరు

J.BHASKER
Managing Director
PH ; 9398191920

P.AARYA NAYAK
Joint MBNR District Bureau
PH ; 9281116767

SHADNAGAR

# నాలుగుచోట్ల ఆధునిక గోశాలలు

- వేములవాడ, యాదగిరిగుట్ట, ఎనికేపల్లి, పశుసంవర్ధక వర్సిటీలో అత్యాధునిక గోశాలల
- నిర్మాణం వేములవాడలో వంద ఎకరాలకు తక్కువ కాకుండా గోశాల
- రాష్ట్రంలో గోరక్షణకు సమగ్ర పాలసీ అధ్యయనానికి ముగ్గురు అధికారులతో కమిటీ
- కమిటీ సభ్యులుగా సబ్యసాచి ఘోష్, శైలజారామయ్యర్,
- రఘునందన్‌రావు సమీక్షా సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి సిఎంకు గో సంరక్షణ అప్రోచ్ పేపర్



హైదరాబాద్: రాష్ట్రంలోగో సంరక్షణకు సమగ్ర విధానం రూపొందించాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం వివిధ రాష్ట్రాల్లోని విధానాల అధ్యయనానికి ముగ్గురు అధికారులతో ఒక కమిటీని సిఎం నియమించారు. పశు సంవర్ధక శాఖ ప్ర త్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్య ర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రా వులతో కూడిన కమిటీ ఈ విషయంలో లోతైన అధ్యయనం చేయాలని సిఎం ఆదేశించారు. రా ష్టంలో గో సంరక్షణపై సిఎం రేవంత్‌రెడ్డి మంగళవారం సాయంత్రం తన నివాసంలో సమీక్ష ని ర్వహించారు. మన సంస్కృతీలో గోవులకు ఉ న్న ప్రాధాన్యం, భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకోవడంతో పాటు గోవుల సంరక్షణే ప్రధానంగా విధానాల రూపకల్పన ఉండాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

భక్తులు గోశాలలకు పెద్ద సంఖ్యలో గోవులు దానం చేస్తున్నారని, స్థ లాభావం, ఇతర సమస్యలతో అవి తరచూ మృ త్యువాత పడుతున్నాయని సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పరిస్థితులను అధిగమించి గోవుల సంరక్షణే ధ్యేయంగా తొలుత రాష్ట్రంలోని నా లుగు ప్రదేశాల్లో ఆధునిక వసతులతో గోశాలలు నిర్మించాలని సిఎం సూచించారు. ప్రముఖ దేవస్థానాల ఆధ్వర్యంలో కోడె మొక్కులు చెల్లించే వేములవాడ, యాదగిరిగుట్ట, హైదరాబాద్ నగర సమీపంలోని ఎనికేపల్లి, పశు సంవర్ధక శాఖ వి శ్వ విద్యాలయం సమీపంలో విశాల ప్రదేశాల్లో తొలుత గోశాలలు నిర్మించాలని సిఎం సూచించారు. భక్తులు అత్యధిక భక్తిశ్రద్ధలతో సమర్పిం చే కోడెల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ కనపర్చాలని సిఎం సూచించారు. వేములవాడ సమీపంలో వంద ఎకరాలకు తక్కువ కాకుండా గోశాల ఉండాలని సిఎం తెలిపారు. గో సంరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతటి వ్యయానికైనా వెనుకాడదని సిఎం స్పష్టం చేశారు. అనంతరం రాష్ట్రంలో గోశాలల నిర్వహణకు సంబంధించిన అప్రోచ్ పేపర్‌ను అధికారులు సిఎంకు అందజేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శులు వి.శేషాద్రి, శ్రీనివాసరాజు, పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గోపి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఇరాన్ లొంగిపో

- ఖమేనీ ఎక్కడ నక్కాడో మాకు తెలుసు ప్రస్తుతానికి ఆయనను చంపాలనుకోవడం లేదు
- ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక
- మరింతతీవ్రమైన ఇరాన్ఇజ్రాయెల్ యుద్ధం ఇజ్రాయెల్ దాడిలో ఖమేనీ సన్నిహితుడు అలీషన్మాదీ హతం
- ఇజ్రాయెల్ గూఢచార విభాగం మొస్సాద్ కేంద్రకార్యాలయంపై ఇరాన్ క్షిపణులవర్షం

2లో

# ఇది హేయమైన చర్య



2

# ఫోన్ ఇవ్వాల్సిన అవసరం లేదు



2లో

- ఫార్ములా ఈకార్ రేసు కేసులో కెటిఆర్‌కు న్యాయవాదుల సలహా కోర్టు తీర్పు లేకుండా విచారణకు వ్యక్తిగత ఫోన్లు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టీకరణ
- ఈకార్ రేసు ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమం ఇందులో వ్యక్తిగతంగా కెటిఆర్ పాత్ర నామమాత్రమని వివరణ
- మొబైల్ ఫోన్లు అడిగే హక్కు ఎసిబికి లేదని తేల్చిన లాయర్లు



2లో

## ఉక్రెయిన్‌పై రష్యా డ్రోన్లు, క్షిపణుల దాడి: 15 మంది మృతి

## ఈ పిల్లలు పోష్ సొసైటీకి చెందిన వారు కాదనేనా ఈ వెలివేత? -ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**సత్యమేవ జయతే – హైదరాబాద్** : రాష్ట్రంలోని గురుకుల విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గౌలిదొడ్డి సీవోఈ కాలేజీని యథావిధిగా కొనసాగించాలని విద్యార్థినులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు.రేవంత్ రెడ్డి గారు.. కాలేజీల్లో చక్కగా చదువుకుంటూ పేదరికాన్ని జయించాలని, కష్టజీవులైన తల్లిదండ్రులను సంతోష పెట్టాలని.. రెండు లెవల్స్ కఠోర పరీక్ష పాసై గౌలిదొడ్డి-కోడింగ్ పాఠశాలలో

మిగితా 2లో



# టార్గెట్ అరవింద్

-ఆయన నిర్వహించినవిదేశీ, స్వదేశీ పర్యటనల వివరాలనుసేకరిస్తున్న ప్రభుత్వం
-గత ప్రభుత్వంలోఅనేకమార్లు టర్కీ, సింగపూర్,థాయ్‌లాండ్‌లకుటూర్
-జిఎడి,ఇంటెలిజెన్స్‌లనుంచి నివేదికలు కోరిన సర్కార్
గత-ప్రభుత్వంలో ఆయనచేసిన అవినీతిపై సమాచార సేకరణ

2

# బనకచర్లపై అఖిలపక్షం

-సచివాలయంలో ఎంపిల సమావేశం హాజరుకానున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకూ ఆహ్వానం
- అన్ని పార్టీల లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు మంత్రి ఉత్తమ్ లేఖలు బనకచర్లనువ్యతిరేకిస్తూ కేంద్రానికి రాసిన లేఖలను జత చేసిన మంత్రి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్న మంత్రి ఉత్తమ్

2లో



2

# ఇది హేయమైన చర్య

హైదరాబాద్ :బిఆర్ఎస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ నాయకుల ఫోన్లు ట్యాపింగ్ జరిగిందని టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సాక్షిగా ఆయన మంగళవారం జూ బ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ అధికారుల ఎదుట వాంగ్మూలం ఇచ్చారు.అనంతరం మహేష్‌కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి చెందిన వందలాది మంది నాయకుల ఫోన్లను చట్టానికి వ్యతిరేకంగా ట్యాప్ చేశారని మండిపడ్డారు. రాజకీ య నేతల ఫోన్లు ట్యాపింగ్ చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. ఆనాటి సిఎం, కెటిఆర్‌లు సిగ్గుతో తలవంచుకోవాలని అన్నారు. ఏ రాజకీయ నేత, పార్టీ ఉండకూడదని.. తామే శాశ్వతంగా ఉండలనే చెడు ఆలోచనతో ఫోన్ ట్యాపింగ్‌కు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ కదలికలు అన్నీ ట్రాక్ చేశారని మండిపడ్డారు. 2022 నుంచి కాంగ్రెస్ నాయకుల ఫోన్ ట్యాపింగ్ జరిగిందని చెప్పారు. 650 మంది కాంగ్రెస్ నాయకుల ఫోన్లు ట్యాపింగ్ జరిగిందని తెలిపారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఓటమికి ఫోన్ ట్యాపింగే కారణమని పేర్కొన్నారు. ఎలాంటి అధికార హోదా లేని వ్యక్తికి అధికారాన్ని కట్టబెట్టి తమ ఫోన్లను టాప్ చేయించారని ఆరోపించారు. నక్సలైట్ల సానుభూతిపరుల పేరుతో తమ ఫోన్లు టాప్ జరిగాయన్నారు. కెటిఆర్ ఇప్పుడు తాము నీతివంతులం, నిజాయితీపరులమలని అంటున్నారని.. ఆయన సిగ్గుతో తలవంచుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ దుర్మార్గపు చర్య అని, తమ ఫోన్లను ట్యాప్ చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూశారని ఆరోపించారు.నిజాయితీ గల సిట్ అధికారులు ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. భవిష్యత్‌లో మరే ప్రభుత్వం కూడా ఇలాంటి దుశ్చర్యకు పాల్పడకుండా ఉండాలంటే ఈ కేసులో నిందితులకు శిక్ష పడాల్సిందే అని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఎవ్వరినీ ఉపేక్షించవద్దన్నారు. విచారణను సజావుగా జరిపి ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారికి శిక్ష పడేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దేశ చరిత్రలో ఇంత మంది ఫోన్లు ట్యాప్ చేయడం ఇదే ప్రథమం అని పేర్కొన్నారు. హైకోర్టు, సుప్రీం కోర్టు ఈ కేసును తీవ్రంగా పరిగణించి నిందితులను శిక్షించాలని కోరారు. ఆనాటి నేతలు వారి అవసరాల కోసం రాజకీయ నాయకులు, జడ్జిలు, విలేకర్లలతో పాటు వారి హయాంలో పని చేసిన అధికారుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం వారి అవసరాలకు అనుగుణంగా ఫోన్ ట్యాపింగ్‌ను వాడుకుందని ఆరోపించారు. 2023 ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసి హార్డ్ డిస్క్‌లను ప్రభాకర్ రావు ధ్వంసం చేయించారన్నారు. ప్రభాకర్ రావు, అప్పటి చీఫ్ సెక్రటరీ కలిసి హార్డ్ డిస్కులు ధ్వంసం చేశారని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

# ఇరాన్ లొంగిపో

వాషింగ్టన్: ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అల్ ఖమేనీ రహస్య ప్రదేశంలో దాక్కున్నట్లు వార్తల వచ్చిన విషయం తెలిసిందే. ఖమేనీ మట్టుబెడితే తప్ప తమ రెండు దేశాల మధ్య యుద్ధం ఆగదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సైతం తాజాగా ప్రకటించడం విదతమే. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఖమేనీ ఎక్కడ దాగి ఉన్నాడో అమెరికాకు తెలుసు. అయితే ప్రస్తుతానికయితే ఆయనను హతమార్చాలని అనుకోవడం లేదు. ఆయన ఓ ఈజీ టార్గెట్ , ప్రస్తుతానికయితే అక్కడ సురక్షితంగా ఉన్నారు' అని అన్నారు. 'అయితే క్షిపణులు సామాన్య పౌరులను బలి తీసుకోవడాన్ని సైతం మేము కోరుకోవడం లేదు. మా ఓపిక తగ్గిపోతోంది. మీరు ఈ విషయాన్ని నా దృష్టికి తీసుకువచ్చినందుకు థ్యాంక్స్' అని అన్నారు. ఈ మేరకు తన ట్రూత్ సోషల్ మీడియా మంగళవారం ఓ పోస్టును ఉంచారు. అంతేకాదు ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని కూడా ఆయన డిమాండ్ చేశారు.కెనడాలో జరుగుతున్న జీ7 దేశాల శిఖరాగ్ర సదస్సు నుంచి తాను త్వరగా వైదొలగడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా వివరణ ఇచ్చారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ప్లాట్ ఫాం 'ట్రూత్ సోషల్' లో ఒక పోస్టు పెట్టారు. తన నిష్క్రమణపై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ చేసిన వ్యాఖ్యలను ట్రంప్ ఖండించారు. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ప్రయత్నం కోసమే ట్రంప్ అర్ధంతరంగా వెళ్లిపోతున్నారని మాక్రాన్ వ్యాఖ్యానించారు. అయితే, మాక్రాన్ చెప్పిన కారణం సరికాదని, అసలు విషయం వేరే ఉందని ట్రంప్ వివరించారు. "ప్రచారం కోసమే పాకులాడే ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, నేను జీ7 సదస్సు నుంచి వాషింగ్టన్ డీసీకి తిరిగి వెళ్లింది ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ కోసమేనని తప్పుగా చెప్పారు. అది పూర్తిగా అవాస్తవం! నేను వాషింగ్టన్‌కు ఎందుకు వెళ్తున్నానో ఆయనకు తెలియదు, కానీ అది కచ్చితంగా కాల్పుల విరమణకు సంబంధించినది కాదు. అంతకంటే చాలా పెద్ద విషయం. ఉద్దేశపూర్వకంగానో కాదో తెలియదు కానీ, ఇమ్మాన్యుయేల్ ఎప్పుడూ తప్పుగానే చెబుతారు. వేచి చూడండి!" అని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు.

# ఫోన్ ఇవ్వాల్సిన అవసరం లేదు

హైదరాబాద్: ఫార్ములా ఈ విచారణ సందర్భంగా ఎసి బికి కెటిఆర్ మొబైల్ ఫోన్లతో పాటు ల్యాప్‌టాప్ ఇవ్వాలన్న అంశంపై ఆయ న న్యాయవాదులతో కలిసి చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ప్రస్తుతం న డుస్తున్న విచారణ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో నిర్వహించిన క్రీడా కార్యక్ర మానికి సంబంధించినదని, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తర్వాత రేసు నిర్వహణ పూర్తిగా అధికార యంత్రాంగం ద్వారా సాగిందని కెటిఆర్ న్యాయవాదులు ప్రాథమికంగా పేర్కొన్నారు. ఎసిబి ఆదేశాలపై మంగళ వారం కెటిఆర్ న్యాయవాదులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా న్యాయవాదులతో కెటిఆర్ ఫార్ములా ఈ కేసుకు సంబంధించిన న్యాయ పర మైన అంశాలను చర్చించారు. కెటిఆర్‌తో సమావేశం అనంతరం న్యాయ వాదులు ఫార్ములా ఈ కేసుకు సంబంధించిన అంశాలను వెల్లడించారు.ఫార్ములా ఈ వ్యవహారంలో కెటిఆర్ వ్యక్తిగతంగా పరిమిత పాత్ర మాత్రమే వహించారని న్యాయవాదులు తెలిపారు. ఫార్ములా ఈ కేసు అనేది ప్రభుత్వ లావాదేవీకి సంబంధించినదే తప్ప, వ్యక్తిగత సంభాషణకు సంబంధించి కాదు అని న్యాయవాదులు స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ అంశానికి సంబంధించిన అవగాహన ఒప్పందాలతో పాటు ఆయా సంస్థలతో జరిగిన ఒప్పందాలన్నీ ప్రభుత్వానికి అందుబాటులో ఉన్నాయని, జరిగిన ప్రతి నగదు లావాదేవీ అధికారికంగా బ్యాంకుల ద్వారా జరిగినప్పుడు, అప్పట్లో మంత్రిగా ఉన్న కెటిఆర్ వ్యక్తిగత సమాచారం అడిగే హక్కు ఎసిబికి లేదని చెప్పారు. ఇవన్నీ ప్రభుత్వానికి అందుబాటులో ఉన్న సమయంలో కేవలం రాజకీయ వేధింపుల కోణంలో మొబైల్ ఫోన్ అడగడం వెనుక న్యాయసమ్మతమైన కారణాలు ఏమీ లేవు అని న్యాయవాదులు పేర్కొన్నారు.కోర్టు తీర్పు లేకుండా వ్యక్తిగత ఫోన్లను ఇవ్వాల్సిన అవసరం లేదువిచారణ సంస్థలు ఒక పౌరుడి నుండి సేకరించిన సమాచారాన్ని తిరిగి అదే పౌరునిపై వాడే కుట్ర చేయడం అన్యాయమని గతంలో హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టు పలు తీర్పులు ఇచ్చాయని న్యాయవాదులు గుర్తు చేశారు. పైగా, వ్యక్తిగతంగా వాడే ఫోన్లను ఎలాంటి కోర్టు తీర్పు లేకుండా, వాటితో నేరుగా ఆరోపణల సంబంధం లేనప్పుడు ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అంతేకాక, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం, ఐటీ చట్టం ప్రకారం, ప్రైవసీ హక్కులకు విఘాతం కలిగించేలా ఉంటుందని తెలిపారు. ఈ చట్టాల ప్రకారం కేవలం కోర్టు తీర్పు ఉన్నప్పుడు మాత్రమే విచారణ సంస్థలు మొబైల్ ఫోన్, ల్యాప్‌టాప్ లాంటి వ్యక్తిగత డివైసులు అడగవచ్చని వివరించారు. ఎలాంటి ప్రజాప్రయోజనం లేని సందర్భంలో విచారణ సంస్థలు ఇలాంటి ఆదేశాలు ఇవ్వలేవని పేర్కొన్నారు. ఎటువంటి నిధుల దుర్వినియోగం లేకుండా, స్కాం లేని పరిస్థితిలో ఈ కేసు పూర్తిగా రాజకీయ వేధింపుల కోణంలో జరుగుతోందని స్పష్టంగా పేర్కొన్నారు.ఫార్ములా ఈ- కార్ రేసు కేసులో ఎసిబి అధికారులు దూకుడు పెంచారు. బుధవారం(జూన్ 18)లోగా సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ అప్పగించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెట్ కెటిఆర్ ఆదేశాలు జారీ చేశారు. కెటిఆర్ ఉపయోగించిన సెల్ ఫోన్, మ్యాక్ బుక్, ట్యాబ్‌లో కీలక సమాచారం ఉందని ఎసిబి భావిస్తుంది. ఈ ఎలక్ట్రానిక్ పరికరాల నుంచే కెటిఆర్ అధికారులకు ఆదేశాలు జారీ చేసి ఉంటారని ఎసిబి యోచిస్తున్నట్లు తెలిసింది. అయితే, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్టేట్‌మెంట్ ఆధారంగా ఎసిబి అధికారులు డాక్యుమెంట్లను రెడీ సిద్ధం చేస్తున్నారు.కాగా, ఎసిబి ఆదేశాలపై కెటిఆర్ న్యాయవాదులతో చర్చించి, న్యాయసలహా ప్రకారం నడుచుకోవాలని భావిస్తున్నట్లు తెలిసింది. అయితే, ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసులో సోమవారం నాడు కెటిఆర్ ఎసిబి విచారణకు హాజరైన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆయన ఎ1గా ఉన్నారు. ప్రభుత్వ సంస్థల నుంచి అనుమతి లేకుండానే విదేశీ సంస్థకు నగదు చెల్లించినట్లు కెటిఆర్‌పై ఆరోపణలు ఉన్నాయి.

# బనకచర్లపై అఖిలపక్షం

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం తలపెట్టిన గోదావరి-బనకచర్ల లింక్ ప్రా జె క్టు విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక ని ర్ణ యం తీసుకుంది. బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏ ర్పాటు చేసింది. ఈ ప్రాజెక్టుపై అన్ని పార్టీల లోక్ సభ, రాజ్యసభ సభ్యులకు పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ఇవ్వాలని నిర్ణయించింది. రాష్ట్ర సచివాలయంలోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో నే డు సాయంత్రం 4 గంటలకు నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బనకచర్లపై పవర్ పాయింట్ ప్రజేంటేషన్ (పిపిటీ) ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి సిఎం రేవంత్‌రెడ్డి సైతం ముఖ్య అతిథిగా పాల్గొననుండగా కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు బిజెపి, బిఆర్ఎస్, ఎంఐఎం పార్లమెంట్ సభ్యులను కూడా రాష్ట్ర ప్ర భుత్వం ఆహ్వానించింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వారికి ఆహ్వాన లేఖలను పంపించారు.గోదావరి బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేస్తుందని,అందులో భాగంగా 22 జనవరి 2025 న కేంద్ర ఆర్థిక, జల్‌శక్తి మంత్రులకు రాసిన లేఖలను సైతం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్ని పార్టీలకు ఆహ్వాన పత్రికతో పాటు ఈ లేఖలను సై తం పంపించారు. ఈ ప్రాజెక్టు విషయంలో అభ్యంతరాలను తెలుపుతూ జూన్ 3న సిఎం రేవంత్ రెడ్డి తో కలిసి కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్‌ను కలిసి వి షయాన్ని వివరించినట్టుగా ఆ లేఖలో మంత్రి ఉ త్తమ్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని అంశాల ను దృష్టిలో ఉంచుకొని తదుపరి చర్యలు తీసుకునేందుకు నేడు ఈ పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ని ర్వహించబోతున్నట్లు మంత్రి ఉత్తమ్ ఆహ్వాన లేఖ లో తెలిపారు. ఎపి ప్రభుత్వం కేంద్ర జలశక్తి శాఖ వద్దకు బనకచర్ల ప్రాజెక్టును నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపిందని, ప్రాథమిక అధ్యయనంలో, ఈ ప్రాజెక్ట్ 1980 నాటి గోదావరి జల వివాద ట్రిబ్యునల్ అవార్డు, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014ను ఉల్లంఘించినట్లు కనిపిస్తోందని మంత్రి ఉత్తమ్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఈ ఏడాది జనవరి 22వ తేదీన కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ ప్రాజెక్ట్ తెలంగాణ ప్రజల నీటి హక్కులను హరించేలా ఉందని ఆ లేఖలో మంత్రి పేర్కొన్నారు. దీనిపై స్పందించిన కేంద్ర జల్‌శక్తి శాఖ తమకు ఎపి నుంచి ఎలాంటి డిపిఆర్ అందలేదని పేర్కొంది. ఆ తర్వాత కూడా పలుమార్లు మంత్రి ఉత్తమ్ కేంద్రానికి లేఖలు రాశారు. ఎపి జలశక్తి శాఖకు ప్రతిపాదనలు పంపినందున దీనిని అడ్డుకునేందుకు ఎలా ముందుకెళ్లాలన్న విషయం చర్చించేందుకు రావాలని అన్ని పార్టీలకు మంత్రి ఉత్తమ్ విజ్ఞప్తి చేయడంతో నేడు అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించి అప్పుడు, ఇప్పుడు సిఎం చంద్రబాబు సానుకూలంగా ఉన్నారని ఆంధ్రప్రదేశ్ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. ఎపి సచివాలయంలో మంగళవారం ఆయన బనకచర్ల ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో తగిన మదింపు లేకుండా ఎగువన ప్రాజెక్టులు కడితే నష్టపోయేది ఎపి రైతులేనన్నారు. దిగువ పరీవాహక ప్రాంతాల ప్రత్యేక హక్కులు గురించి మాత్రమే చంద్రబాబు మాట్లాడారని ఆయన పేర్కొన్నారు. అంతే తప్ప తెలంగాణ ప్రాజెక్టులను ఆపాలనే ప్రయత్నం కాదన్నారు. గతంలో సీతమ్మ బ్యారేజీ, సీతారాం సాగర్ లిఫ్టును కూడా తాము వ్యతిరేకించ లేదన్నారు. గోదావరి నుంచి ఇతర రివర్ బేసిన్‌లకు నీటిని తరలించే హక్కు చట్టం ప్రకారం తమకు ఉందని ఆయన స్పష్టం చేశారు. ఆ చట్టం ప్రకారమే తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టును కట్టారని, ఎపిలోనూ తాము బనకచర్ల ప్రాజెక్టును చేపడుతున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

# టార్గెట్ అరవింద్

హైదరాబాద్ : ఫార్ములా ఈ రేస్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కు మార్ విదేశీ, స్వదేశీ పర్యటనలపై ప్రభు త్వం ఆరా తీస్తోంది. 2018నుంచి2023 వరకు ఆయన విదేశీ పర్యటనలకు ఎన్నిసార్లు వెళ్లారు, ఎన్నిసార్లు ప్రభుత్వ అనుమతి తీసుకున్నారు, ఏయే రాష్ట్రాలకు, ఏ యే దేశాలకు ఆయన వెళ్లారన్న దానిపై జి ఏడితో పాటు ఇంటెలిజెన్స్ నుంచి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం సూచించినట్టుగా స మాచారం. ప్రస్తుతం ఆయన విదేశీ పర్యటన నిమిత్తం సెలవు పెట్టారు. ఈ నెలాఖరులోగా ఆయన తిరిగి ఇండియాకు రానున్నారు. ఈ నేపథ్యంలోన ఆయన విదేశీ ప ర్యటనకు సంబంధించి పలు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నివేదికను అడిగినట్టుగా తెలిసింది. ఇప్పటికే ఆ యన గత ప్రభుత్వంలో చేసిన పర్యటనల పై అనేక ఆరోపణలు వెల్లువెత్తుతుండడతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా సమాచారం. గత ప్రభుత్వంలో ఆయన పలు శాఖలకు ఇన్‌చార్జీ అధికారిగా పనిచేశారు.సుమారుగా ఐదు నుంచి ఆరు శాఖలను చాలా ఏళ్లు ఆయన పర్యవేక్షించారు. ఈ నేపథ్యంలోనే ఆయన ఆయా శాఖల పేర్లు చెప్పి రాష్ట్ర, విదేశీ పర్యటనలకు వెళ్లినట్టుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.దీంతోపాటు ఆ శాఖలకు సంబంధించి 7 వాహనాలను ఆయన వాడుకునేవారని, ఎ ప్పుడు ఏ వాహనంలో వెళతారన్నది రహస్యంగా ఉంచేవారని తెలిసింది. దీంతోపా టు ఆయన ఎప్పుడు ఎక్కడ ఉంటారో కూ డా ఎవరికి తెలియకుండా అతి సన్నిహితులకే తన సమాచారం ఇచ్చే వారని, వారికి వాట్సాప్‌లో సూచనలు ఇచ్చేవారని సమాచారం. అనధికారికంగా ఈ పర్యటనలకు వెళ్లినా ఆయన దగ్గర ఉన్న శాఖల నుంచే ఈ ఖర్చులను చెల్లించేవారని తెలుస్తోంది. దీనివల్ల కోట్లలో ప్రభుత్వ ధనం దుర్వినియోగం అయ్యిందని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడం విశేషం.%ఆయనకు గత ప్రభుత్వంలో పలువురు మంత్రులతో దగ్గరి సంబంధాలు ఉండడం, అప్పటి సిఎస్‌తోనూ చనువు ఉండడంతో ఆయన ఏం చేసినా నడిచేదని, అందుకే ఆయన తన పర్యటనల విషయంలో ఒక్కోసారి అధికారికంగా జిఏడి అనుమతి తీసుకునే వారని, ఒక్కోసారి అనుమతి లేకుండా, సెలవు పెట్టకుండానే అనధికారికంగా వెళ్లే వారని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. అందులో భాగంగా ఈ విషయమై నిజానిజాలను తెలుసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్టుగా సమాచారం.అయితే, ఆయన ఎక్కువగా విదేశీ పర్యటనలకు సంబంధించి టర్కీ, థాయిలాండ్, సింగపూర్‌లతో పాటు మన దేశంలోని గోవా, ఢిల్లీ, ఊటీలకు అధికంగా వెళ్లేవారని ఆయన అక్కడకు ఎందుకు వెళ్లారన్నది ప్రశ్నార్థకంగా ఉండేదని, చాలాసార్లు ఈ పర్యటన గురించి ఎవరికీ తెలిసేది కాదని సమాచారం. ఇలా ఆయన కొన్నిసార్లు విదేశీ పర్యటనకు వెళ్లడానికి క్షణాల్లో ఆయనకు జిఏడి అనుమతి ఇచ్చేదని తెలిసింది. దీంతోపాటు ఆయన ఇన్‌చార్జీగా ఉన్న శాఖలకు సంబంధించి పైళ్లకు సంబంధించి సూచనలన్నీ వాట్సాప్ ద్వారానే నడిచేదని, ఆయా శాఖల్లో ఒక్కొక్కరిని తన అనుచరులుగా నియమించుకొని అక్రమ వ్యవహారాలను వారితో నడిపేవారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలోనూ ఆయన ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా పనిచేసినప్పుడు తనకు కేటాయించిన నివాస భవనాన్ని 2023 వరకు అలాగే పెట్టుకున్నారని, నెలలో చాలాసార్లు ఢిల్లీలోని ఆ భవనంలో అనధికారిక కార్యక్రమాలను ఆయన నిర్వహించేవారన్న ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి.

## ఉక్రెయిన్‌పై రష్యా డ్రోన్లు, క్షిపణుల దాడి: 15 మంది మృతి

%రష్యా రాత్రిపూట ఉక్రెయిన్‌పై జరిపిన డ్రోన్లు, క్షిపణుల దాడిలో కనీసం 15 మంది చనిపోగా, 116 మందికి గాయాలయ్యాయి. మంగళవారం వారంతా తమ ఇళ్లలో, స్థానిక కార్యాలయాలలో నిద్రిస్తున్నప్పుడు బలయ్యారు. రాత్రి పూట గంటల తరబడి నగరం అంతటా పేలుళ్ల శబ్దాలు ప్రతిధ్వనించాయని, నగరంలో 14 మంది మరణించారని, 99 మంది గాయపడ్డారని కీవ్ నగర సైనిక పాలనాధిపతి తైమూర్ తకాచెంకో తెలిపారు. బాంబు దాడి తొమ్మిది అంతస్తుల నివాస భవనాన్ని కూల్చి వేయగా, డజన్ల కొద్దీ అపార్టుమెంట్లు ధ్వంసమయ్యాయి. అత్యవసర సిబ్బంది శిథిలాల నుండి ప్రజలను రక్షిస్తున్నారు. 'ఈ దాడి కీవ్‌పై జరిగిన ఓ భయంకర దాడి' అని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమీర్ జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. యుద్ధాన్ని రష్యా అధ్యక్షుడు కావాలని కొనసాగిస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. రాత్రి వేళ రష్యా 440 డ్రోన్లను, 32 క్షిపణులను ఉక్రెయిన్‌పై ప్రయోగించిందని కూడా ఆయన అన్నారు.

## కమల్ హాసన్ చిత్రం థగ్ లైఫ్ విడుదల వివాదం

కమల్ హాసన్ నటించిన థగ్ లైఫ్ సినిమా ప్రదర్శనను నిషేధించవలసిందిగా కర్ణాటక థియేటర్ యజమానులపై తుపాకి గురిపెట్టి బెదిరించలేమని సుప్రీంకోర్టు పేర్కొంది.కన్నడ భాషపై కమల్ హాసన్ వివాదాస్పద వ్యాఖ్యల తర్వాత కర్ణాటకలో ఆ చిత్రం పై నిషేధం విషయంలో సుప్రీంకోర్టు మంగళవారం నాడు తీవ్రంగా స్పందించింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సిబిఎఫ్ సి) సర్టిఫైడ్ సినిమా ఏదైనా విడుదల చేయాల్సిందేనని చట్టం నిర్దేశిస్తోందని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. కర్ణాటకలో థగ్ లైఫ్ సినిమాపై నిషేధాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ పై బుధవారంలోగా తన ప్రతిస్పందనను దాఖలు చేయాలని సుప్రీంకోర్టు కర్ణాటక ప్రభుత్వాన్ని కోరింది. కర్ణాటక హైకోర్టు ముందు పెండింగ్ లో ఉన్నవిషయాన్ని కూడా బదిలీ చేసింది. ఈ వివాదంలో నటుడిని క్షమాపణ కోరాల్సిన అవసరం కానీ, పని కానీ తమకు లేదని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది.సిబిఎఫ్ సి సర్టిపికేట్ ఉన్న ఏ సినిమానైనా విడుదల చేయాలన్నది రూల్ ఆఫ్ లా అని, రాష్ట్ర ప్రభుత్వం ఆ చిత్రం ప్రదర్శన జరిగేటట్లు చూడాలని కోర్టు పేర్కొంది. సినిమా హాళ్లు తగులపడతాయనే భయంతో సినిమాను ప్రదర్శించకూడదనడం సరికాదని పేర్కొంది. జనం సినిమాను చూడకపోవచ్చు. అదివేరే విషయం. జనాలు సినిమా చూడాలని కోర్టు ఎలాంటి ఆదేశాన్ని జారీ చేయడంలేదు. అయితే సినిమామాత్రం విడదల చేయాలని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది.రేపటిలోగా సమాధానం దాఖలు చేయాలని కర్ణాటక ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. బ్యాన్ విషయంలో రాష్ట్రప్రభుత్వం చేసిన వాదనను కోర్టు తిరస్కరించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇలా వ్యవహరించకూడదని, ఇలా జరగడానికి మేము అనుమతించబోమని ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాదికి స్పష్టం చేసింది. జూన్ 20లోపు చిత్రం సహనిర్మాత దాఖలు చేసిన రిట్ పిటిషన్ పరిశీలనకు వస్తుందని, ఆ సమయంలో దీనికి పరిష్కారం లభించే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వం చేసిన వాదనను కూడా కోర్టు తిరస్కరించింది.ఈ ఉదంతం మొత్తం చట్టబద్ధమైన పాలన, ప్రాథమిక హక్కులకు సంబంధించినది. అందుకే కోర్టు జోక్యం చేసుకోవలసి వచ్చిందని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది.నాథూరామ్ గాడ్సే బోల్తే నాటకం విషయంలో కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్ గఢి కేసులో కోర్టు ఇచ్చిన తీర్పును కూడా ధర్మాసనం ప్రస్తావించింది. ఈ తీర్పు విషయంలో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆమోదిస్తూ, నాటకంపై నిషేధాన్ని విషయాన్ని సుప్రీం గుర్తుచేసింది. ఆ నాటకంలో జాతిపితపై విమర్శనాత్మక వ్యాఖ్యలు ఉన్నాయి. దీంతో తీవ్ర గందరగోళం నెలకొంది. .మహారాష్ట్ర ప్రభుత్వంఆ నాటకాన్ని నిషేధించింది. అయితే జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలో హైకోర్టు ధర్మాసనం దానిని పక్కన పెట్టింది. గాంధీని జాతిపితగా గౌరవించవచ్చు నని,అయితే భిన్నమైన అభిప్రాయాలను నిరోధించలేమని, ఇది వాక్ స్వాతంత్రానికి సంబంధించిన విషయం అని పేర్కొన్నారు.జూన్ 13నే సిబిఎఫ్ సి సర్టిఫైడ్ కమల్ హాసన్ థగ్ లైఫ్ చిత్రం కర్ణాటకలో ప్రదర్శనపై వాస్తవ నిషేధాన్ని ప్రశ్నిస్తూ దాఖలైన పిటిషన్ పై సుప్రీంకోర్టు కర్ణాటక ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిస్పందన ను కోరింది.

## ఇజ్రాయెల్ఇరాన్ యుద్ధం ఆగాలి..జి7 సదస్సు పిలుపు



ఇజ్రాయెల్, ఇరాన్‌లు వెంటనే యుద్ధం ఆపాలని ఇక్కడ జరుగుతున్న ఏడు దేశాల జి7 శిఖరాగ్ర సదస్సు పిలుపునిచ్చింది. అయితే ఇరాన్ అణు బాంబును సముపార్జించుకోకుండా ఆపాల్సిన అవసరం ఉందని కూడా స్పష్టం చేసింది. ఈ మేరకు సమావేశంలో పాల్గొంటున్న ఏడు దేశాల నేతలు సంతకాలతో ఓ సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. 'మధ్యప్రాచ్యంలో శాంతి, సుస్థిరతకు మా కృతనిశ్చయాన్ని పునరుద్ఘాటిస్తున్నాం. ఈ దృష్టా ఇజ్రాయెల్‌కు తనను తాను కాపాడుకునే హక్కు ఉంది. ఇజ్రాయెల్ భద్రతకు మా మద్దతును మేము పునరుద్ఘాటిస్తున్నాం.అలాగే పౌరుల రక్షణకు ప్రాధాన్యతను కూడా మేము నొక్కి చెప్తున్నాం. ప్రాంతీయ అస్థిరతకు, ఉగ్రవాదానికి మూల కారణం ఇరానే. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగి ఉండరాదని మేము మొదటినుంచీ స్పష్టం చేస్తూనే ఉన్నాం. ఇరాన్ సంక్షోభాన్ని పరిష్కరించడంవల్ల గాజాలో కాల్పుల విరమణతో పాటుగా మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తగ్గడానికి దారితీస్తుంది.అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై ఈ ఉద్రిక్తతల ప్రభావంపై మేము అప్రమత్తతో ఉంటాం. అలాగే మార్కెట్ సుస్థిరత కోసం భావసారూప్యం కలిగిన భాగస్వాములతో కలిసి పనిచేయడానికి మేము సిద్ధంగా ఉన్నాం' అని ఆ ప్రకటన పేర్కొంది.కాగా ఇరాన్ ఇజ్రాయెల్‌లు తక్షణం చర్చలు ప్రారంభించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించారు.జి7 కూటమి సదస్సు సోమవారం ఇక్కడ ప్రారంభమైంది. ఈ సందర్భంగా పలువురు నేతలు విలేకరులతో మాట్లాడారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నివారించడమే లక్ష్యంగా ఒక పరిష్కారాన్ని కనుగొనాలని తామంతా నిర్ణయానికి వచ్చామని బ్రిటీష్ ప్రధాని కియర్ స్టార్మర్ చెప్పారు. ఇజ్రాయెల్ ఇరాన్ యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గాజాలోనూ పరిస్థితి మరింత విషమించే అవకాశం ఉందన్నారు. అణ్వాయుధాలను సొంతం చేసుకోవడానికి ఇరాన్‌ను అనుమతించకూడదని జర్మనీ చాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ చెప్పారు.మరో వైపు జి7 కూటమిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. 2014లో రష్యాను కూటమినుంచి తొలగించడం పొరపాటేనని చెప్పారు. రష్యాను పక్కన పెట్టడం ఇప్పుడు ప్రపంచాన్ని అస్థిర పరుస్తోందని అభిప్రాయపడ్డారు. జి7 ఇక జి8 కావాలని, జి9 అయితే ఇంకా బాగుంటుందని పేర్కొన్నారు. రష్యా, చైనాలు సైతం కూటమిలో చేరాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. ప్రస్తుతం జి7లో ఫ్రాన్స్, అమెరికా, బ్రిటన్, జర్మనీ, జపాన్, ఇటలీ, కెనడా, యూరోపియన్ యూనియన్ (ఇయు) సభ్య దేశాలుగా ఉన్నాయి. భారత్ కూటమిలో సభ్య దేశం కానప్పటికీ ఈ ఏడాది కూటమి సదస్సుకు ప్రధాని మోడీని కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ ప్రత్యేకంగా ఆహ్వానించారు. కాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అర్ధంతరంగా సదస్సునుంచి వెళ్లిపోవడంతో ఆయనతో వాణిజ్య అంశాలపై చర్చలు జరిపే అవకాశాన్ని మోడీ కోల్పోయినట్లు పరిశీలకులు అంటున్నారు. మోడీ మంగళవారం సదస్సునుద్దేశించి ప్రసంగించనున్నారు.

## ఈ పిల్లలు పోష్ సొసైటీకి చెందిన వారు కాదనేనా ఈ వెలివేత? : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

చేరిన ఈ బిడ్డలు వారి తల్లిదండ్రులు నిన్న హైదరాబాద్‌లోని సంక్షేమ భవన్‌లో ఆమరణ నిరాహారదీక్షకు పూనుకోవడం మీ కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయం అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.కేసీఆర్ హాయాంలో అడ్మిషన్ల కోసం వేలాది మంది పేదలతో కిటకిటలాడిన ఈ ప్రాంగణం, నేడు కాంగ్రెస్ పాలనలో ఆర్తనాదాల హోరుతో మార్మోగిపోతోంది. ఈ పిల్లలు- వాళ్ల తల్లిదండ్రుల నీడ కూడా తమ మీద పడకుండా 'జాగ్రత్తలు' తీసుకుని వీళ్ల కన్నీళ్లు తుడవకుండానే భారీ పోలీసుల పహారా మధ్య దొడ్డి దారిన వెళ్లిపోయారు సంక్షేమ అధికారులు. ఈ పిల్లలు పోష్ సొసైటీకి చెందిన వారు కాదనేనా ఈ వెలివేత? అని ఆర్ఎస్పీ నిలదీశారు.నిన్న రాత్రి పోలీసులు తల్లిదండ్రులను అరెస్టు చేసి ఆకలితో అలమటించిన ఈ పిల్లలను పారదోలారు! మా బిడ్డల భవిష్యత్తును కాలరాస్తున్న మిమ్ములనెవరినీ చరిత్ర క్షమించదు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.. మీరైనా వీళ్ల ఆవేదనను సహృదయంతో అర్థం చేసుకుంటారని భావిస్తున్న. తరగతి గదిలో ఉండాల్సిన బిడ్డలు తారు రోడ్ల మీదికి రాకూడదు అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

సత్యమేవ జయతే



## ధన్నారం లో భూ భారతి రెవిన్యూ సదస్సు..



సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా...వికారాబాద్ మండలం ధన్నారం లో భూ భారతి రెవిన్యూ సదస్సు జరుగుతుంది.రైతులు భూ భారతి ద్వారా సమస్యలు పరిష్కారం చేసుకొవాలి అన్నారు. ఆర్ ఓ ఆర్ చట్టం అమలులో కి వచ్చింది అని తహసీల్దార్ లక్ష్మి నారాయణ తెలిపారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు జంగయ్య. ఆర్ ఐ నరేష్ సిబ్బంది కృష్ణ సుదర్శన్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు..

## గిరిగేట్ పల్లి భూములకు ఆన్ లైన్ చేసిన కలెక్టర్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వికారాబాద్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్. సామ రామచంద్ర రెడ్డి...





సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా..గిరి గేట్ పల్లి కోటంగుంట తండా రైతులకు సర్వే చేయించారు ఎన్నో ఏళ్లుగా కబ్జాల ఉంటూ వారికి ఆన్లైన్ కాకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వికారాబాద్ ఎమ్మెల్యే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చొరవతో మా యొక్క భూములు ఆన్ లైన్ అయిందని కొట్టం గుట్ట తండా రైతులు తెలిపారు మంగళవారం ఉదయం కలెక్టర్ ను అడిషనల్ కలెక్టర్ ను ఆర్డిఓను కలిసి వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ యొక్క భూమిని మా వెంట ఉండి ఎంతో కష్టపడి రాత్రి అంతా పగలనక శ్రద్ధచూపిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సామ రామచంద్రారెడ్డి శాలువాతో సన్మానం చేశారు మాకు భూములు అయినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు..

## రాజ్యాంగం కల్పించిన నా హక్కును నాకు తెలియకుండానే కాలా రాస్తున్న వారి పై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా. రాజ్యాంగం కల్పించిన నా హక్కును నాకు తెలియకుండానే కాలా రాస్తున్న వారి పై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జడ్పిటిసి ఫోరం మాజీ అధ్యక్షుడు పీలారం పట్లోళ్ల మహిపాల్ రెడ్డి డిమాండ్ చేశారు.

ఫోన్ టాపింగ్ కేసులో వికారాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జడ్పిటిసి ఫోరం మాజీ అధ్యక్షుడు పీలారం పట్లోళ్ల మహిపాల్ రెడ్డికి ప్రత్యేక విచారణ బృందం (సీట్)
విచారణ చేసింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కీలక నేతగా మైపాల్ రెడ్డితో ఎవరెవరుమాట్లాడుతున్నారనే సమాచారాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం తెప్పించుకున్నట్లుగా ఫోన్ టాపింగ్ కేసు విచారణలో గుర్తించిన సిట్ విచారణ చేసిన
అనంతరం మైపాల్ రెడ్డి తన నివాసం లో సిట్ విచారణ వెల్లడించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీకి కీలక నేతగా ఉండడాన్ని చూసి టిఆర్ఎస్ ప్రభుత్వం తన ఫోను టాపింగ్ చేసిందని అన్నారు. ఈ విషయాన్ని అప్పటి ఎమ్మెల్సీ మంత్రి మహేందర్ రెడ్డి కూడా తనకు తెలియజేశారని వివరించారు అదేవిధంగా విఆర్ఎస్ తో పాటు కాంగ్రెస్ నాయకులకు కూడా తమ ఫోన్ టాపింగ్ చేశారని వివరించడం జరిగిందని తాను ఎవరెవరితో మాట్లాడారు ఎందుకు మాట్లాడారు అనే ఫోన్ నెంబర్లతో సహా సీట్ అధికారులు అడిగినట్లుగా తెలియజేశారు . ఎవరికీ తెలియని తన పోన్ నంబరు ను కూడా టాపింగ్ చేశారని అన్నారు. ఇలా చేయడం సరి కాదని అన్నారు రాజ్యాంగం కల్పించిన హక్కులను కొందరు రాజకీయ నాయకులు అధికారులు ఇలా చేస్తున్నారని ఇలాంటి వారిపై ప్రభుత్వం వెంబడి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కోట్లల్లో ప్రకటనలు.. పిల్లర్లకే పరిమితమైన పనులు..



సత్యమేవ జయతే - ఆదిలాబాద్ ఆదిలాబాద్ : ప్రతి రోజు కోట్ల రూపాయల అభివృద్ధి జరుగుతోందంటూ ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనల వర్షం కురిపిస్తుంటే.. మరోవైపు అభివృద్ధి పనులు మాత్రం ఎక్కడికక్కడ నిలిచిపోయిన పరిస్థితి నెలకొంది. ఆదిలాబాద్ పట్టణంలోని కైలాస్ నగర్‌లో చిరు వ్యాపారుల సౌకర్యార్థం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను ప్రారంభించారు.పనులు పూర్తి చేసేందుకు గతంలో నిధులు సైతం మంజూరు కాగా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు పిల్లర్ల వద్దనే ఆగిపోయాయి. వందలాది మంది వ్యాపారం చేసుకోవాల్సిన స్థలం.. సగం పనులతో నిర్మానుష్యంగా కనిపిస్తుండడం ప్రభుత్వ చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతుంది. నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయాలని ఇటీవల మాజీ మంత్రి జోగు రామన్న సైతం జిల్లా ఉన్నతాధికారులను కలిసి నివేదించారు.

# మోమిన్ పేటలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మన్నే శంకర్.





సత్యమేవ జయతే మోమిన్ పేట్/ మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సీఎం ఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ 13 మందికి 8,65,,500 రూపాయలు ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ బడుగు బలహీన వర్గాలకు ప్రతి ఒక్కరికి ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స కొరకు ఎన్నో రూపాయలు ఖర్చు చేసుకొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సీఎంఆర్ఎఫ్ డబ్బులు ఎంతో దోహదపడుతుందన్నారు. మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎంతోమందికి ఎన్నో రకాలుగా ఉపయోగపడుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నుండి మనకెంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుభాష్ గౌడ్, సురేందర్, మహంత్ స్వామి, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి. మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, ఆర్ ఐ గోవర్ధన్.

సత్యమేవ జయతే మోమిన్ పెట్/ గ్రామాలలో భూ సమస్యలు ఉన్న ప్రతి రైతు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మోమిన్ పేట్ మండల కేంద్రంలో, మోరంగపల్లి గ్రామాలలో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసింది. భూ రికార్డులలో ఏవైనా తప్పులు, ఒప్పులు, పేర్లు సవరణలు, విస్తీర్ణం, హెచ్చుతగ్గులు, ఆర్ఎస్ఆర్, మొటేషన్ వారసత్వం, విరాసత్, భూములు సరి చేయడం జరుగుతుందన్నారు. నిర్దేశిత జాబితాలలో ఉన్న భూమి సమస్యలు సర్వేనెంబర్ మిస్సింగ్, పట్టాదారు పాసుబుక్కు, లేకపోవడం హద్దులు నిర్ధారణ, వంటి సమస్యలు సరి చేసుకోవాలన్నారు. ఏమైనా తప్పులు ఉంటే గ్రామంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ గోవర్ధన్, రాందాస్, మాజీ సర్పంచ్ మానేయ, వెంకట్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ ఒగ్గు మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## రెవిన్యూ సదస్సులతో గ్రామాల్లోని భూ సమస్యల పరిష్కారం



సత్యమేవ జయతే/హత్నూర: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులతో గ్రామాల్లోని భూ సమస్యలు పూర్తిగా పరిష్కారం కానున్నాయని హత్నూర తహసీల్దార్ ఫర్హీన్ షేక్ అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని కాసాల గ్రామంలో రెవిన్యూ సదస్సును నిర్వహించగా రైతుల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి దరఖాస్తును స్వీకరించనున్నట్లు, అలాగే విచారణ చేసి పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం ద్వారా రెవిన్యూ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రైతులందరూ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇచ్చిన ప్రతి దరఖాస్తును రికార్డ్ చేసి సమస్యను పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ దావూద్, పంచాయతీ కార్యదర్శి స్వప్న, రెవిన్యూ సిబ్బంది చరణ్, నారాయణ, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పంట రుణాల కోసం రైతుల బ్యాంకు బాట

సత్యమేవ జయతే - ఆదిలాబాద్ ఆదిలాబాద్ : వానకాలం సీజన్ ప్రారంభం కావడంతో పంట సాగు చేయడానికి పెట్టుబడి కోసం రైతులు బ్యాంకుల బాట పట్టారు. సాగుకు కావలసిన విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చుల కోసం పంట రుణం తీసుకోవడానికి అన్నదాతలు వివిధ బ్యాంకులకు వెళ్తున్నారు. గత పంట రుణం వడ్డీతో చెల్లించి తిరిగి కొత్త రుణం తీసుకుంటున్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎకరానికి రూ. 5వేలు పంట పెట్టుబడి సాయం కింద అన్నదాతలకు అందజేశారు. ఈ సాయం వల్ల రైతులకు కొంత ఉపశమనం లభించేది. అయితే గత యాసంగి, వానకాలం సీజన్లు రైతులకు ప్రభుత్వం సాయం అందించలేదు. కొందరికి సాయం ఇచ్చినప్పటికీ నాలుగు ఎకరాల వారికే అందింది. ఇప్పుడు సైతం సాయం అందిస్తామని హామీలు ఇచ్చారు. రైతులు మాత్రం ఆ సాయం కోసం ఎదురు చూడకుండా బ్యాంకు రుణం మీదనే ఆధార పడి ఉన్నారు. పంటను బట్టి ఎకరానికి రూ. 45వేలకు పైగా రుణం అందిస్తుండటంతో రుణాల కోసం రాజు బ్యాంకులకు రైతులు బారులుదీరుతున్నారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు, పాక్స్, యూనియన్ బ్యాంకుల్లో పంట రుణాలను రైతులు తీసుకుంటున్నారు. రుణాలు అందిస్తున్నప్పటికీ రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆధార్ కార్డుతో ఫోన్ లింక్ ఉంటేనే రుణం అందుతుంది. రైతుల వివరాలు, భూమి వివరాలు బ్యాంకు యాప్ ద్వారా తీసుకోవాలంటే రైతుకు ఓటీపీ రావాల్సి ఉంది. ఓటీపీ వస్తేనే



రైతు వివరాలతో కూడిన డాక్యుమెంట్ డౌన్‌లోడ్ అవుతుంది. అలా డౌన్‌లోడ్ అయితేనే రైతుకు రుణం అందిస్తున్నారు. ఓటీపీ లేని రైతులకు రుణం అందడం లేదు. దీంతో చాలా మంది రైతులు ఓటీపీ రాక వెనుదిరిగి పోవాల్సి వస్తుంది. నెన్నెలలోని తెలంగాణ బ్యాంకుల్లో రోజుకు 20 మంది రైతుల వరకే రుణాలు ఇస్తున్నారు.

# మినీస్టేడియం నిర్మాణ పనులకు టెండర్లు.. ఇప్పటికీ పూర్తికాని అగ్రిమెంట్



సత్యమేవ జయతే – కరీంనగర్ కరీంనగర్ : సారంగాపూర్ మండలంలోని పోతారం పంచాయతీ పరిధిలోని గణేషపల్లి శివారులో మినిస్టేడియం, స్విమ్మింగ్ పూల్స్ నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.2.85కోట్లు మంజూరు చేసింది. మినిస్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి 8.06 ఎకరాల ప్రభుత్వ భూమిని తహసిల్దార్ కేటాయించారు. టెండర్ల ప్రక్రియ పూర్తయినప్పటికీ నిధుల లేమితో అగ్రిమెంట్ కాక నిర్మాణ పనులకు మోక్షం లేకుండా పోయింది. 2016–17 సంవత్సరంలో మినీస్టేడియం ఏర్పాటు కోసం గణేషపల్లి శివారులో స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వానికి అధికారులు నివేదించారు. దీంతో నాటి కేసీఆర్ ప్రభుత్వం 2.65 కోట్లు కేటాయిస్తు నిధులు విడుదల చేసింది. సంబంధిత శాఖ అధికారులు టెండర్ల ప్రక్రియను పూర్తి చేశారు.

మినిస్టేడియంలో అవుట్ డోర్ ఇండోర్ గేమ్స్ ఆడుకునేందుకు అనుకులాంగా ఉంటుంది. కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్, టెన్నిస్, బ్యాడ్మింటన్‌తోపాటు ఇతర ఇండోర్ గేమ్స్ ఉంటాయి. రెండు స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటు చేస్తుండగా ఇందులో ఒకటి చిన్నది. మరోకటి పెద్దగా ఉంటుంది. మొదట మినీస్టేడియం, స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటుకు అధికారులు పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం రూ. 2.65కోట్లు మంజూరు చేయగా, పూర్తి స్థాయిలో మినిస్ట్రేడియం, స్విమ్మింగ్స్ పూల్స్ నిర్మాణం చేపట్టడం, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు అదనంగా మరో రూ. 35 లక్షలు మంజూరీకి ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు పేర్కొన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తి అయిందని కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ కాక పోవడంతో మండలంలో మినీస్టేడియం, స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు కలగానే మిగలనుందని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

# ప్రజలకు పనికొచ్చేవి చేయండి



## కొత్తపల్లి మాజీ సర్పంచ్ జితేందర్ రెడ్డి

సత్యమేవ జయతే – కరీంనగర్
కరీంనగర్ : ఎమ్మెల్యే ఆన్ వీల్స్ పేరుతో పనిచేస్తున్న ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణకు కొత్తపల్లి మాజీ సర్పంచ్ జితేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఈ కార్యక్రమంలో ప్రజలకు పనికొచ్చేవి చేస్తే మరింత మంచిదంటూ సూచించారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. ఎమ్మెల్యే ఆన్ వీల్స్ లో చేస్తున్న పనుల్లో పూర్తి సమాచారం తెలుసుకొని పనిచేస్తే బాగుండేది అని అభిప్రాయపడ్డారు. ప్రజల సౌకర్యార్థం దారి బాగు చేస్తే మీకు కబ్జా లాగా కనిపిస్తున్నదని మండిపడ్డారు. గ్రామ అభివృద్ధి కోసం వంకరగా ఉన్న 18ఫీట్ల నక్ష తోవను, సరిగ్గా చేసి 30ఫీట్లుగా మార్చామని తెలిపారు. నక్షతోవకు కల్వర్టు అడ్డంగా ఉండేదనీ, దాన్ని కొంచెం పక్కకు జరిపి నేరుగా హైవేకి అనుసంధానం చేశామని చెప్పారు. ఇవేవీ తెలియని ఎమ్మెల్యే పీఏ మురళీధర్ రెడ్డి, గ్రామానికి చెందిన మరోవ్యక్తి రోడ్డుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అప్పటి సర్వేయర్ సమక్షంలోనే రోడ్డును అభివృద్ధి చేశామనీ, అందులో ఎలాంటి అక్రమాలకు తావులేదని స్పష్టం చేశారు.

– ప్రజల సొమ్మును హరించే పీఏను దూరం పెట్టండి..

ప్రజలు కష్టపడి పనిచేసి నాలుగు రాళ్ళు వెనకేసుకుంటే వాటిని కూడా హరిస్తున్న ఎమ్మెల్యే పీఏను ఆయన ఎందుకు దగ్గర పెట్టుకుంటున్నాడో అర్థం కావడం లేదని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మీకు మీ పీఏ అరాచకాల కారణంగానే మంత్రి పదవి రాలేదనీ, ఇప్పటికైనా అతన్ని దూరం పెడితే మీకే మంచిదని హితవు పలికారు. గ్రామస్తుల ఆశీర్వాదంతో మూడుసార్లు సర్పంచిగా పనిచేసిన తాను ప్రజల శ్రేయస్సుకు పాటుపడడమే తప్ప ఎవరికీ అన్యాయం చేసిందే లేదన్నారు. ఎమ్మెల్యే ఆన్ వీల్స్ పేరుతో ఓ తప్పుడు ఫిర్యాదు సృష్టించి, గ్రామాభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేయవద్దని ఎమ్మెల్యే కవ్వంపల్లిని కోరారు.

# కాంగ్రెస్ నేత అరాచకాలతో బీఆర్ఎస్ నేత ఆత్మహత్యాయత్నం

## కేటీఆర్ అన్న నా కుటుంబాన్ని ఆదుకో..








సత్యమేవ జయతే – రాజన్న సిరిసిల్ల రాజన్న సిరిసిల్ల : కాంగ్రెస్ నేత భూమి కబ్జా చేసిండు.. నాకు ఏ ఫ్లాటు లేదు.. నా బిడ్డ పెండ్లి చేయాలే.. నా కుటుంబాన్ని ఆదుకో కేటీఆర్ అన్న అంటూ లేఖ రాసి బీఆర్ఎస్ సీనియర్ నేత, తాజా మాజీ ఎంపీటీసీ కర్మబోయిన కుంటయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్‌లో జరిగింది. తన చావుకు కాంగ్రెస్ నేతలే కారణమంటూ లేఖలో పేర్కొనడం స్థానికంగా కలకలం రేపింది.

వివరాల్లోకి వెళితే.. అంకుసాపూర్ గ్రామానికి చెందిన కర్మ బోయిన కుంటయ్య కొంతకాలంగా బీఆర్ఎస్ పార్టీలో చురుగ్గా పనిచేస్తున్నాడు. గతంలో దుబాయికి వెళ్లి వచ్చిన ఆయన తర్వాత రాజకీయాల్లోకి వచ్చాడు. 2019లో ఎంపీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. అప్పట్నుంచి గ్రామ అభివృద్ధిలో తనవంతుగా కృషి చేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటున్నాడు. ఈ క్రమంలో ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో ఏసీబీ విచారణకు కేటీఆర్ వెళ్లడంతో ఆయనకు మద్దతుగా సోమవారం నాడు కుంటయ్య హైదరాబాద్ వెళ్లాడు. ఆయనతో పాటు హైదరాబాద్‌కు వెళ్లిన నేతలంతా సోమవారం రాత్రిలోపే ఇంటికి చేరుకున్నారు. కానీ కుంటయ్య మాత్రం రాత్రి దాటినా ఇంటికి రాలేదు. దీంతో కంగారుపడిపోయిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కుంటయ్య సెల్‌ఫోన్ సిగ్నల్‌ను పోలీసులు ట్రేస్ అవుట్ చేయగా.. గ్రామ శివారులో ఉన్నట్లు లొకేషన్ తెలుసుకున్నారు. దీంతో తెల్లవారుజామున ఆ లొకేషన్‌కు వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడిఉన్న కుంటయ్య కనిపించాడు. గడ్డిమందు తాగనని చెప్పడంతో కుంటయ్యను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా, కుంటయ్య ఆత్మహత్యకు యత్నించాడని తెలియడంతో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండల అధ్యక్షుడు రాజన్న, బొల్లి రామ్మోహన్ ఆస్పత్రికి చేరుకుని పరామర్శించారు. కాగా కుంటయ్య రాసిన ఓ సూసైడ్ నోట్ అతని దగ్గర దొరికింది. అందులో తన చావుకు కాంగ్రెస్ నేత గంగ కృష్ణారెడ్డినే కారణమని పేర్కొనడం గమనార్హం. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని రూ.10లక్షల విలువైన ప్లాట్‌ను కృష్ణారెడ్డి ఆక్రమించాడని, ఇప్పుడు నా బిడ్డ పెళ్లి ఎలా చేయాలని ఆ లేఖలో ఆవేదన వ్యక్తం చేశాడు.

– కేటీఆర్ అన్న నా కుటుంబాన్ని ఆదుకో

కేటీఆర్ అన్న నా కుటుంబాన్ని ఆదుకోండి. ఇప్పుడు నాకు ఏ ప్లాట్ లేదు.. భూమి లేదు.. నా బిడ్డ పెళ్లి చేయాలి.. నా కుటుంబాన్ని ఆదుకో అన్న అంటూ కుంటయ్య ఆ లేఖలో పేర్కొన్నాడు. కాంగ్రెస్ నేత తన భూమి కబ్జా చేశాడని.. ఇంకా తనకు ఏమీ మిగల్లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ కబ్జాపై ఎస్సై, సీఐకి ఫిర్యాదు చేసినా కేసు పెట్టలేదు.. వారిపై నువ్వే చర్యలు తీసుకోవాలని కేటీఆర్ అన్న అంటూ వాపోయాడు. ఆ లేఖను చూసి కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యాడు..కాగా, కుంటయ్య దయనీయ పరిస్థితిని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తామని.. కుటుంబానికి అండగా ఉంటామని బీఆర్ఎస్ జిల్లా నేతలు హామీ ఇచ్చారు.

## రాజ్యాంగం కల్పించిన నా హక్కును నాకు తెలియకుండానే కాలా రాస్తున్న వారి పై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జడ్పిటిసి ఫోరం మాజీ అధ్యక్షుడు పీలారం పట్లోళ్ల మహిపాల్ రెడ్డి..



సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా ఫోన్ టాపింగ్ కేసులో వికారాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జడ్పిటిసి ఫోరం మాజీ అధ్యక్షుడు పీలారం పట్లోళ్ల మహిపాల్ రెడ్డికి ప్రత్యేక విచారణ బృందం (సీట్)
విచారణ చేసింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కీలక నేతగా మైపాల్ రెడ్డితో ఎవరెవరుమాట్లాడుతున్నారనే సమాచారాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం తెప్పించుకున్నట్లుగా ఫోన్ టాపింగ్ కేసు విచారణలో గుర్తించిన సిట్ విచారణ చేసిన
అనంతరం మైపాల్ రెడ్డి తన నివాసం లో సిట్ విచారణ వెల్లడించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీకి కీలక నేతగా ఉండడాన్ని చూసి టిఆర్ఎస్ ప్రభుత్వం తన ఫోను టాపింగ్ చేసిందని అన్నారు. ఈ విషయాన్ని అప్పటి ఎమ్మెల్సీ మంత్రి మహేందర్ రెడ్డి కూడా తనకు తెలియజేశారని వివరించారు అదేవిధంగా విఆర్ఎస్ తో పాటు కాంగ్రెస్ నాయకులకు కూడా తమ ఫోన్ టాపింగ్ చేశారని వివరించడం జరిగిందని తాను ఎవరెవరితో మాట్లాడారు ఎందుకు మాట్లాడారు అనే ఫోన్ నెంబర్లతో సహా సీట్ అధికారులు అడిగినట్లుగా తెలియజేశారు . ఎవరికీ తెలియని తన పోన్ నంబరు ను కూడా టాపింగ్ చేశారని అన్నారు. ఇలా చేయడం సరి కాదని అన్నారు రాజ్యాంగం కల్పించిన హక్కులను కొందరు రాజకీయ నాయకులు అధికారులు ఇలా చేస్తున్నారని ఇలాంటి వారిపై ప్రభుత్వం వెంబడి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్న సిబ్బంది శిథిలావస్థలో వ్యవసాయ శాఖ కార్యాలయం..



సత్యమేవ జయతే – హుజురాబాద్ హుజురాబాద్ : హుజురాబాద్ పట్టణంలోని ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. పైనుంచి పెచ్చులు ఊడి కింద పడడంతో అధికారులు, సిబ్బంది, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన ఈ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలం కావడంతో చిన్నపాటి చిరుజల్లులకే లోపలికి నీటి పదును వచ్చి కంప్యూటర్లు కూడా తడిచే ప్రమాదం ఉంది. అంతేకాకుండా విద్యానగర్ కు సీసీ రోడ్డులు మరమ్మతులు చేయడంతో కార్యాలయం రోడ్డుకు కిందికి కావడంతో వర్షం కొడితే నీరు నిల్వ ఉండి కార్యాలయంలో పలికి వెళ్లే వీలు కూడా ఉండదు. ఇదే కార్యాలయంలో ఏడీఏ, ఏవో ఆఫీసులో ఉంటాయి.
హుజురాబాద్ డివిజన్ పరిధిలోని హుజురాబాద్ జమ్మికుంట, వీణవంక, ఇల్లంతకుంట, సైదాపూర్ మండలాలు చెందిన ఏవోలు, ఏఈవోలు, రైతులు ఎక్కువ శాతం ఈ కార్యాలయానికి పని నిమిత్తం వస్తూ ఉంటారు. కార్యాలయం చుట్టూ ముళ్లపదలు పిచ్చి మొక్కలు నిండి ఉండడంతో విష పురుగులు కూడా సంచరిస్తున్నాయని కార్యాలయానికి వచ్చే రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి కూడా మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి నూతన భవన నిర్మాణం చేపట్టాలని అధికారులు, సిబ్బంది రైతులు కోరుతున్నారు.

## తహసీల్దార్ రమేష్ గౌడ్, ఎస్సై రాజు ఐఐటీలో సీటు సాధించడం అభినందనీయం..



సత్యమేవ జయతే – కరీంనగర్ కరీంనగర్ : ధర్వడ ఐఐటీలో మండల విద్యార్థి శ్రీఖర్ సీట్ సాధించడం అభినందనీయమని తహసీల్దార్ రమేష్ గౌడ్, ఎస్సై రాజు అన్నారు. మల్లాపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ లో వారు వేర్వేరుగా ఐఐటీ సీటు సాధించిన విద్యార్థి శ్రీఖర్ ని మంగళవారం ఘనంగా సన్మానించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలం కొత్త దాంరాజ్ పల్లి గ్రామానికి చెందిన గంగిశెట్టి శ్రీకాంత్–శ్రావణి ల కుమారుడు, కేరళ హై స్కూల్ పూర్వ విద్యార్థి గంగిశెట్టి శ్రీఖర్ ఇటీవల వెలువడిన జేఈఈ అడ్వాన్స్ లో ఐఐటీ డార్వడ్ లో సీటు సాధించడం హర్షణీయమని కొనియాడారు. శ్రీఖర్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని, తల్లిదండ్రులకు, గ్రామానికి, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేరళ హైస్కూల్ ప్రిన్సిపాల్ సీబీ అనిల్ సింగ్, శ్రీఖర్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సత్యమేవ జయతే

బుధవారం 18 జూన్ 2025

## అంగన్‌వాడీ బాట..

## వల్లబాపూర్‌లో అమ్మ మాట..



సత్యమేవజయతే - నిజామాబాద్ నిజామాబాద్ : అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం వల్లభపూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ గోపి లక్ష్మి ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ గోపి లక్ష్మి మాట్లాడుతూ శిశు మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 10నుండి 17 వరకు గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల్లో అమ్మ మాట.. అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.

గ్రామాల్లో రెండేళ్లలోపు ఉన్న పిల్లలను గుర్తించి వారికి అంగన్వాడీ కేంద్రంలో చేర్పించడం జరిగిందని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో వారం రోజుల పాటు పలు కార్యక్రమాలను నిర్వహించామన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ, బాలింతలకు, చిన్నారులకు అందించే పౌష్టికాహార గురించి వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ సాధికారత కేంద్రం స్వప్న, స్థానిక హెడ్ మాస్టర్ నీలకంతరావు, అంగన్వాడీ టీచర్లు బాల్ లక్ష్మి, సుజాత, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు యువత దూరం ఉండాలి.. కోటగిరి ఎస్సై సునీల్



సత్యమేవజయతే - నిజామాబాద్ నిజామాబాద్ : మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని కోటగిరి ఎస్సై సునీల్ అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆదేశాల మేరకు కోటగిరి మండలం కొత్తపల్లి గ్రామంలో మత్తు పదార్థాల నిర్మూలన పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సునీల్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడిన యువత తన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు.

కావున చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ అడిగితే చెప్పకూడదని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## కార్పోరేట్ స్థాయిలో అంగన్‌వాడీల అభివృద్ధి : కలెక్టర్ జితేష్ వి పాటిల్



సత్యమేవ జయతే - భద్రాద్రి కొత్తగూడెంభద్రాద్రి కొత్తగూడెం : అంగన్‌వాడీ కేంద్రాలను కార్పొరేట్ స్థాయి వసతులతో అభివృద్ధి చేస్తున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. పాత పాల్వంచలోని మండల ప్రాథమిక పాఠశాలలలో గల అంగన్‌వాడీ కేంద్రంలో "అమ్మ మాట %-% అంగన్‌వాడీ బాట" కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పలకలు, పుస్తకాలు, బ్యాగులు, బూట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుదీకరణ, త్రాగునీటి, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. పిల్లలకు అవసరమైన ఆహారం, విద్య, ఆటపాటల వాతావరణం, ఆరోగ్యపరమైన జాగ్రత్తలు అన్నింటిని సమగ్రంగా అందిస్తున్నట్లు తెలిపారు.

తల్లిదండ్రులందరూ తమ చిన్నారులను ఖరీదైన ప్రైవేట్ పాఠశాలలలో చేర్పించి ఆర్థిక భారాన్ని మోయాల్సిన అవసరం లేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఆధునిక వసతులతో కూడిన విద్యాబోధన అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ముందు అంగన్‌వాడీలో చేర్పించి, తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలన్నారు. ఇవే పిల్లల భవిష్యత్‌కు బలమైన పునాది అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాస్, మహిళా శిశు, వయో వృద్ధుల దివ్యాంగుల శాఖ అధికారి స్వర్ణలత లేనినా, ఐసిడిఎస్, సిడిపిఓ లక్ష్మి ప్రసన్న, సూపర్‌వైజర్లు రమాదేవి, కవిత, కమల. శారద, అంగన్‌వాడీ టీచర్లు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్లను అడ్డుకున్న రైతులు.. అక్రమంగా తరలుతున్న ఇసుక..

సత్యమేవ జయతే - వరంగల్ రూరల్ వరంగల్ రూరల్ : ఆకేరువాగు నుంచి అనుమతి లేకుండా రాత్రి, పగలు వందలాది ట్రాక్టర్లు నడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు, స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. పగలంతా వ్యవసాయ కూలీ పనులకు వెళ్లి, రాత్రి నిద్రలేకుండా గడపాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను జయపురం గ్రామంలో ప్రజలు ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. రోడ్డుపై వెళ్లకుండా కాళీ ట్రాక్టర్లను అడ్డుపెట్టారు.

దీంతో రాత్రంతా ఆగిన ఇసుక ట్రాక్టర్లు సోమవారం మళ్లీ మొదలు కావడంతో బక్కతండా రైతులు అడ్డుకున్నారు. రైతులే ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నా సంబంధిత అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు. అక్రమ ఇసుక ట్రాక్టర్లకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి.. డీఆర్‌డీవో

సత్యమేవ జయతే - పెద్దపల్లి

పెద్దపల్లి : మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని డీఆర్‌డీవో కాళిందిని అన్నారు. పెద్దపల్లి కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వశక్తి మహిళా సంఘాల సభ్యులకు ర్యాంప్ ప్రాజెక్టుపై మంగళవారం నిర్వహించిన ఒక్కరోజు అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలకు అందించే ఏకరూప దుస్తులు నాణ్యతతో కుట్టేందుకు ఒక్కో మహిళా సభ్యురాలిపై రోజుకు రూ.200 ఖర్చు చేస్తూ 10 రోజులు ప్రత్యేక శిక్షణ అందించామని తెలిపారు. బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేయించి మహిళలకు శాశ్వతంగా కుట్టు పని ఉండేలా ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రభుత్వం అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా స్థిరపడాలని సూచించారు. ర్యాంప్ ప్రాజెక్టు కింద ఎంఎస్‌ఎంఈ రంగంలో చిన్న చిన్న వ్యాపారాల ఏర్పాటు, వాటి నిర్వహణకు అవసరమైన సంపూర్ణ సహాయక సహకారాలు అందిస్తామని, స్వశక్తి మహిళా సంఘాల సభ్యులు ఆర్థిక రంగంలో ఎదిగేందుకు కృషి చేస్తామన్నారు. ఈనెల 20 నుంచి రాఖీల తయారీ చేయడంపై శిక్షణ అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.




# రూ.60 లక్షలు వచ్చే అవకాశం ఉన్నా చేజారుస్తున్న బల్దియా అధికారులు..!

## - నెలల తరబడి ఆదాయానికి కొరివి..

సత్యమేవ జయతే - గోదావరిఖని

గోదావరిఖని : గోదావరిఖని పట్టణంలో ఒక భారీ షాపింగ్ మాల్ నిర్మాణానికి సంబంధించి పర్మిషన్ ఇవ్వడంలో రామగుండం బల్దియా అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. షాపింగ్ మాల్ నిర్మాణానికి పర్మిషన్ ఇస్తే ఒకే మొత్తంగా రూ.60 లక్షల ఆదాయం రామగుండం నగరపాలక సంస్థకు సమకూరనుంది. అయినా అధికారులు ఎక్కడాలేని కొరివిలతో తీవ్ర కాలయాపన చేయడంలో ఆంతర్యం ఏమిటో? అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఏదైనా కట్టడానికి సంబంధించి అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న వారికి 21 రోజుల్లో అనుమతి లభించాల్సి ఉంటుంది. నిబంధనలకు విరుద్ధంగా కట్టడానికి సంబంధించి ఏదైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే ఆ అంశాలకు సంబంధించి తెలియజేయాల్సి ఉంటుంది. పర్మిషన్ విషయంలో చిన్న చిన్న అంశాలను తీవ్ర జాప్యం అనంతరం తెలియజేసి వాటిని సరిచేసిన తాము బిజీగా ఉన్నామని ఎల్‌ఆర్‌ఎస్ కారణంగా ఇతర పనులు చేయడం లేదని రెండు నెలలపాటు జాప్యం చేసిన పట్టణ ప్రణాళిక విభాగంఅధికారులు ఇప్పుడు రామగుండం నగరపాలక సంస్థలో వార్డుల విభజన జరుగుతుందని ఈ విషయంలో తాము బిజీగా



ఉన్నామని పొంతనలేని విషయాలను చెబుతూ జాప్యం చేయడం అమ్యామ్యా ల కోసమేనా..? అనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు బదిలీలు జరిగిన క్రమంలో మరింత ఆలస్యం చోటు చేసుకుంటుంది. అసలే ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న రామగుండం నగరపాలక సంస్థకు ఏక మొత్తంలో పర్మిషన్ కు సంబంధించి రూ.60 లక్షలు ఒకేసారి వచ్చే అవకాశం ఉన్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. ఈ విషయంలో కలెక్టర్ స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.

# బిసి బిల్లుకై వచ్చేనెల 17న రైల్ రోఖో






**బిసి బిల్లుకై వచ్చేనెల 17న రైల్ రోఖో**

**కాంగ్రెస్ కుల గణన అంతా తప్పుల తడకే**

**ఇది రాజకీయ వేదిక కాదు... మానవ హక్కుల వేదిక**

**బిసి బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి**

**స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ ప్లాన్ చేస్తోంది**

**రిజర్వేషన్లు తేలకుండా ఎలక్షన్స్ పెడితే అడ్డుకుంటాం**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

సత్యమేవ జయతే:మెదక్ బిసి బిల్లు చట్టబద్ధత కోసం వచ్చేనెల 17న రైల్ రోఖో నిర్వహిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కుల గణన అంతా తప్పల తడక గా ఉందని ఆరోపించారు.మంగళవారం మెదక్ లో యునైటెడ్ పూలే ఫ్రంట్, తెలంగాణ జాగృతి లు సంయుక్తంగా కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ రాజ్యాంగ బద్దంగా 42 శాతం రిజర్వేషన్ కోసం బీసీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఇది రాజకీయ వేదిక కాదు... మానవ హక్కుల వేదిక అని కవిత అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ ప్లాన్ చేస్తోందని,రిజర్వేషన్లు తేలకుండా ఎలక్షన్స్ పెడితే అడ్డుకుంటామని



ఆమె హెచ్చరించారు.బీసీల గొంతుకగా తెలంగాణ జాగృతి యునైటెడ్ పూలే ఫ్రంట్ పనిచేస్తుందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ సాధించేవరకు పోరాడుతామని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించుకుంటామన్నారు. రాష్ట్రంలో ఉన్న బీసీలంతా చైతన్యం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు శాసనాలు చేసే అసెంబ్లీ గడపను ఎక్కనివాళ్ళు ఎంతో మంది ఉన్నారనిఆవేదన వ్యక్తం చేశారు. బీసీల మీటింగ్ కు ఎందుకు పోతారు అని అగ్రవర్ణాలు బెదిరిస్తున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. ఇది కేవలం రాజకీయ వేదిక కాదని మానవ హక్కుల వేదికగా పేర్కొన్నారు. బీసీ మేధావులు, విద్యార్థులు, యువకులు, మహిళలు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. బీసీలు అడగకపోతే భవిష్యత్తులో తీరని నష్టం జరుగుతుందని హెచ్చరించారు. మనం కొట్లాడితేనే కామారెడ్డి డిక్లరేషన్ అసెంబ్లీలో, మండలిలో పాస్ చేయించానన్నారు. ఆనాడే విద్యకు, ఉద్యోగాలకు, రాజకీయాలకు వేర్వేరు బిల్లులు పెట్టాలని కోరామని, కానీ కొంత మంది ఎగతాళి చేశారని గుర్తు చేశారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం రెండు బిల్లులు పెట్టిన విషయాన్ని గమనించాలన్నారు. తెలంగాణలోని అన్ని జిల్లాలో బీసీ బిల్లు గురించి మాట్లాడాలని, ఢిల్లీకి బిల్లు పంపిన మాకు సంబంధం లేదని కాంగ్రెస్ అనడం విడ్డురంగా ఉందన్నారు. మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఒక్కరోజైనా బీసీ బిల్లు గురించి మాట్లాడారా అని ప్రశ్నించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉందని, బీసీ బిల్లు పై బీజేపీ మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెదక్ వచ్చే బీజేపీ ఎంపీని బీసీ బిల్లు గురించి ప్రశ్నించాలని చెప్పారు. బీసీ బిల్లు వస్తే ఉద్యోగాలు, రాజకీయ అవకాశాలు, నిధులు వస్తాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణనకు చిత్తశుద్ధి లేదన్నారు. కుల గణన కరెక్ట్ ఉంటే గ్రామాల్లో పంచాయతీల వద్ద అన్ని కులాల వారి వివరాలు అందుబాటులో ఉంచాలన్నారు.బీసీ బిల్లు సాధించాలంటే కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలన్నారు. కేంద్రం దృష్టికి బీసీ బిల్లు వెళ్లాలంటే 17జులైన రైల్ రోకో చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికలు పెడతామని చెబుతుందని, బీసీ రిజర్వేషన్ 42 శాతం రిజర్వేషన్ లు ఇవ్వకుండా ఎన్నికలకు పోతే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఇప్పుడు అందరం కలిసి పోరాడితేనే బీసీ బిడ్డల కాళ్ళ వద్దకు పదవులు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్, పలు కుల సంఘాల నేతలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# ఇదీ దీని ప్రత్యేకత! విశ్వబ్రాహ్మణ దొరల గడి గట్ల

సత్యమేవ జయతే – సిద్దిపేట

సిద్ధిపేట : గట్ల మల్యాల సిద్ధిపేట జిల్లా, నంగునూరు మండలంలోని ఒక గ్రామం. ఇక్కడ ఉన్న గడీని దొరల మల్యాలగడి అని, గట్ల మల్యాల గడి అని కూడా పిలుస్తారు. విశ్వబ్రాహ్మణులలో కంసాలులు, అవుసలివాండ్లు, స్వర్ణకారులని పిలువబడే కులం వారి దొరతనపు గడి గట్లమల్యాల. అందుకే ఈ గడిని అవుసులోల్ల గడి అని కూడా పిలుస్తారు. వృత్తి కళాకారులైన వీరికి దొరతనం దక్కడం, గడి నిర్మాణం చేసుకోవడం తెలంగాణలో ఇక్కడ తప్ప మరెక్కడా కనిపించదు. నంగునూరు మండలంలోని ఈ గ్రామంలో గట్ల మల్యాల గడి 6 ఎకరాలలో విస్తరించి ఉంది. ఈ గడిని నిర్మాణం చేయించింది కత్తూరిపల్లి సత్యనారాయణ. గట్ల మల్యాల గ్రామస్థాపకుడు సీతారామారావు.

నిజాంరాజు కొన్ని ప్రాంతాలను హ(ర్రాస్(వేలం) ద్వారా తనకు నచ్చినవాళ్ళకు ఇచ్చాడు. వాళ్లను హ(ర్రాస్ దార్‌లను పిలుస్తారు. హ(ర్రాస్ ద్వారా దక్కిన భూభాగాలకు హ(ర్రాస్ దార్లు పన్ను, కప్పం కట్టనవసరంలేదు. అది ఈ వృత్తి కళాకారులకు ఇచ్చిన గౌరవం. అంతేకాదు నిజాం తన కొలువులో వీరికి కుడివైపు ఆసనాలిచ్చి గౌరవించేవాడట. వీరికి రావుబహద్దూరు బిరుదులిచ్చి ఉండవచ్చుననిపిస్తుంది. గట్లమల్యాలలోని రాళ్లతో నిండిన భూములను సేద్యయోగ్యం చేయించి గ్రామాన్ని అభివృద్ధి చేశారు విశ్వబ్రాహ్మణదొరలు. దాదాపు 400 ఎకరాలకు పైననే వ్యవసాయ యోగ్య భూములను సిద్ధ పరిచారు. యాభై నాగండ్లతో పొలాలు దున్నించేవారట. మొత్తం పొలాలన్నీ వారి స్వాధీనంలోనే వుండేవి.

దొరల ఎడ్ల కచ్చురం వెంట రైతులు

సత్యనారాయణరావుకు ముగ్గురు కొడుకులు, ఇద్దరు బిడ్డలు. కొడుకులు రాంకిషన్ రావు(రామకృష్ణ), యాదగిరిరావు, వేంకటేశ్వర్ రావులు ముగ్గురికి మూడు గడీలు కట్టించాడు సత్యనారాయణరావు. వాటిని పెద్దదొరగడి, నడిపిదొరగడి, చిన్నదొరగడి అని పిలుస్తారు ఇక్కడి ప్రజలు. పెద్దదొర గడి మట్టి, గూనపెంకులతో ఉండగా, మిగతా ఇద్దరి గడీలు డంగుసున్నంతో అలంకరణలతో కట్టించబడ్డాయి. గడిలో ప్రధానద్వారం వద్ద చౌకీదారుకు గది, దాస, దాసీలకు కూడా ప్రత్యేకమైన గదులు కట్టించారు.

పెద్ద దొరగడి ఐదు భాగాలుగా కట్టబడింది. గూనపెంకల కప్పుతో ఉంది. నడిపిదొరగడికి పెద్దదర్వాజ ఉంది. దానిపక్కన మైసమ్మగుడి ఉంది. ఈయనకు గు(ర్రాలంటే ఇష్టం. గు(ర్రపుశాలలు నిర్మింపజేశారు. ధాన్యపు గరిసెలు కూడా వాటి పక్కనే ఉన్నాయి. చిన్నదొరగడి ప్రధాన ద్వారం పక్కనే ఉంది ఈ గడి. అందమైన పూలతీగెల డిజైన్లతో గోడలు అలంకరించబడ్డాయి.

నడిపి దొర యాదగిరిరావు గట్లమల్యాల సర్పంచ్‌గా పనిచేశాడు. కో ఆపరేటివ్ బ్యాంకు చైర్‌పర్సన్‌గా కూడా ఉన్నాడు. నాగసముద్రం నుంచి ఊరికి 11 కి.మీ.ల రోడ్డు వేయించాడట. ఈ దొరలు గ్రామంలో పాఠశాల నిర్మాణానికి రెండున్నర ఎకరాలు దానం చేశారు. వీరు ఇప్పటికీ గ్రామాభివృద్ధికి కావలసిన సహకారాన్ని అందజేస్తున్నారు. గట్లమల్యాల ప్రజలు బంగారం పనిచేసే స్వర్ణకారుల దొరతనపు పాలనను బంగారమేనంటున్నారు. అయితే ఈ దొరల వంశమూలాలు హైదరాబాద్‌లోనే ఉన్నాయంటున్నారు హైదరాబాద్‌లోని కత్తూరిపల్లివారు. అదిమరొక అన్వేషణ.

కొసమెరుపు: గట్లమల్యాల గ్రామంలో ఎక్కడ చూసిన రాళ్లు కనిపిస్తాయి. పొలాల్లో మెన్హర్లు కనిపించాయి. మెగాలిథిక్ సమాధుల ఆనవాళ్లు కనిపించాయి. కొత్తరాతియుగపు రాతిపనిముట్లు కనిపించాయి. ఇది మరెక్కడా జరగని కథ

%-% కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీ రామోజు హరగోపాల్

విశ్వబ్రాహ్మణుల గడి ఎక్కడాలేదు గట్లమల్యాలలోనే కనిపిస్తుంది. నేను 2018లో ఈ గడిని సందర్శించి నిశితంగా పరిశోధన చేశాను. ఈ గడిని నిర్మాణం చేయించింది కత్తూరిపల్లి సత్యనారాయణ. కంసాలి వృత్తి జీవితంగా ఉన్న ఈ హస్తకళాకారులకు దొరతనం దక్కడం, కోటవంటి గడి నిర్మాణం, ఊర్లమీద పెత్తనం నిజాంకాలంలో జరిగింది. మరెక్కడా జరగని కథ. నిజాం రాజు కొన్ని ప్రాంతాలను హ(ర్రాస్(వేలం) ద్వారా తనకు నచ్చినవాళ్లకు ఇచ్చాడు. వాళ్లను హ(ర్రాస్‌దార్‌లను పిలుస్తారు. హ(ర్రాస్ ద్వారా దక్కిన భూభాగాలకు హ(ర్రాస్ దార్లు పన్ను, కప్పం కట్టనవసరంలేదు. అది ఈ వృత్తి కళాకారులకు ఇచ్చిన గౌరవం. అంతేకాదు నిజాం తన కొలువులో వీరికి కుడివైపు ఆసనాలిచ్చి గౌరవించేవాడట. వీరికి రావుబహద్దూరు బిరుదులిచ్చి ఉండవచ్చుననిపిస్తుంది. గట్లమల్యాలలోని రాళ్లతో నిండిన భూములను సేద్యయోగ్యం చేయించి గ్రామాన్ని అభివృద్ధి చేశారు విశ్వబ్రాహ్మణదొరలు. దాదాపు 400 ఎకరాలకు పైనే వ్యవసాయ యోగ్య భూములను సిద్ధపరిచారు. యాభై నాగండ్లతో పొలాలు దున్నించేవారట. ప్రజలతో కలివిడిగా ఉండేవారు. ఎవరిని తమ దొరతనంతో వేధించిన సంఘటనలు లేవు. తెలంగాణ చరిత్రలో ఇదొక అపూర్వఘట్టం.







## డీఐఈఓ శ్రీధర్ సుమన్ : ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



సత్యమేవ జయతే – వరంగల్ రూరల్ వరంగల్ రూరల్ : ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, అత్యున్నత విద్యార్హతలున్న అధ్యాపకులచే బోధన జరుగుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని డీఐఈఓ శ్రీధర్ సుమన్ అన్నారు. ఇంటర్మీడియేట్ అడ్మిషన్ల ప్రచారం, పాఠ్యపుస్తకాల పంపిణీలో భాగంగా స్థానిక రంగశాయిపేట జూనియర్ కళాశాలలో ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి మాట్లాడుతూ ఉచిత విద్య, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ, నాణ్యమైన విద్యా బోధన వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రిన్సిపాల్స్, అధ్యాపకులపై ఉందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కార్పొరేట్ మాయజాలంలో పడి లక్షల రూపాయలు కోల్పోతున్నారని, స్థానిక ప్రభుత్వ కళాశాలలో తమ పిల్లలను చేర్చి నాణ్యమైన విద్యను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, అధ్యాపకులు మల్లారెడ్డి, ఎల్లాస్వామి, లైబ్రేరియన్ రాములు, తదితరులు పాల్గొన్నారు.

## అచ్చంపేటలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు భూమి పూజ



సత్యమేవ జయతే – అచ్చంపేటఅచ్చంపేట : అచ్చంపేట మండలంలోని సింగారం, ఎద్దుమిట్ట తండా గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇండ్లకు పంచాయతీ కార్యదర్శి మంజుల ఆధ్వర్యంలో ఇంటి నిర్మాణానికి ముగ్గులు పోసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ రామనాథం మాట్లాడుతూ.. ఇండ్లు కట్టుకోలేని స్తోమత లేని గ్రామీణ పేదల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న బృహత్ పథకం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట విజయ్ డెయిరీ అధ్యక్షులు దొడ్ల నర్సయ్య యాదవ్, సింగారం గ్రామ పంచాయతీ కార్యదర్శి మంజుల, జగన్, హౌసింగ్ ఏఈ రమేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామంలోని లబ్ధిదారుల స్థలములలో ఇల్ల నిర్మాణానికి గాను ముగ్గులు పోయించారు.

## గ్రామాల్లో అమలవుతున్న పథకాలన్నీ కేంద్రానివే: బీజేపీ నేత శంకరోల్ల రవికుమార్




సత్యమేవ జయతే – మహబూబానగర్ మహబూబానగర్ : తెలంగాణలోని గ్రామాలలో అమలవుతున్న పథకాలన్నీ కేంద్ర ప్రభుత్వాన్ని వేనని బీజేపీ రాష్ట్ర ఓబీసీ అధికార ప్రతినిధి శంకరోల్ల రవికుమార్ అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ సారథ్యంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన 11 ఏండ్ల కాలంలో గ్రామస్థాయిలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. మంగళవారం మాగనూరు మండలంలోని కొత్తపల్లిలో నిర్వహించిన రచ్చబండ కార్యాక్రమంలో రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలకు ఉజ్వల పథకం కింద సిలిండర్లు, మహిళల ఆత్మగౌరవం కాపాడే విధంగా మరుగుదొడ్ల నిర్మాణం, పుట్టిన బిడ్డకు సుకన్య సమృద్ధి యోజన, గరిబ్ కళ్యాణ్ యోజన కింద ఉచిత బియ్యం పంపిణీ, రైతుల సుభిక్షం కోసం కిసాన్ సామ్మాన్ నిధి కింద ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.12 వేలు అదేవిధంగా రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర ఇస్తున్నామని చెప్పారు.

అదేవిధంగా రైతులకు 50 శాతం సబ్సిడీ కింద యూరియా, డీఏపీ ఎరువుల పంపిణీ అదేవిధంగా గ్రామాల అభివృద్ధి కోసం సీసీ రోడ్లు అదేవిధంగా స్ట్రీట్ లైట్లు గ్రామాల్లో గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకంలో అనేకమందికి పని కల్పించి వారికి జీవనోపాధి కల్పించామని, రహదారుల నిర్మాణం వంటి కార్యక్రమాలు ఈ 11 ఏండ్ల కాలంలో నరేంద్ర మోదీ సారథ్యంలో భారతదేశం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. బీజేపీ చేస్తున్న అభివృద్ధిని గడపగడపకు తీసుకుపోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీలు 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడుతూ బీజేపీని బలపర్చాలన్నారు.

బీజేపీ కృష్ణ, ఉమ్మడి మండల అధ్యక్షుడు నల్లే నర్సప్ప అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సోమశేఖర్ గౌడ్, మండల మాజీ అధ్యక్షుడు జయానంద రెడ్డి, నారాయణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కనకరాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు వాకిటి మల్లేష్, స్థానిక తాజా మాజీ సర్పంచ్ కొత్తపల్లి తిమ్మప్ప, అంజప్ప గౌడ, సీనియర్ నాయకులు లోకపల్లి హనుమంతు, సోమప్ప గౌడ, ప్రధాన కార్యదర్శి దండు రాఘవేంద్ర, అశోక్ గౌడ్, డాక్టర్ కృష్ణయ్య, భరత్ కుమార్, సీనియర్ నాయకులు చంద్రశేఖర్, భూత్ అధ్యక్షుడు అశోక్, భీమప్ప, సీనియర్ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## సదరం సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలి : కలెక్టర్ బీఎం సంతోష్



సత్యమేవ జయతే – జోగులాంబ గద్వాల్ జోగులాంబ గద్వాల్ : జిల్లాలో సదరం సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో చేపట్టిన సదరం సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ, స్లాట్ బుకింగ్ విధానం, పెండింగ్ దరఖాస్తుల వివరాలను సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రిలో విభాగాల వారీగా చేపట్టిన పనులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది స్లాట్‌లు బుక్ చేస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను ఎంత మేరకు క్లియర్ చేస్తున్నారని అడిగే వివరాలు తెలుసుకున్నారు. మౌలిక వసతులు, మానవవనరుల అంశాలను వివరణాత్మకంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సమర్థవంతంగా సేవలు అందించాలనే దృక్పథంతో సదరం స్లాట్‌ల సంఖ్యను మరింత పెంచాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఆర్థోపెడిక్ విభాగంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పూర్తి చేయాలని అన్నారు. అల్పదృష్టి, వినికిడి లోపం తదితర దరఖాస్తులను క్లియర్ చేయాలన్నారు. వచ్చిన దరఖాస్తుల వివరాలను డిజిటల్‌గా నమోదు చేయాలని సూచించారు. వచ్చే నెలలో మెగా క్యాంప్ నిర్వహించి పెండింగ్ దరఖాస్తులను పూర్తిగా క్లియర్ చేయాలన్నారు. ఆయా దరఖాస్తుల క్లియరెన్స్ ప్రక్రియలో సంబంధిత శాఖల మధ్య సమన్వయం అవసరమని, ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని అన్నారు. ప్రభుత్వాసుపత్రిలో సీటీ స్కాన్ సేవలు త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిరా, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర్, వైద్య సిబ్బంది, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

## డాక్టర్ కేవీ స్వరాజ్య లక్ష్మి : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సత్యమేవ జయతే – అచ్చంపేట అచ్చంపేట : సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కేవీ స్వరాజ్య లక్ష్మి సూచించారు. ఈ మేరకు మంగళవారం అచ్చంపేటలోని ఓ ప్రయివేటు సమావేశ మందిరంలో క్షేత్ర స్థాయి సిబ్బందికి సీజనల్ వ్యాధుల నివారణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో స్వరాజ్య లక్ష్మి మాట్లాడుతూ.. గతంలో డెంగ్యూ, మలేరియా, నీళ్ల విరేచనాలు, జ్వరాలు నమోదైన గ్రామ, పట్టణ ప్రాంతాల్లో అంటు వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. దోమ కాటు వ్యాధులైన డెంగ్యూ, మలేరియా , చికున్ గున్యా రాకుండా ప్రతి శుక్రవారం పొడి దినం(డ్రై డే) పాటించాలని, దోమలు ఇంట్లోకి ప్రవేశించకుండా కిటికీలకు తలుపులకు ఇనుప జాలీలను బిగించుకోవాలని, దోమతెరలు వాడాలని, ఇంటి ఆవరణలో, పరిసరాలలో నీరు నిలవకుండా చేసుకోవాలని, పాత టైర్లు, పనికిరాని ప్లాస్టిక్, గాజు సీసాలు, డిస్పోజబుల్ కప్పులు,




కొబ్బరి చిప్పలు తమ ఇంటి ఆవరణలో లేకుండా చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని, అనుమానం ఉన్న వారి రక్త నమూనాలను టి-డయాగ్నొస్టిక్ హబ్‌కు పంపాలని తెలియజేశారు. కలుషితమైన నీరు ఆహారం ద్వారా వ్యాపించే టైఫాయిడ్, డయేరియా తదితర వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని, ముఖ్యంగా పరిశుభ్రమైన త్రాగునీరు, చేతుల పరిశుభ్రత , పరిసరాల పారిశుధ్యం గురించి ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కలిగించాలని తెలియజేశారు. గాలి ద్వారా వ్యాపించే స్వైన్ ఫ్లూ, కోవిడ్- 19 నివారణ గురించి ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. జూన్ 16వ నుండి జులై 31 వరకు నిర్వహించబోతున్న "నీళ్ల విరేచనాలను ఆపండి" కార్యక్రమంలో ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు ఐదు సంవత్సరాల లోపు చిన్నారుల ఇంటికి వెళ్లి ముందస్తు జాగ్రత్తగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని, డయేరియా కలిగిన పిల్లలకు జింక్ మాత్రలు, ఓఆర్ఎస్ పాకెట్లు ఇవ్వాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట డివిజన్ ఉప జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తారా సింగ్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ రవి కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఎఎంఒఆర్ శ్రీనివాసులు, అచ్చంపేట డివిజన్ ఉప మలేరియా అధికారి బికులాల్, ఏపీవో రాజేష్ వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎంఎల్‌హెచ్‌పీలు, పర్యవేక్షణ సిబ్బంది, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఊట్కూర్ మండల విద్యాధికారిణిగా బాధ్యతలు స్వీకరించిన మాధవి




సత్యమేవ జయతే – నారాయణపేట నారాయణపేట : నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల విద్యాధికారిణిగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల జీహెచ్ఎం మాధవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఊట్కూర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల జీహెచ్ఎంగా పనిచేస్తున్న ఆమెకు మండల విద్యాధికారిణిగా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ జిల్లా విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకుముందు ఎంఈఓగా పనిచేస్తున్న రామచంద్ర చారి ఇటీవల పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో నూతన ఎంఈఓగా మాధవి బాధ్యతలు స్వీకరించారు. ఊట్కూరు మండల వనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) మండల అధ్యక్షులు కృష్ణ, ప్రోగ్రెసివ్ రికాగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన ఎంఈఓను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాధవి మాట్లాడుతూ.. మండలంలోని ఉపాధ్యాయులందరి సహకారంతో ప్రతి పాఠశాలను అభివృద్ధి పథంలోకి తెచ్చేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. జిల్లాలోనే విద్యా వ్యవస్థను రోల్ మోడల్‌గా నిలిపేందుకు ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, విద్యావేత్తలు సహకరించాలని కోరారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులు, ఇతర అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం కుసుమ, తపస్ మండల కార్యదర్శి గోపాల్, మురళీధర్, రాములు, అనంత కుమార్ రెడ్డి, విజయలక్ష్మి, సంతోష్, అశోక్, కిరణ్, బనేష్, పీఆర్టీయు మండల గౌరవ అధ్యక్షుడు ఫజల్ అహ్మద్, పద్మావతి, ప్రేమకుమారి, గురునాథ్, లక్ష్మారెడ్డి, లియాఖత్, అబ్దుల్ సమద్, ఆంజనేయులు, రవికుమార్, నర్సింహా రెడ్డి పాల్గొన్నారు.

## వైద్య కళాశాల ఏర్పాటుపై స్పష్టత ఇవ్వాలి



సత్యమేవ జయతే – యాదగిరిగుట్ట యాదగిరిగుట్ట : కాంగ్రెస్ పార్టీ నాయకులు సిగ్గులేకుండా ప్రసంగాలు చేస్తున్నారని, ముందు వైద్య కళాశాల ఏర్పాటుపై స్పష్టతనివ్వాలని బీఆర్ఎస్ పార్టీ యాదగిరిగుట్ట పట్టణ సెక్రటరి జనరల్ పాపట్ల నరహరి అన్నారు. మంగళవారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. మల్లాపురం గ్రామంలోని సర్వే నంబర్ 64లో నిర్మించేందుకు రూ.183 కోట్లతో శ్రీలక్ష్మీనరసింహస్వామివారి పేరిట మంజూరైన 100 ఎంబీబీఎస్ సీట్ల సామర్థ్యంతో 300 పడకల ఆస్పత్రిని ఎక్కడ ఏర్పాటు చేస్తారో స్పష్టత ఇచ్చి వెంటనే పనులను ప్రారంభించాలన్నారు. వైద్య కళాశాల యాదగిరిగుట్ట మండలంలోనే నిర్మిస్తారా? లేక భువనగిరికి తరలిపోతుందా అన్న అనుమానాలు తావిస్తున్నాయన్నారు.
కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కానుగు బాలరాజు, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మాజీ కౌన్సిలర్ ముక్కర్ల మల్లేశ్, పట్టణ అధ్యక్షుడు బందారపు భిక్షపతి, ఎరుకల హేమేందర్ గౌడ్ మాట్లాడుతూ "బీఆర్ఎస్ గుండాల్లారా" అని ఉచ్చరించడం సిగ్గు చేటన్నారు. అధికారంలో ఉంటే ప్రతిపక్ష పార్టీ నాయకులు అడిగిన ప్రశ్నలకు సమాదానం చెప్పాలి గానీ, దాడికి దిగడం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు యాదగిరిగుట్ట పట్టణంలో చేసిన అభివృద్ధి ఎంటో చెప్పాలన్నారు. గత ప్రభుత్వ హాయాంలో మంజూరైన పనులకు తిరిగి శంకుస్థాపన చేసి గొప్పలు చెప్పుకోవడం తప్పా చేసింది శూన్యమన్నారు.
ఎన్నికల సందర్భంగా ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయాల్సిందిపోయి, ప్రశ్నించిన వారిపై దాడికి పాల్పడడం సిగ్గుచేటన్నారు. రైతు భరోసా లేదు. వృద్దులకు రూ.4 వేల పింఛన్లు లేదు, మహిళలకు రూ.2,500 ఎక్కడకుపాయే, తులం బంగారం ఏమైంది, విద్యార్థినులకు స్కూటీలు ఏమాయే.. ఇలా ఇచ్చిన హామీలను మరించి ప్రచారానికే పరిమితమైతే తగిన సమయంలో ప్రజలు గట్టి బుద్ధి చెబుతారన్నారు. కాంగ్రెస్ నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాండవుల భాస్కర్ గౌడ్, ఆరే శ్రీధర్, గుండ్లపల్లి వెంకటేశ్ గౌడ్, వాసం రమేశ్ పాల్గొన్నారు.

## రమేశ్ యాదవ్ : రాజకీయాల్లో హుందాతనాన్ని పాటించండి



సత్యమేవ జయతే – రంగారెడ్డి రంగారెడ్డి : కాంగ్రెస్ పార్టీ నేతలు రాజకీయాల్లో హుందాతనాన్ని పాటించాలని బీఆర్ఎస్ చింతకుంటపల్లి గ్రామ నాయకుడు రమేశ్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవలకాలంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ నాయకుడు ప్రభుత్వ భూమిని కబ్జా చేయాలన్న ఉద్దేశంతోనే ఆ భూమికి ఫెన్సింగ్ వేశాడని, ఈ విషయమై గ్రామస్తులతో చర్చించి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. అది జీర్ణించుకోలేని కాంగ్రెస్ నేతలు మండలంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి తనను లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పించారని, గ్రామ అభివృద్ధికోసం అహర్నిశలు కృషి చేసిన తనను వ్యక్తిగతంగా విమర్శించడం బాధ కలిగించిందన్నారు.
చింతకుంటపల్లిని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసిన తర్వాత మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కృషితో దాదాపు రూ.కోటి వరకు అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు తీసుకొచ్చానన్నారు. గ్రామ అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ నేతలు బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. రాజకీయాల్లో పదవులు శాశ్వతం కాదన్నారు. అధికారంలో ఉన్నవారు నోటికొచ్చినట్లు మాట్లాడకుండా మర్యాదగా మాట్లాడి రాజకీయాల్లో విలువలను పెంచి తనలాంటి యువతను ప్రోత్సహించాలని కోరారు. సమావేశంలో సత్యనారాయణ, కృష్ణయ్య, వెంకటయ్య, మల్లేశ్, శ్రీనివాస్, శ్రీశైలం, మహేందర్, కాశీం, శ్రీకాంత్, రమేశ్, మదు. ఎ శ్రీశైలం, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక బోధనలపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలి





సత్యమేవ జయతే – నల్గొండ నల్గొండ : ఆధునిక బోధనా పద్ధతులపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని నల్లగొండ జిల్లా విద్యాధికారి బొల్లారం భిక్షపతి అన్నారు. దామరచర్ల మండలంలోని దామరచర్ల, దిలావర్పూర్ పాఠశాలలు, ఇంద్రానగర్ భవిత కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీరియడ్ ప్రణాళిక బోధనోపకరణాలను ఉపయోగించే విధానాన్ని పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో విద్యార్థుల నమోదు నిరంతరం నిర్వహించాలన్నారు. పాఠశాలలకు హాజరైన విద్యార్థులకు అభ్యసన వాతావరణం వైపు మళ్లించుటకు భాషా కృత్యాలు, గణిత కృత్యాలతో పాటు కథలు చెప్పించడం, డిజిటల్ తరగతులు నిర్వహించడం వంటి కృత్యాలు చేయించి పాఠశాల వైపు ఆకర్షితులను చేయాలన్నారు.
ఉపాధ్యాయ శిక్షణలో నేర్చుకున్న అన్ని అంశాలు ప్రతి ఉపాధ్యాయుడు తరగతి గదిలో అమలు పరచాలన్నారు. మధ్యాహ్న భోజన మెనూ విధిగా అమలు పరచాలని, వారానికి మూడుసార్లు గుడ్లు అందించాలని ఆదేశించారు. పలు పాఠశాలలకు యూనిఫామ్స్ అందనందున సంబంధిత అధికారులను మందలించారు. భవిత కేంద్రం ఆధునీకరణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలందరూ భవితా కేంద్రంలో కృత్యాధార బోధన ద్వారా విలీన విద్య పొందాలని, ప్రతివారం ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహించి తల్లిదండ్రులు ఇంటి వద్దే నిర్వహించే విధంగా తర్ఫీదు ఇవ్వాలని పేర్కొన్నారు. డీఈఓ వెంట ఎంఈఓ ఎం.బాలాజీ నాయక్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం కేతావత్ సైదానాయక్, బండా వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, గోవర్ధన్ రెడ్డి, వీరయ్య, రవి, లక్ష్మమ్మ ఉన్నారు.

## బాలికల విద్య దేశానికి వెలుగు



సత్యమేవ జయతే – కోడంగల్ కోడంగల్ : బాలికల విద్య దేశానికి ఎంతో వెలుగును అందిస్తుందని కొడంగల్ మండల విద్యాధికారి రాంరెడ్డి తెలిపారు. మంగళవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాలిక విద్యపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఎంఈవో రాంరెడ్డి మాట్లాడుతూ.. బాలికలు చదువుకోవడం వల్ల ఇంటితో పాటు దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు సాగే ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు.
ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు, నాణ్యమైన విద్యతోపాటు సామాజిక విలువలతో కూడిన విద్యాబోధన కొనసాగుతుందని ఎంఈవో తెలిపారు. కావున విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ చిన్నారులను చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల్లోని పైపై మెరుగులను చూసి మోసపోవద్దని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో అన్నింట శిక్షణ పొందిన ఉపాధ్యాయులు నియమించడం వల్ల ఉత్తమ విద్య బోధన కొనసాగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, స్కూల్ యూనిఫామ్ వంటి ఎన్నో సౌకర్యాలు అందుబాటులో ఉండి విశాలమైన తరగతి గదులతో పాటు క్రీడా మైదానం ఉంటుందని సూచించారు. హంగులు ఆర్భాటాల ప్రకటనలు చూసి మోసపోవద్దన్నారు. సామాజిక విలువలతో కూడిన విద్యను అభ్యసించే విధంగా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ఇందులో భాగంగా 6 నుంచి 8వ తరగతి వరకు జిల్లా పరిశోధన పాఠశాలలో మొత్తం 22 మంది విద్యార్థినులు చేరడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని విస్తృత ప్రచారంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో అందుకునే సౌకర్యాలు విద్యార్థులకు అవగాహన కల్పించి పాఠశాలలో చేర్చి విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



సత్యమేవ జయతే – రంగారెడ్డి రంగారెడ్డి : నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల సభ్యులు, మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమతమ ప్రాంతాలలోని సమస్యలను నివేదించడంతోపాటు పరిష్కరించాలని కోరగా శంభీపూర్ కృష్ణ సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళు_న్నామన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు , ఎమ్మెల్యే కేపీ వివేకానంద సహాయ సహకారాలతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు.

## పేదల చదువులకు అండగా ఉంటాం-కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి






సత్యమేవ జయతే – మల్కాజిగిరి మల్కాజిగిరి : పేదల చదువులకు అండగా ఉంటామని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ బాలికల స్కూల్‌లో పిల్లలకు టెక్ట్స్ బుక్స్, నోట్ బుక్స్, యూనిఫామ్‌లను కార్పొరేటర్ అందజేశారు.
ఈ సందర్భంగా కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం బోధనను ప్రారంభించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ హెచ్ఎం సునీత తదితరులు పాల్గొన్నారు.

– పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి..

మల్కాజిగిరి, జూన్ 17: పేదల సంక్షేమం కోసం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి జన్మదినం సందర్భంగా అల్వాల్, మల్కాజిగిరి సర్కిల్‌లో కేకులు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.
ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా కిషోర్, ఎంబీసీ మాజీ చైర్మన్ నంది కంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, మురుగేష్, డోలి రమేష్, అనిల్ కిషోర్, శరణ్ గిరి, యాదగిరి గౌడ్, లక్ష్మణ్ యాదవ్, పరమేష్, సత్యనారాయణ, సూర్య ప్రకాష్ రెడ్డి, సాజిత్, ప్రభాకర్, సరిత, సులోచన, వీరేశం యాదవ్, పరశురాం రెడ్డి, వెంకన్న, అమీన్‌ఉద్దిన్, భాగ్యానందరావు, సైదులు, ఖలీల్, నర్సింగ్ రావు, శ్రీనివాస్ గౌడ్, చిన్నయాదవ్, శ్రీనివాస్, గణేష్, సుధాకర్, కోటేష్, శ్రీకాంత్, నవీన్, బంటి, కోటేశ్వర్, బాబు, కుమార్,రాములు,రజని,జ్ఞానేశ్వర్,రవీందర్, వెను యాదవ్, కృష్ణయాదవ్, లక్ష్మణ్, రాజు, శ్రీకాంత్ యాదవ్, శ్రీధర్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, మధు గౌడ్, హేమంత్, సత్యనారాయణ, కుమార్, నవనీత, సులోచన, యాదమ్మ, సురేష్, బాలకృష్ణ, ఫరీద్, విఠల్, భాస్కర్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సత్యమేవ జయతే



# మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్ : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను వినియోగించవద్దు

సత్యమేవ జయతే – హుస్నాబాద్ హుస్నాబాద్ : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను ఎట్టి పరిస్థితిలో వినియోగించవద్దని మున్సిపల్ కమిషనర్ తాటి మల్లికార్జున్ గౌడ్ సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో దుకాణాదారులు, చికెన్ మటన్ వ్యాపారస్తులతో మున్సిపల్ కమిషనర్ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మల్లికార్జున్ గౌడ్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కవర్ల వినియోగంతో జరుగుతున్న అనర్థాలను వారికి వివరించారు.

చికెన్, మటన్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారేయకుండా తప్పనిసరిగా కేటాయించిన వాహనానికి అందించాలని కమిషనర్ మల్లికార్జున్ గౌడ్ చెప్పారు. చికెన్ ,మటన్ కొనుగోలుదారులు టిఫిన్ బాక్సులు తమ వెంట తెచ్చుకున్న వారికి కనీసం ఐదు రూపాయలు తగ్గింపుతో అందించాలని వ్యాపారులకు సూచించారు. అలాగే దుకాణాల ముందు టిఫిన్ బాక్సులు తెచ్చుకున్న వారికి ఐదు రూపాయలు సైతం పెట్టాలని కమిషనర్ చెప్పారు. హుస్నాబాద్ పట్టణాన్ని పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దుకునేందుకు అన్ని వర్గాలు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. వ్యాపారం నిర్వహించేవారు తప్పనిసరిగా ట్రేడ్



లైసెన్సులు తీసుకోవాలని.. లేనిచో జరిమానాలు విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు శ్రీధర్, బట్టల వ్యాపార సంఘం అధ్యక్షుడు రాజయ్య, మున్సిపల్ ఇంచార్జ్ మేనేజర్ సంపత్ రావు, ఏఈ పృథ్వీరాజ్, శానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి దయ్యాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# యూనిఫామ్స్.. నోట్‌బుక్స్ అందాయా.. బంజారాహిల్స్ సర్కార్ బడిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

సత్యమేవ జయతే – హైదరాబాద్ హైదరాబాద్ : మీకు యూనిఫామ్స్ అందాయా.. నోట్‌బుక్స్ ఇచ్చారా.. అంటూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన అడిగి తెలుసుకున్నారు. శ్రద్ధగా చదువుకుని పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. బంజారాహిల్స్ రోడ్ నెం 7లోని గత ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం జిల్లా కలెక్టర్ హరిచందన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. స్కూల్‌లో విద్యార్థులతో నేరుగా మాట్లాడి ఏవైనా సమస్యలున్నాయా అంటూ ప్రశ్నించారు. యూనిఫామ్స్, నోట్‌బుక్స్ వచ్చాయా.. అంటూ వాకబు చేశారు. అన్ని క్లాసులను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులచేత టెక్స్ట్ బుక్స్ చదివించారు. స్కూల్‌లో ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, టాయ్‌లెట్స్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిశుభ్రకరమైన వాతావరణం ఉండేలా చూసుకోవాలని అద్యాపకులను ఆదేశించారు.




# ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ : బోనాలు నిధులకు ఆలయాల నిర్వాహకులు దరఖాస్తు చేసుకోండి



సత్యమేవ జయతే – సికింద్రాబాద్ సికింద్రాబాద్ : సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో వివిధ అమ్మవారి దేవాలయాల నిర్వాహకులు బోనాలు నిధుల మంజురుకు వెంటనే దరఖాస్తులు అందించాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ సూచించారు. ప్రతి ఏటా బోనాలు సందర్భంగా తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం అమ్మవారి దేవాలయాలకు అలంకరణ, ఇతరత్రా అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేసే సంప్రదాయాన్ని పాటిస్తోంది అని గుర్తు చేశారు.

గత సంవత్సరం నిధులు పొందిన ఆలయాల నిర్వాహకుల దరఖాస్తులను మాత్రమే స్వీకరిస్తారని వివరించారు. తమ ఆలయం లెటర్ హెడ్ తో పాటు ఆలయం ఫోటో, ప్రెసిడెంట్, సెక్రటరీ ఆధార్ కార్డు జిరాక్స్, ఆలయం బ్యాంక్ అకౌంట్ వివరాలు, నిధుల వినియోగం వివరాలతో యుటిలైజేషన్ సర్టిఫికేట్, రెండు రెవెన్యూ స్టాంప్స్ అందజేయాలని సూచించారు. గత సంవత్సరం పొందిన చెక్కు జిరాక్స్ కాపీని కూడా అందించాలన్నారు.

## ఇంటర్ సప్లమెంటరీ ఫలితాల్లో స్టేట్ టాఫర్‌గా నిలిచిన రసజ్ఞ



సత్యమేవ జయతే – హైదరాబాద్ హైదరాబాద్ : ఇటీవల ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ ఫలితాల్లో వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం గిర్నిబావి గ్రామానికి చెందిన కర్రు రసజ్ఞ సత్తా చాటింది. హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య ఐఐటి అకాడమీ హయత్ నగర్ క్యాంపస్‌లో మొదటి సంవత్సరం చదువుతున్నది. కాగా, ఎంపీసీ మొదటి సంవత్సరం విభాగంలో 470 మార్కులకు గాను 469 మార్కులు సాధించి స్టేట్ టాపర్ గా నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థిని రసజ్ఞను పలువురు అధ్యాపకులు, గ్రామస్తులు అభినందించారు.

## ఆర్ కే సెవెన్ కోర్ట్ యార్డ్ ఫామ్హౌస్ పరిసర ప్రాంతంలో మొక్కలు నాటారు...

### మొక్కలను నాటడమే కాదు వాటి పరిరక్షణ కూడా చూడాలన్నారు..



సత్యమేవ జయతే–గుమ్మడిదలపర్యావరణ పరిరక్షణలో భాగంగా గుమ్మడిదల మండల పరిధిలోని నాగిరెడ్డి గూడెం పంచాయతీలో మంగళవారం ఆర్ కే సెవెన్ కోర్టు యాడ్ ఫామ్ హౌస్ పరిసర ప్రాంతంలో మొక్కలు నాటారు ఈ సందర్భంగా రాజూరి రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర పర్యావరణ పరిరక్షణ వాతావరణ సమతుల్యతను పరిగణములోకి తీసుకుని ఆర్ కె సెవెన్ కోర్టు యాడ్ ఫామ్ హౌస్ లో మొక్కలు నాటారు కార్యక్రమంలోయువ నాయకులు మండల ప్రాథమిక పరపతి సంఘం డైరెక్టర్ గడ్డం శ్రీనివాస్ రెడ్డి, గడ్డం జంగారెడ్డి, గడ్డం సీతారాం రెడ్డి, జి బిక్షపతి, గడ్డం మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లకై.. జులై 17న రాష్ట్ర వ్యాప్తంగా రైల్‌రోకో : ఎమ్మెల్సీ కవిత



సత్యమేవ జయతే – హైదరాబాద్ హైదరాబాద్ : బీసీ రిజర్వేషన్లకై జులై 17న రాష్ట్ర వ్యాప్తంగా రైల్‌రోకో కార్యక్రమానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. అన్ని బీసీ సంఘాల నాయకులను కలుపుకొని రైల్‌రోకోలో పాల్గొంటామని ఆమె పేర్కొన్నారు. మెదక్ జిల్లాలో తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఆధ్వర్యంలో బీసీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్లపై బిల్లు ఆమోదానికి కేంద్రంపై ఒత్తిడి చేస్తామన్నారు. ఢిల్లీ పాలకులకు తెలంగాణ బీసీల పౌరుషం ఏంటో చూపిస్తాం. ఢిల్లీ పాలనకు సెగ తాకేలా రైల్ రోకో ఉంటుంది. 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా ఎన్నికలు నిర్వహించనివ్వబోవం. 42 రిజర్వేషన్లు ఇవ్వకుండా కాంగ్రెస్ కుట్ర చేస్తుంది. బీసీ విద్యార్థులు, మహిళలు ఈ ఉద్యమంలో పెద్ద ఎత్తున కలిసిరావాలి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ జాగృతి పోరాటం చేస్తోంది అని కవిత ప్రకటించారు.తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఒత్తిడితోనూ అసెంబ్లీలో ప్రభుత్వం మూడు బీసీ బిల్లులు పెట్టింది. వార్డు మెంబర్, సర్పంచ్‌లు కాని అనేక కులాలు బీసీల్లో ఉన్నాయి. అసెంబ్లీ గడప తొక్కని అనేక కులాలు ఉన్నాయి. రాజకీయ అవకాశాల్లో బీసీ మహిళల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మహిళా రిజర్వేషన్లలో బీసీలకు ఉప కోటా ఉండాలి. ఇది రాజకీయ వేదిక కాదు%ా% ఇది మానవ హక్కులు, సామాజిక హక్కులు వేదిక. సమాజంలో 56 శాతం జనాభాకు సంబంధించి హక్కులు కోరుతుంటే అవి మానవ హక్కులు కావా..? ఇప్పుడు మాట్లాడాల్సిన సందర్భం వచ్చింది.. కాబట్టి అందరూ కలిసికట్టుగా హక్కల కోసం పోరాటం చేయాలి. సరైన సమయంలో జాగృతి మాట్లాడింది కాబట్టి అసెంబ్లీలో మూడు బిల్లులు వచ్చాయి. అదే స్ఫూర్తితో బీసీ బిల్లులను కేంద్రం ఆమోదించేలా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని కవిత పేర్కొన్నారు.ఢిల్లీకి బిల్లు పంపించి కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు దులుపుకుంది. మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు బీసీ బిల్లు గురించి ఒక్క రోజు కూడా మాట్లాడలేదు. రఘునందన్ రావు బీసీల కోసం ఎందుకు మాట్లాడడం లేదు..? కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ బిల్లును ఎందుకు ఆమోదించడం లేదని ప్రతీ ఒక్కరు రఘునందన్ రావును ప్రశ్నించాలి. కులగణన వివరాలను కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల వారీగా ప్రకటించాలి. రౌండ్ టేబుల్ సమావేశానికి రానివ్వకుండా బీసీ నాయకులను మెదక్‌లో కొంత మంది బెదిరించే ప్రయత్నం చేశారు. దీన్ని బట్టే వాళ్లు భయపడుతున్నారని అర్థమవుతోంది అని ఎమ్మెల్సీ కవిత అన్నారు.

## డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ : దళితుడిపై దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి



సత్యమేవ జయతే – నిజాంపేట్ నిజాంపేట్ : బచ్చురాజ్‌పల్లికి చెందిన గాజులపల్లి స్వామిని తన వ్యవసాయ పొలంలో ట్రాక్టర్‌తో దున్నతుండగా దాడి చేసిన తిప్పలగుల్లకు చెందిన నిందితుడు సహదేవ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శంకర్ మంగళవారం బచ్చురాజ్‌పల్లికి వెళ్లి బాధితుడు స్వామిని పరామర్శించి విలేకరులతో మాట్లాడారు.

గ్రామంలో సర్వే నంబర్ 163,164లలో 3.30 ఎకరాల భూమిని 40 ఏండ్ల కింద గౌరి బుచ్చమ్మ, గౌరి రాజయ్య నుంచి దళితులు కొనుగోలు చేయగా ప్రభుత్వం వారి పేరిట భూపట్టా పాస్ బుక్‌లను ఇచ్చిందన్నారు. ఇదిలా ఉండగా గత ఏడాది నుంచి భూ విషయంలో సహదేవ్ దళితులను బెదిరింపులకు గురి చేస్తూ.. దాడి చేయగా బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశాడన్నారు. తూప్రాన్ డీఎస్పీ ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుపై సోమవారం విచారణ చేశారన్నారు. దాడికి పాల్పడ్డ నిందితుడు సహదేవ్‌ను ఇంకా అరెస్ట్ చేయలేదని.. అతన్ని వెంటనే అరెస్ట్ చేస్తూ దళితులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజీవ్,గ్రామస్తులు వినోద్‌నాయక్,బాబు,శ్రీను తదితరులు ఉన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న ఆర్మీ జవాన్‌కు ఘన సన్మానం



సత్యమేవ జయతే – మెదక్ మెదక్ : శివ్వంపేట మండలం పెద్దగొట్టిముక్ల గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ సింగిరెడ్డి మధుసూదన్ రెడ్డి ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని నేడు స్వగ్రామానికి తిరిగి విచ్చేశారు.

ఈ సందర్భంగా గ్రామ జడ్పీ హైస్కూల్, గ్రామస్థుల ఆధ్వర్యంలో ఆర్మీ జవాన్ మధుసూదన్ రెడ్డిపై పూలు జల్లుతూ బ్యాండ్ మేళం, డప్పు చప్పుళ్లతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మధుసూదన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న అమర జవాన్లకు నివాళి అర్పించారు.

భారత్ మాతాకి జై%ౌ% వందేమాతరం అంటూ పలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, గ్రామ యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## క్రీడా పాఠశాలలకు విద్యార్థుల ఎంపిక




సత్యమేవ జయతే – నర్సాపూర్ నర్సాపూర్ : ఈ నెల 18 నుండి క్రీడా పాఠశాలలకు విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని మండల విద్యాధికారి తారాసింగ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. క్రీడా పాఠశాలలో 4వ తరగతి విద్యార్థులు చేరడానికి స్పోర్ట్స్ అథారిటీ సెలక్షన్ కమిటీ మండల, జిల్లా స్థాయిలో 18 మరియు 19 తేదీల్లో ఎంపిక చేయడం జరుగుతుందని వెల్లడించారు.

రాష్ట్రవ్యాప్తంగా హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ పాఠశాలలకు ఎంపిక జరుగుతుందని తెలిపారు. కావున నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో 18 నాడు ఎంపికలు జరుగుతాయని చెప్పారు. ఈ ఎంపికకు అర్హత గల విద్యార్థులు 3వ తరగతి పూర్తి చేసి ఉండాలని.. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి ఉండాలని సూచించారు. వీరికి కళాశాల మైదానంలో కౌన్సిలింగ్ నిర్వహించి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

## యూనిఫామ్స్.. నోట్‌బుక్స్ అందాయా.. బంజారాహిల్స్ సర్కార్ బడిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



సత్యమేవ జయతే – హైదరాబాద్ హైదరాబాద్ : మీకు యూనిఫామ్స్ అందాయా.. నోట్‌బుక్స్ ఇచ్చారా.. అంటూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన అడిగి తెలుసుకున్నారు. శ్రద్ధగా చదువుకుని పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు.బంజారాహిల్స్ రోడ్ నెం 7లోని గత ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం జిల్లా కలెక్టర్ హరిచందన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. స్కూల్‌లో విద్యార్థులతో నేరుగా మాట్లాడి ఏవైనా సమస్యలున్నాయా అంటూ ప్రశ్నించారు. యూనిఫామ్స్, నోట్‌బుక్స్ వచ్చాయా.. అంటూ వాకబు చేశారు. అన్ని క్లాసులను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులచేత టెక్స్ట్ బుక్స్ చదివించారు. స్కూల్‌లో ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, టాయ్‌లెట్స్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిశుభ్రకరమైన వాతావరణం ఉండేలా చూసుకోవాలని అద్యాపకులను ఆదేశించారు.

సత్యమేవ జయతే



## ఇరాన్ %-% ఇజ్రాయెల్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు




సత్యమేవ జయతే - న్యూఢిల్లీ న్యూఢిల్లీ : ఇరాన్ %-% ఇజ్రాయెల్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో, ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న లేదా ప్రయాణిస్తున్న తెలంగాణ వాసులు, విద్యార్థులకు సహాయం అందించేందుకు, తెలంగాణ ప్రభుత్వం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ప్రారంభించింది.

విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, రెండు దేశాల భారత రాయబార కార్యాలయాల నుంచి లభించిన తాజా సమాచారం ప్రకారం, ఇప్పటి వరకు తెలంగాణకు చెందిన ఎవరూ ప్రభావితమైనట్టు సమాచారం లేదు. అయినప్పటికీ, భవిష్యత్ పరిణామాల దృష్ట్యా ముందు జాగ్రత్తగా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయడమైందని అధికారులు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశానుసారం.. తెలంగాణ భవన్ సీనియర్ అధికారులు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో, ఆయా దేశాల రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదిస్తూ అవసరమైతే తక్షణ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నారు.

- సహాయం కోసం ప్రజలు క్రింది నెంబర్లను సంప్రదించవచ్చు..

వందన, పి.ఎస్, రెసిడెంట్ కమిషనర్ %- 9871999044

%జి. రక్షిత్ నాయక్, లైజన్ ఆఫీసర్ %- 9643723157

%జావేద్ హుస్సేన్, లైజన్ ఆఫీసర్ %- 9910014749

%సిహెచ్ చక్రవర్తి, పౌర సంబంధాల అధికారి %- 9949351270

## తెలంగాణ రాష్టం లోని అన్ని జిల్లాలో డిజిపి జితేందర్ పర్యటిస్తున్న నేపథ్యంలో వికారాబాద్ జిల్లాలో పర్యటన..




సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా...పోలీస్ అధికారులతో సమావేశం అనంతరం వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో మీడియా సమావేశం డీజీపీ జితేందర్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే తెలంగాణ రాష్ట్రంలో సైబర్ నేరాలు చాలావరకు తగ్గాయి.నార్కోటిక్ నియంత్రణలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది.తెలంగాణ రాష్ట్రంలో గంజాయి ఉత్పత్తి లేదు ఇతర రాష్ట్రాల నుండి మన రాష్ట్రం మీదుగా సరఫరా అవుతుందని.. నకిలీ విత్తనాల కట్టడి కోసం రాష్ట్రంలో ప్రత్యేక నిఘ బృందాలు ఏర్పాటు చేశామని..వికారాబాద్ జిల్లాలో 60 రోడ్డు ప్రమాదాల పాయింట్స్ ను గుర్తించాం రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటుంది.తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు ఉత్తమమైన సేవలు అందిస్తున్నామని.. ప్రజలు 100 డయల్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### రైతుల ఖాతాలలో వానాకాలం పంట పెట్టుబడి నిధులు జమ రైతు భరోసాతో అన్నదాతకు ఆదరువు కల్పించిన ప్రభుత్వం వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.



సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా.వ్యవసాయాన్ని పండుగలా మారుస్తూ, రైతులకు బాసటగా నిలవాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన వికారాబాద్ జిల్లాలోని అందరు రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తోందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.

వానాకాలం - 2025 సీజన్ కు సంబంధించి పంట పెట్టుబడి సాయం క్రింద జిల్లాలో 3,18,447 మంది రైతులకు రూ. 384.4 కోట్ల నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో జమ చేస్తోందని అన్నారు. రైతుల బ్యాంకు ఖాతా వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులు ఇప్పటికే రైతు భరోసా పోర్టల్ లో నమోదు చేశారని అన్నారు. ఈ వివరాలకు అనుగుణంగా మంగళవారం సాయంత్రం వరకు జిల్లాలోని 205361 మంది రైతుల ఖాతాలలో రూ. 163.6 కోట్ల నిధులు ఇప్పటికే జమ అయ్యాయని కలెక్టర్ వివరించారు. పెట్టుబడి సాయం ప్రారంభించి ఈ రోజు వరకు మూడు ఎకరాల లోపు వ్యవసాయ భూమి కలిగిన జిల్లాలోని రైతుల ఖాతాలలో ఎకరాకు పంట పెట్టుబడి సాయం నిధులను ప్రభుత్వం వారి ఖాతాలలో జమ చేసిందని తెలిపారు. తాజాగా మంగళవారం మూడెకరాల వరకు సాగు భూమి ఉన్న 205361 మంది రైతుల ఖాతాలలో రూ. 163.6 కోట్ల నిధులు జమ చేయడం జరిగిందని కలెక్టర్ వివరించారు. మిగతా రైతులకు పంట పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం రైతు భరోసా నిధులను వారి వారి ఖాతాలలో జమ చేయనుందని తెలిపారు. పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు రైతు భరోసా ఉపయుక్తంగా నిలుస్తుందని కలెక్టర్ అన్నారు. వానాకాలం సాగు ప్రారంభానికి ముందే ప్రభుత్వం రైతు భరోసా నిధులు అందించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు

# 600 మంది ఫోన్లు ట్యాప్..

## బాధితుల్లో జర్నలిస్టులు, సినీ, రాజకీయ ప్రముఖులు

సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా.

ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. 2023 ఎన్నికలకు రెండు నెలల ముందు అధిక సంఖ్యలో ఫోన్లు ట్యాప్ చేసినట్టు సిట్ గుర్తించింది. ఇప్పటి వరకు దాదాపు 600 మందికి పైగా ఫోన్లు ట్యాప్ అయ్యాయని అధికారుల దర్యాప్తులో తేలింది. బాధితుల్లో జర్నలిస్టులు, సినీ, రాజకీయ ప్రముఖులు, వ్యాపారులు ఉన్నారు. ఫోన్ ట్యాపింగ్ బాధితులు ఒక్కొక్కరుగా జూబ్లీహిల్స్ పీఎస్‌కు వచ్చి వాంగ్మూలం ఇస్తున్నారు.

బాధితులు చెప్పిన వివరాల మేరకు ప్రభాకర్‌రావుతో పాటు నలుగురు నిందితులను కూడా కలిపి విచారించాలని సిట్ భావిస్తోంది. ప్రతి రోజు ఉదయం 2గంటల పాటు ప్రభాకర్‌రావు తమకు బ్రీఫింగ్ ఇచ్చే వారని నలుగురు నిందితులు సిట్ అధికారులకు తెలిపారు. పోల్-2023 వాట్సాప్ గ్రూప్‌పై ప్రధానంగా ప్రభాకర్ రావును సిట్ ప్రశ్నించనుంది. అప్పటి టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి సన్నిహితులు గాలి అనిల్, వినయ్ రెడ్డిల ఫోన్‌లు ట్యాప్ చేసి స్వాధీనం చేసుకున్న డబ్బుపై కూడా సిట్ ఆరా తీసింది. పొంగులేటి, రాజగోపాల్ రెడ్డికి చెందిన కంపెనీల డబ్బును ఫోన్లు ట్యాప్ చేసి టాస్క్ ఫోర్స్ ద్వారా స్వాధీనం చేసుకున్నట్లు



గుర్తించారు. 2023 ఎన్నికల సమయంలో ట్యాపింగ్ బాధితుల్లో భారాస నేతలు కూడా ఉన్నారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్న వారి ఫోన్లు ట్యాప్ చేశారని సిట్ ఇప్పటికే ఆధారాలు సేకరించరు.

# సముద్రంలో రహస్యమందిరం



"నేను ఎలాగూ శిక్షపడ్డవాణ్ని. ద్వీపంలో ఒంటరిగా చనిపోయే బదులు ఇప్పుడే మరణిస్తాను. నావల్ల మీరందరూ బతికితే అంతేచాలు" అని ముందుకొచ్చాడు విజయభాస్కరుడు. అంటూనే ఒక్క ఉదుటన ఎగిరి, సముద్రంలో దూకాడు. ఓడకంటే ముందుగా ఈదుకుంటూ ఆ ఇనుపస్తంభం వద్దకు చేరుకున్నాడు. అతడు పట్టుకోగానే ఆ స్తంభం.. ఎలాగైతే పైకి లేచిందో, అలాగే సముద్రంలోకి దిగబడి పోయింది. విజయభాస్కరుడు తన ప్రాణాలు పోయాయనే అనుకున్నాడు. కళ్లు తెరిచి చూసేసరికి.. ఎటుచూసినా రత్నమాణిక్యాలు, బంగారు తాపడాలతో అక్కడంతా దేదీప్యమానంగా ఉంది. 'ఓహో! నేను చనిపోయి స్వర్గానికి వచ్చాను కాబోలు' అనుకున్నాడు విజయభాస్కరుడు.అంతలో పెద్దపెద్ద కోరలతో, వికృతమైన ముఖం, పెద్దగుహలాంటి నోటితో ఒక భయంకరమైన రాక్షసి తానున్న వైపే రాసాగింది. 'అయితే ఇది స్వర్గం కాదు.. నరకం కాబోలు' అనుకున్నాడు విజయభాస్కరుడు. దాని కంటబడకుండా ఓ మూలగా దాక్కున్నాడు. ఆ రాక్షసి అక్కడంతా వెతికి కొన్ని వంటకాలను పెద్దపెద్ద పళ్లేల్లో నింపుకొని అక్కడినుంచి బయల్దేరింది. విజయభాస్కరుడు ఆ రాక్షసిని అనుసరించాడు. అక్కడినుంచి ఆ రాక్షసి వేరొక మందిరంలో ప్రవేశించింది. అక్కడ కొండంత ఎత్తులో ఈమెకంటే భయంకరమైన ఆకారంతో మరో రాక్షసి కూర్చుని ఉంది.

"ఏమే అయోముఖీ! ఇంతాలస్యం చేశావేం?! భోజనం సిద్ధం చేశావా?" అని అడిగింది.

"ఇదిగోనమ్మా!" అంటూ పళ్లేలు రెండూ ఆమె ముందు పెట్టింది అయోముఖి.

ఆ పెద్దరాక్షసి.. పళ్లేల కేసి ఒకసారి ఆకలిగా చూసి.. "నరమాంసం ఏది?! ఈవేళ సముద్రంమీదికి లోహస్తంభాన్ని విడిచిపెట్టలేదా?" అని అడిగింది.

"విడిచిపెట్టానమ్మా! కానీ నరమాంసం రాలేదు. ఇదిగో ఇవే వచ్చాయి" అని సమాధానం ఇచ్చింది అయోముఖి.

పెద్దరాక్షసి గుండెలు బాదుకుంది.

"ఏదో చేటుకాలం దాపురించింది. ఈ జ్వాలాముఖి ఆయుర్దాయం తీరిపోయినట్లుంది. నిండా మూడువేల ఏళ్లు కూడా దాటకుండానే నేను చావాలి కాబోలు" అన్నది ఆందోళనగా.

"ఏమిటమ్మా! ఎందుకీ అర్థం లేని ఆందోళన. మీలాంటి అసహాయ శూరురాలిని ఎవరేం చేయగలరు?!" అన్నది అయోముఖి ధైర్యం చెప్పే ఉద్దేశంతో. అతి ప్రయత్నంమీద ఆమెను ఊరుకోబెట్టి.."ఎవడైనా లోహస్తంభానికి తగులుకుని వస్తేనే కదా.. ఈవేళ ఎవరూ రానేలేదమ్మా!" అన్నది అయోముఖి. "నువ్వు సరిగా చూశావా?" ఆత్రుతగా అడిగింది జ్వాలాముఖి."చూశానమ్మా! ఎవరూ రాలేదు. ఇప్పటివరకు చేపలైనా, మనుషులైనా ప్రాణం పోయిన తరువాతనే కదా మన కూరల తట్టలో పడేది. ఇదంతా జరిగేది కాదు.. పెట్టేది కాదు. అసంభవమైన జాతకాన్ని రాసి, నిన్ను మయబ్రహ్మ చిరంజీవిని చేశాడు. మరేమీ భయపడకు. హాయిగా భోజనం చేయి" అన్నది అయోముఖి.ఆ మాటలు విని కొంత ధైర్యం తెచ్చుకుని, భోజనానికి ఉపక్రమించింది జ్వాలాముఖి. తింటున్నంతసేపూ తానెంతమంది మానవులను ఎన్నెన్నిరకాలుగా విరుచుకు తిన్నదో కథలు కథలుగా చెప్పసాగింది. అదంతా వింటున్న విజయభాస్కరుడు.. 'ఇంత హింసకు పాల్పడిన రాక్షసి కూడా తన ప్రాణాల మీదికి వస్తున్నదంటే ఎంత చిత్రంగా ఏడ్చింది?!' అని మనసులో అనుకున్నాడు."ఇంతకూ మా హేమప్రభ ఏం చేస్తున్నదే?!" అడిగింది.. బ్రేవ్ మంటూ తేన్చి, మూతి తుడుచుకుంటూ జ్వాలాముఖి.

"చెలికత్తెతో కలిసి బొమ్మల పెళ్లి చేస్తున్నది. పిల్లలు చక్కగా ఆడుకుంటున్నారు" చెప్పింది అయోముఖి.సంతోషం కొద్దీ జ్వాలాముఖి మందహాసం చేసింది. ఆ చప్పుడు భరించలేక విజయభాస్కరుడు చెవులు మూసుకున్నాడు. కొద్దిసేపటికి అయోముఖి అక్కడినుంచి వెళ్లిపోయింది. జ్వాలాముఖి నిద్రకు ఉపక్రమించింది. విజయభాస్కరుడు మెల్లిగా ఆమె మంచం వద్దకు వెళ్లి, ఒరనుంచి సర్రున కత్తిని లాగాడు.జ్వాలాముఖిని తట్టి లేపాడు. నిద్రమత్తులో కళ్లు సరిగ్గా తెరవకుండానే విజయభాస్కరుణ్ని గమనించి.. "ఎవడవురా నువ్వు?" అని హుంకరించింది రాక్షసి.

మరొక్క క్షణంకూడా ఆలస్యం చేయకుండా, దాని తలకాయను ఆనపకాయ తరిగినట్లు తరిగేశాడు భాస్కరుడు. కొండంత దేహం కలిగిన ఆ రాకాసి కించిత్తు శబ్దం చేయకుండా కన్ను మూసింది. ఆ తరువాత అయోముఖి వద్దకు వెళ్లి, ఆమె చేత కూడా పరలోకయాత్ర చేయించాడు.

లోకకంటకులైన రాక్షసులను చంపాననే తృప్తి కలిగింది కానీ, అక్కడినుంచి బయటికి ఎలా వెళ్లాలో తెలియలేదు. ఏదైనా ఆధారం దొరుకుతుందేమోనని ఆ మందిరంలోనే తిరగసాగాడు. సముద్రం మధ్యలోని ఆ రహస్యమందిరానికి అనుబంధంగా అనేక భవంతులు, ఉద్యానవనాలు ఉన్నాయి. ఒకచోట బొమ్మల పెళ్లిళ్లు చేస్తున్న హేమప్రభ కనిపించింది. అతిలోక సౌందర్యవతి అయిన ఆమెను చాలాసేపు కన్నార్పకుండా చూడసాగాడు విజయభాస్కరుడు. "అమ్మా గౌరీదేవీ! ఈవేళ నీ పెళ్లి చేసినందుకు మా చెలికి త్వరలోనే మంచి పెళ్లికొడుకు దొరికేలా చూడు" అన్నది హేమప్రభ సఖురాలు.

ఆ మాటలతో సిగ్గు ముంచుకువచ్చి, చిరుకోపంగా మారగా.. "పోవే పిచ్చిమాటలూ నువ్వూనూ!" అంటూ ఆమెను మెల్లగా తట్టింది హేమప్రభ.

ఉద్యానంలో విహరిస్తుండగా వారి చూపులు విజయభాస్కరునిపై పడ్డాయి. తొలిచూపులోనే అతణ్ని తన మనోహరునిగా ఎంచుకుంది హేమప్రభ. ఆమె చెలికత్తె చొరవ తీసుకుని రాయబారం నడిపింది. విజయభాస్కరుడు స్వయంగా విక్రమార్కుని మనుమడని తెలుసుకుని ఎంతో సంతోషించింది."రాకుమారా! ఈమె విద్యాధర చక్రవర్తి విశ్వావసుని మనుమరాలు. దేవవ్రతుని కూతురు. ఈమె తల్లి రాక్షసి అయినా, ఈమెలో ఆ లక్షణాలు లేవు. నీకు తగినది" అన్నది చెలికత్తె. హేమప్రభకు విజయభాస్కరునికి అప్పుడే గాంధర్వ వివాహం జరిగింది. దంపతులిద్దరూ ఆ రాత్రి అమరసుఖాలలో తేలారు. తెల్లవారుతూనే హేమప్రభ సఖురాలు గది తలుపులు దబదబా బాదింది."మీ అమ్మమ్మను, అయోముఖిని ఎవరో చంపేశారు" అని దుర్వార్త వినిపించింది. హేమప్రభ దుఃఖిస్తూ అమ్మమ్మను చూడబోయింది. విజయభాస్కరుడు ఆమెను అనుసరించాడు.

"ఈమె లోకకంటకురాలు. చెప్పలేనంత హింసకు పాల్పడింది. అందుకని నేనే చంపాను" అని చెప్పాడు విజయభాస్కరుడు. హేమప్రభ కళ్లు తుడుచుకుని.."దీనికి ఇలాంటి చావు రావడం సమంజసమే! కానీ ఎంతైనా అమ్మమ్మ కదా అందువల్ల వద్దనుకున్నా దుఃఖం ఆగడంలేదు" అన్నది. ఆ తరువాత రాక్షస స్త్రీలిద్దరినీ ఖననం చేశారు.

చెలికత్తె తప్ప మరో నరమానవుడు లేని ఏకాంత లోకంలో కొత్తదంపతులు కొంతకాలం హాయిగా సుఖించారు. ఒకనాడు విజయభాస్కరుడు తన తల్లిని కలుసుకుని, త్వరలోనే తిరిగి వస్తానని.. వెళ్లడానికి మార్గం చూపమని కోరాడు.

"నిన్ను చూడకుండా ఒక్కక్షణమైనా నిలువలేను" చాలాసార్లు అతని అభ్యర్థనను తోసిపుచ్చింది హేమప్రభ.

చివరికి.. "ఒక్కవారం రోజులు సమయం ఇస్తున్నాను. ఆలోపుగా తిరిగి రావాలి. ఇదిగో ఈ కంకణాన్ని చేతికి ధరించి, ఎదురుగా ఉన్న తటాకంలో మునిగావంటే.. నువ్వు కోరుకున్న చోటికి వెళ్లగలవు. మళ్లీ ఏదైనా తటాకంలో మునిగినప్పుడు నన్ను స్మరిస్తే ఇక్కడికే వచ్చేస్తావు" అని చెప్పింది.

ఆమె ఇచ్చిన కంకణం సహాయంతో విజయభాస్కరుడు శోభావతి పట్టణానికి వెళ్లాడు. తన తల్లిని గురించి ఆరా తీస్తే.. "కుమారుడు మరణించాడన్న వార్త విని, తీర్థయాత్రలు చేస్తూ ఈ దేశాన్ని విడిచిపెట్టి పోయింది" అని చెప్పారు. రాజైన యశస్కరుడు ఎలా ఉన్నాడని అడిగితే.. "అమాయకుడైన విజయభాస్కరుడి చావుకు కారణం అయ్యాడన్న బాధ.. ఆయనకు వైరాగ్యం కలిగించింది. రాజ్యాన్ని మంత్రులకు విడిచిపెట్టి ఆయన కూడా తీర్థయాత్రలకు వెళ్లిపోయాడు" అంటూ చెప్పారెవరో. విజయభాస్కరుడు తన తల్లిని వెతుక్కుంటూ అనేక క్షేత్రాలు సందర్శించసాగాడు. చివరికి ఒక శివరాత్రి రోజున శ్రీశైలానికి వెళ్లాడు. ఉపవాస, జాగరాలతో మల్లికార్జునుణ్ని సేవించాడు. మరునాడు తెల్లవారుజామున స్నానానికి వెళ్తుండగా.. కోటితీర్థమనే బావిలో ఎవరో పడ్డ చప్పుడు వినిపించింది. వెంటనే విజయభాస్కరుడు కూడా బావిలో దూకాడు. అందులో పడ్డది ఎవరో కాదు.. చారుమతి. 'మరణము అకాలమున రాదు మహిని ఎవ్వనికిన్'.. అంటూ తాను చెప్పిన మాటలనే ఆమె కలవరిస్తున్నది. ఆమెకు ఉపచారాలు చేసి పూర్తిగా స్పృహ వచ్చేలా చేశాడు విజయభాస్కరుడు. అంతలో అక్కడికి యశస్కరుడు వచ్చాడు.

"నీ ఎడబాటుకు గురైన తల్లిని నేను స్వయంగా రక్షిస్తున్నాను" అని చెప్పాడు. "నేను చేసిన తప్పునకు పరిహారంగా నా రాజ్యాన్ని నీకు అర్పిస్తున్నాను. స్వీకరించు" అన్నాడు. అలాకాదని అతడికేదో సర్ది చెబుతుండగా.. ఓ అందమైన అమ్మాయి పరుగెత్తుకుంటూ వచ్చింది.

వేషం చూస్తే జోగినిలా ఉంది కానీ, లక్షణాలను బట్టి చూస్తే రాచకన్య. చారుమతి చేయి పట్టుకుని.. "అత్తా! చెప్పకుండా ఎందుకు వచ్చావు? నువ్వేమైపోయావో అని ఎంత కంగారు పడ్డానో తెలుసా?!" అన్నది.. తన ఆదుర్దాను మాటల్లో కనబరుస్తూ.విజయభాస్కరుడు అయోమయంగా చూశాడు. చారుమతీదేవి నవ్వుతూ.. "ఆనాడు దొంగలబారినుంచి కాపాడావు కదా.. కలభాషిణి నువ్వే పతివి కావాలని పట్టుబట్టి కూర్చుందట. నువ్వు చనిపోయావని తెలిసి, తండ్రి వేరొక పెళ్లి చేయడానికి నిశ్చయిస్తే.. ఇంట్లోనుంచి పారిపోయి వచ్చింది. నన్ను కంటికి రెప్పలా కాపాడుతున్నది" అన్నది. విజయభాస్కరుడు బతికే ఉన్నాడనే సంగతి తెలిసి అందరూ ఆనందించారు. అందరూ కలిసి చంద్రప్రస్థ నగరానికి ప్రయాణమయ్యారు. అక్కడికి వెళ్లేసరికి రాజ్యకాంక్షతో కీర్తికేతుడు చంద్రప్రస్థంపై దండెత్తి వచ్చాడని, యుద్ధంలో ఓడిపోయి.. చంద్రగుప్తునికి బందీగా చిక్కాడని తెలియవచ్చింది.

## ఎడిటోరియల్

# నేల ఎడారీకరణ అంచున సాగు భూములు!

నిస్సార భూమికి తిరిగి జీవం పోసే శక్తి మనకు ఉంది. నేలల్ని పునరుద్ధరిస్తే పలు నూతన అవకాశాలు సృష్టించబడతాయి. నేడు అలాంటి అవకాశాలకు ద్వారాలు తెరవాల్సిన సమయం ఆసన్నం అయ్యింది. ఆరోగ్యకర పర్యావరణం మీదనే 50 శాతం ప్రపంచ జిడిపీ ఆధారపడి ఉంటుంది. నేడు ప్రతి ఏట ఈజిప్ట్ దేశమంత భూభాగం క్షీణించిపోతున్నది. దీని వల్ల జీవవైవిధ్యానికి నష్టం వాటిల్లడం, కరువులు పెరగడం, ధరలు పెరగడం, అస్థిరత రాజ్యమేలడం, పౌర సమాజం వలసల స్థానభ్రంశం చెందడం జరుగుతుంది. భూమిని పునరుద్ధరిస్తే ఉత్పాదకత పెరగడం, ఆహార భద్రత సాధించడం, నీటి చక్రాలు బలపడడం, గ్రామీణులకు జీవనోపాధులు పెరగడం జరుగుతుంది. భూక్షీణత, కరువులు అనేవి అవిభాజ్యమైన అనర్థాలు. వీటి వల్ల ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతుంది, ఆహార ఉత్పత్తులు తగ్గుతాయి, జీవన నాణ్యతకు కోతపడుతుంది, నీటి లభ్యతకు గండి పడుతుంది.

నేల క్షీణత, ఎడారీకరణ అనర్థాలను అడ్డుకోవడం, పునరుద్ధరించడం లాంటి అంశాలను చర్చించడానికి ప్రతి ఏట 17 జూన్ రోజున ప్రపంచ ఎడారీకరణ, కరువు వ్యతిరేక దినం పాటించాలని 1994లో ఐరాస తీర్మానించడం, 1995 నుంచి పాటించడం జరుగుతున్నది. 2025 ప్రపంచ ఎడారీకరణ, కరువు వ్యతిరేక దినం ఇతివృత్తంగా భూమిని పునరుద్ధరించడం : అవకాశాల తిరిగి పొందడం అనబడే అంశాన్ని తీసుకొని కొలంబియాలో సమావేశం నిర్వహిస్తున్నారు. ప్రకృతికి పునాది సారవంతమైన నేల. ఇలాంటి ఆరోగ్యకర భూములను మానవ, ప్రకృతి ప్రమేయాలతో నిస్సారం, నిర్వీర్యం చేయడం జరుగుతోంది. ఇలాంటి నేల క్షీణత మరికొంత కాలం కొనసాగితే శాశ్వతంగా పనికి రాని ఎడారులుగా మారి పోతాయని గమనించాలి. నేల ఎడారీకరణను అడ్డుకోని యెడల రాబోయే 25 ఏండ్లలో 12 శాతం ఆహార ఉత్పత్తులు పడిపోయి 30 శాతం వరకు సరుకుల ధరలు పెరుగుతాయి. ఆహార అభద్రత ఉచ్చులో చిక్కుకున్న భారతంలో వ్యవసాయ ఉత్పత్తులను గణనీయంగా పెంచడానికి 1960ల్లో నార్మన్ బోర్లాంగ్ నాయకత్వంలో హరిత విప్లవం రావడం. సాగు దిగుబడులు పెరగడం, ఆహార భద్రత సాధించడం జరిగినప్పటికీ ఒకే రకమైన వరి, గోధుమ పంటలను దశాబ్దాలుగా పండించడం కారణంగా సారవంతమైన నేలల నాణ్యత క్షీణించడం, ఎడారీకరణ అంచున నిలబడడం జరిగింది. ఇప్పటికే రాజస్థాన్, పంజాబ్, యూపీ, బీహార్, హర్యానా లాంటి రాష్ట్రాల్లో దాదాపు 5 మిలిమన్ హెక్టార్ల వ్యవసాయ నేలలు ఎడారీకరణ అంచున చేరాయి. అవగాహన లేమి, అశాస్త్రీయ సాగు పద్ధతులతో సారవంతమైన నేలలు నిస్సారమై ఎడారి భూములుగా మారడాన్ని నేల ఎడారీకరణ అంటారు. ఎడారీరకణతో కరువుకు విడదీయరాని సంబంధం ఉంటుంది. అడవుల నరికివేత, పశుగ్రాస అధిక వినియోగం, పోడు వ్యవసాయం, రోడ్ల నిర్మాణం, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, ఒకే రకమైన పంటల్ని ఏండ్ల తరబడి వేయడం లాంటివి కూడా నేల ఎడారీకరణను వేగవంతం చేస్తాయి.

నేల ఎడారీకరణ సంక్షోభంతో 3 బిలిమన్ల మానవాళి పేదరికంలోకి నెట్టబడడం, ఒక బిలియన్ ప్రజలు ఆకలి చావుల అంచున నిలబడడం జరుగుతున్నది. వ్యవసాయ నేలలకు సారం అందించని యె డల క్రమంగా శుష్క భూములుగా మారుతూదిగుబడులు తగ్గుతూ, కోసుకోలేని ఎడారులుగా మారతాయి. అతిగా కృత్రిమ ఎరువులు వాడడం, విచక్షణారహితంగా రసాయనాలు వాడడం, అధిక నీటిని వినియోగించడం, అతిగా పురుగు మందులు వాడడం, అశాస్త్రీయ సాగు పద్ధతులు లాంటి అంశాల వల్ల తాత్కాలికంగా దిగుబడులు పెరిగినా, క్రమంగా నేలలు నిస్సారమై ఎడారులను తలపిస్తాయి.

# విమానయానం గాలిలో దీపం




ఈ ఏడాది కేదార్‌నాథ్ యాత్ర సీజన్‌లో వరసగా చోటు చేసుకొంటున్న హెలికాప్టర్ ప్రమాదాలు ప్రయాణికుల భద్రతపై తీవ్ర ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. ఆదివారం కేదార్‌నాథ్‌నుంచి గౌరీకుండ్‌కు వస్తున్న హెలికాప్టర్ గుప్తకాశి వద్ద కూలిపోవడంతో పైలట్, రెండేళ్ల చిన్నారి సహా హెలికాప్టర్‌లోని మొత్తం ఏడుగురూ చనిపోయారు. చార్‌ధామ్ యాత్ర ప్రారంభమైన నెలన్నర రోజుల్లోనే ఇది అయిదో హెలికాప్టర్ ప్రమాదం కావడం గమనార్హం. ఇంతకు ముందు కూడా గత మే 8న ఉత్తర కాశీలో గంగోత్రికి యాత్రికులను తీసుకు వెళ్తున్న హెలికాప్టర్ లోయలో పడిపోవడంతో ఆరుగురు ప్రయాణికులు చనిపోగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. మరో మూడు హెలికాప్టర్ ప్రమాదాలు సంభవించినప్పటికీ అదృష్టవశాత్తు ప్రాణనష్టం జరగలేదు. అయితే నెలన్నర వ్యవధిలోనే ఇన్ని హెలికాప్టర్ ప్రమాదాలు ఎందుకు జరిగాయి? దీనికి కారణాలేమిటి? అన్న ప్రశ్నలు ప్రతిఒక్కరిలో తలెత్తుతున్నాయి.

ఆదివారం జరిగిన ప్రమాదానికి వాతావరణం హటాత్తుగా ప్రతికూలంగా మారడమే కారణమని తెలుస్తోంది. పైలట్ దట్టమైన పొగమంచు మధ్యలోకి వెళ్లి ఉండవచ్చని, ఎదురుగా ఏముందో కూడా కనిపించని స్థితిలో హెలికాప్టర్ కొండను ఢీకొని కూలిపోయి ఉంటుందని నిపుణులు అంటున్నారు. అయితే ప్రమాదం జరిగిన తీరు గమనిస్తే నిర్వాహకుల నిర్లక్ష్యం కూడా కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఈ ప్రమాదం తెల్లవారు జామున 5.17 గంటల సమయంలో జరిగింది. వాస్తవానికి కేదార్‌నాథ్‌లో వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఉదయం 6 గంటలతర్వాతినుంచి సాయంత్రం వరకు మాత్రమే హెలికాప్టర్ సేవలకు అనుమతి ఉంది. దీనికి భిన్నంగా ఆర్యన్ ఏవియేషన్ లిమిటెడ్‌కు చెందిన హెలికాప్టర్ తెల్లవారుజామునే బయలుదేరడాన్ని గమనిస్తే నిర్వాహకుల నిర్లక్ష్యం ఎంత ఉందో అర్థం అవుతుంది. కేదార్‌నాథ్ ఆలయం (%ఖవఝుతీఅఫ్ష్ట్ర ఎవఎజూశ్రీవ%) హిమాలయ పర్వతాల మధ్య ఉంది. ఇక్కడ వాతావరణం క్షణాల్లో మారిపోతూ ఉంటుంది. పైగా అంతా నిటారయిన కొండలు, లోయలతో కూడిన దట్టమైన అటవీ ప్రాంతం. అలాంటప్పుడు భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఉత్తరాఖండ్ ప్రభుత్వం హెలికాప్టర్ సేవలకు అనుమతించింది కానీ భద్రత విషయాలను పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించదు. కంట్రోల్ టవర్స్ కానీ, వాతావరణానికి సంబంధించి ముందస్తు సమాచారాన్ని అందించే ఏర్పాట్లు కానీ లేకపోవడంతో హెలికాప్టర్ ఆపరేటర్లు తమ ఇష్టానుసారం హెలికాప్టర్ సర్వీసులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదాయానికి ప్రాధాన్యత ఇవ్వడంతో ప్రయాణికుల భద్రతను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. హెలికాప్టర్ ప్రమాదం తర్వాత ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి చేసిన ప్రకటన సైతం ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది.

అత్యవసర సమావేశం నిర్వహించాక రెండు రోజులు పాటు కేదార్‌నాథ్‌కు హెలికాప్టర్ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో హెలికాప్టర్ సేవలకోసం కఠినమైన నిబంధనావళిని (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్)ను రూపొందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. అంతేకాకుండా డిజిసిఎ నిబంధనలను కచ్చితంగా పాటించాలని కూడా ఏవియేషన్ కంపెనీలను ఆదేశించారు. హెలికాప్టర్ సర్వీసులను క్రమబద్ధీకరించడంతో పాటుగా ఒక కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు సిఎం ప్రకటించారు. ఇదంతా బాగానే ఉంది కానీ చార్‌ధామ్ యాత్రకోసం చాలా ఏళ్ల క్రితమే హెలికాప్టర్ సర్వీసులను ప్రారంభించిన రాష్ట్రప్రభుత్వం ఇంతకాలంగా ఈ అంశాలపై ఎందుకు దృష్టిపెట్టలేదనే ప్రశ్న ఎవరికైనా వస్తుంది. 2010లో హెలికాప్టర్ సర్వీసులు ప్రారంభమయ్యాయి కానీ ఇప్పటివరకు భద్రత విషయాన్ని పెద్దగా ఎవరూ పట్టించుకున్నట్లు కనిపించదు. వాస్తవానికి కేదార్‌నాథ్ యాత్ర అత్యంత శ్రమతో కూడుకున్నది. గతంలో దుర్గమమైన పర్వత మార్గంలో కాలినడకన, వృద్ధులు, పిల్లలు లాంటి వారయితే గుర్రాల మీద ఆలయానికి చేరుకునే వారు. అయితే హెలికాప్టర్ సర్వీసును ప్రవేశపెట్టిన తర్వాత రోజు రోజుకు దానికి ఆదరణ పెరుగుతూ వచ్చింది. ప్రభుత్వ ఏజన్సీ ఐఆర్‌సిటిసితో పాటుగా పలు ప్రైవేటు ఏవియేషన్ కంపెనీలు హెలికాప్టర్ బుకింగ్‌తో పాటు సర్వీసులను కొనసాగిస్తున్నాయి. యాత్రికులు సైతం ఈ సర్వీసులకే ఎక్కువ మొగ్గు చూపుతుండడంతో ఏవియేషన్ కంపెనీల మధ్య అనారోగ్యకరమైన పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది. ఫలితంగా ఏటా ప్రమాదాల సంఖ్య పెరిగిపోతోంది. ముఖ్యంగా ఈ ఏడాది కేవలం 40 రోజుల్లోనే అయిదు ప్రమాదాలు సంభవించడం ఆందోళన కలిగిస్తోంది. అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో దాదాపు 280 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన ఇంకా కళ్ల ముందు మెదులుతున్న నేపథ్యంలో ఉత్తరాఖండ్ హెలికాప్టర్ ప్రమాదాలు మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. దట్టమైన మంచు కారణంగా చార్‌ధామ్ యాత్రలో భాగమైన నాలుగు ఆలయాలను ఏడాదిలో ఆరు నెలల పాటు మూసి ఉంచుతారనే విషయం అందరికీ తెలిసిందే. ఉత్తరాఖండ్ రాష్ట్రానికి పర్యాటకం ప్రధాన ఆదాయ వనరు కావడంతో ఈ యాత్ర కోసం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తూ ఉంటుంది. దీంతో భక్తుల సంఖ్య కూడా ఇటీవలి కాలంలో బాగా పెరిగింది. అదే ఇప్పుడు సమస్యలకు కారణమవుతోంది. ఆదాయంపై దృష్టిపెట్టిన ప్రభుత్వం అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలపైన కూడా శ్రద్ధ చూపించాల్సి ఉంటుంది. వరస ప్రమాదాల తర్వాతనైనా రాష్ట్రప్రభుత్వం ఈ దిశగా దృష్టి సారించడం మంచి పరిణామమే. హెలికాప్టర్ సేవలపై నిఘాతో పాటుగా వాటి క్రమబద్ధీకరణ, వాతావరణంపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలియజేయడంలాంటి చర్యలు తీసుకోవడం వల్ల ప్రమాదాలను చాలావరకు నివారించవచ్చు. ఎంతో శ్రమకు ఓర్చి చార్‌ధామ్ యాత్రకు వచ్చే భక్తులు క్షేమంగా, యాత్ర ముగించుకుని స్వస్థలాలకు చేరుకునేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

# విషాదం మధ్య, కొసమెరుపు ఐక్యత



%భద్రతా సమస్యలు, సాంకేతిక వైఫల్యాలను మించి ఏ విషయాన్ని అయినా తేలిగ్గా తీసుకునే మనస్తత్వాలు, ఆలోచనాధోరణులు పెరిగి పోయాయి. 'చెల్తాహై' అనే నిర్లక్ష్య ధోరణి చాలా విషయాలను ఏదో విధంగా మారుస్తుందని సామాజిక శాస్త్రవేత్త దీపాంకర్ గుప్తా అన్నారు. ఈ ధోరణి విమానయాన సంస్థలకూ వ్యాపించింది. మనదేశంలో విమానసంస్థలు కాలం చెల్లిన విమానాలను నడుపుతాయి. పైలెట్లు చాలా తీవ్రమైన షెడ్యూల్ ఎదుర్కొంటారు. ఇక విమానాశ్రయాలలో పాతకాలం నాటి మౌలిక సదుపాయాల మధ్యే పెరుగుతున్న ట్రాఫిక్ ను నిర్వహిస్తున్నారు. డిజిసిఏ సిబ్బంది సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. 153 విమానాశ్రయాలు, 1500 విమానాలను కేవలం 1,200 మంది ఉద్యోగులే పర్యవేక్షిస్తున్నారు. ఫలితంగా సమస్యలు తీవ్ర మవుతున్నాయి. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ 2023 ఆడిట్‌లో భారతదేశంలో భద్రతా పర్యవేక్షణ ప్రమాణాలు ప్రపంచ సగటు కంటే తక్కువగా ఉన్నట్లు పేర్కొంది. శిక్షణ, పర్యవేక్షణ, నిర్వహణలో ఉన్న లోపాలు, అంతరాలను ఆడిట్ వివరించింది. 2022లో ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ (%ూఅతీ ×అఎఖు జూతీఅఝ్ఆఓ్ఆశీఅ%) జరిగింది. ఆ తర్వాత విమానాలు, భద్రతా ప్రొటోకాల్ ను ఆధునీకరించడంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఎయిర్ లైన్స్ నిర్వహణ కంటే, షెడ్యూల్ లకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని మాజీ ఉద్యోగులు అంటున్నారు. సోషల్ మీడియా వేదిక ఎక్స్ లోని పోస్ట్ లలో ఇది ప్రతిధ్వనిస్తోంది. ఎయిర్ ఇండియా ఖర్చు తగ్గింపు వైఖరితో విపత్తు పొంచి ఉందని ఫ్లై సేఫ్ ఇండియా అన్న నెట్ వర్క్ పేర్కొంది. ప్రమాదానికి గురైన ఏఐ171 విమానంలోని 12 మంది సిబ్బందిలో 20 ఏళ్ల నగంథోయ్ శర్మ, 26 ఏళ్ల లామ్నుంథెమ్ సింగ్సన్ ఉన్నారు. మణిపూర్ యువత ఆకాంక్షలను ప్రతిబింబించే ఆ ఇద్దరూ విమాన సహాయకులుగా ఉన్నారు. మణిపూర్ లోని తౌబాల్ కు చెందిన మైతీ నగంథోయ్, ఇంఫాల్ లోని డిఎం కాలేజ్ ఆఫ్ కామర్స్ లో జరిగిన క్యాంపస్ రిక్రూట్ మెంట్ డ్రైవ్ తర్వాత 2023 ఏప్రిల్ లో ఎయిర్ ఇండియాలో చేరారు. ప్రపంచాన్ని అన్వేషించాలనే నగంథోయ్ ఉత్సాహాన్ని ఆమె సోదరి గీతాంజలి గుర్తుచేసుకుంది. ఆమె మొదటి ప్రయత్నంలోనే క్యాబిన్ క్రూ కోసం జరిగిన ఇంటర్వ్యూలో ఉత్తీర్ణత సాధించడంతో తర్వాత ఆమె ఈ కల ఆవిష్కృతమైంది. జూన్ 15న తిరిగి వస్తానని తన సోదరి చివర్లో చెప్పిందని గీతాంజలి గద్గద స్వరంతో ఉంది. అలాంటి సమయంలోనే మేం ప్రమాదం గురించి విని చలించిపోయామని పేర్కొంది. థాడౌ కమ్యునిటీకి చెందిన కుకి-జో జాతికి చెందిన లామ్నుంథెమ్ 2024లో ఎయిర్ ఇండియాలో చేరారు. 2023 మేలో మణిపూర్ లో చెలరేగిన జాతుల హింసాకాండ కారణంగా అమె కుటుంబం ఇంఫాల్ లోని ఓల్డ్ లంబులేన్ నుంచి కాంగ్ పోక్పికి పారిపోయి అక్కడ అద్దె ఇంట్లో ఉంటూ వచ్చింది. ఆమె తల్లి వితంతువు, ముగ్గురు సోదరులు (వీరిలో ఒకరు దీర్ఘకాలిక అనారోగ్యంతో పోరాడుతున్నారు) వీరికి ఏకైక జీవనాధారం.. లామ్నుంథెమ్ సంపాదనే. లామ్నుంథెమ్ జూన్ 11న చివరిసారిగా తన తల్లితో మాట్లాడిందని, లండన్ నుంచి వచ్చిన తర్వాత మళ్లీ ఫోన్ చేస్తానని హామీ ఇచ్చిందని, ఆ కాల్ ఇప్పటికీ రాలేదు. ఇక రాదు అని ఆమె బంధువు లున్కి ఫ్లైన్ తెలిపారు. మణిపూర్‌లో 2023 మేలో చెలరేగిన జాతుల ఘర్షణ 250 మందిని బలితీసుకుంది. దాదాపు 60వేల మంది నిరాశ్రయులయ్యారు. మైతీ, కుకీ-జో కమ్యునిటీల మధ్య తీవ్ర అంతరాలను పెంచింది. దీంతో రాష్ట్రంలో తీవ్ర ఉద్రిక్తతలు హెచ్చాయి. అయినప్పటికీ ఆకాశమార్గంలో కలిసి పని చేసిన నగంథోయ్, లామ్నుంథెమ్ లను కోల్పోవడం అరుదైన ఐక్యతను తాకినట్లయింది. జాతి ఉద్రిక్తతలతో మణిపూర్ రగిలిపోయినప్పుడు పరస్పరం జాతిపరమైన పగలను విస్మరించడం కష్టం. అయినా వారు ఆకాశంలో కలిసి పనిచేశారు అని మైతీఖంబా అనే సోషల్ మీడియా పోస్ట్ లో పేర్కొన్నారు. ఎక్స్ లోనూ రాష్ట్రవ్యాప్తంగా ఓ అరుదైన భావన వ్యక్తమవడం ఓ కొసమెరుపు. అహ్మదాబాద్ ప్రమాదంపై జవాబుదారీ ఉండాలని, దర్యాప్తు పారదర్శకంగా ఉండాలని బాధితుల కుటుంబాలు డిమాండ్ చేస్తున్నాయి. విమానాన్ని కచ్చితంగా ఎందుకు తనిఖీ చేయలేదని నగంథోయ్ తండ్రి కంగ్బైలతం టోబా సింగ్ ప్రశ్నించారు. తన కూతురు ఇంటికి రావలసిఉండేదని ఆయన కన్నీటితో అన్నారు. నగంథోయ్, లామ్నుంథెమ్ ల అకాల మరణం మణిపూర్ ను దుఖ సముద్రంలో ముంచింది. వారి మరణాలు వైమానిక సంస్థలో వ్యవస్థాగత వైఫల్యాలను ఎత్తిచూపుతున్నాయి. వారి మృతదేహాల కోసం అటు అహ్మదాబాద్ లోనూ, ఇటు ఇంఫాల్ లోనూ జనం ఎదురుచూపులు, విస్తృత ఉద్యమంలో కలిసిపోయాయి. విమానయాన నిపుణులు, సామాన్యులు కూడా డిజిసిఏ స్వతంత్రంగా నిర్దిష్టమైన భద్రతా ప్రొటోకాల్ ను కఠినంగా అమలు చేయాలని, విమానాశ్రయ మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెట్టుబడులు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రమాదం భారతదేశానికి చివరి మేలు కొలుపు కావాలని కెప్టెన్ రంగనాథన్ అన్నారు. మనం ఇక ఎంతమాత్రం యువతను బలిపెట్టుకుంటూ ఉండలేము అన్నారాయన. మణిపూర్ లో ఇద్దరు కుమార్తెలను కోల్పోవడం జాతి విభజనను అధిగమించి, ఐక్యతా పరమైన దృష్టి కోణాన్ని ఆవష్కరించింది. తౌబాల్ లో నగంథోయ్ కుటుంబం ఇప్పటికీ ఆశతో ఆమె ఫోన్ కు డయల్ చేస్తోంది కాంగ్ పోక్పీలో లామ్నుంథెమ్ తల్లి వారి ఆత్మలకు శాంతి ప్రసాదించాలని ప్రార్థిస్తోంది. భారతదేశ విమానయాన సంక్షోభంలో సాగే వారి కథ భద్రత అనేది లగ్జరీ కాదు. అవసరం అనే విషయాన్ని స్పష్టీకరిస్తోంది. అహ్మదాబాద్ లో 270 మంది ప్రాణాలు కోల్పోవడం పట్ల దేశవ్యాప్తంగా సంతాపం వ్యక్తమవుతుండగా, ఈ విషాదం తర్వాత నైనా భారతదేశం భద్రతకు పెద్దపీట వేస్తుందా. లేక నిర్లక్ష్యం పునరావృతం అవుతుందా అన్న ప్రశ్న తలెత్తుతోంది. తౌబాల్‌లో నగంథోయ్ కుటుంబం ఆశలు అడుగంటిపోతున్నాయి. ఆమె ఫోన్ కు డయల్ చేస్తూనే ఉన్నారు. ఆ ఫోన్ ఇప్పటికీ రింగ్ అవుతోంది. కానీ సమాధానం రావడం లేదు. ఇక కాంగ్ పోక్పీలో లామ్నుంథెమ్ బంధువులు ఆమె కుటుంబాన్ని ఓదార్చేందుకు గుమికూడారు. ఇరుగూ పొరుగూ వారి కష్టంలో తోడుగా నిలుస్తున్నారు. మణిపూర్ నుంచి వెలువడుతున్న సోషల్ మీడియా పోస్ట్ లు హృదయవిదారకమైన ఐక్యతను ప్రతిబింబిస్తున్నాయి. వివాదంతో విడిపోయిన రెండు మణిపూర్ కుటుంబాలు ఇప్పుడు దుఖంతో నిండిపోయాయి. అని సీనియర్ జర్నలిస్ట్ శేఖర్ గుప్తా సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో పేర్కొన్నారు. ట్రోల్ ఇన్వేటెడ్ సోషల్ మీడియా పోస్ట్ లో -విభజిత మణిపూర్ ఇద్దరు సిబ్బంది మరణంతో విషాదంలో ఐక్యమైంది -ఒక కుకి, ఒక మెటిటీ. అని పేర్కొంది. అహ్మదాబాద్ లో జరిగిన ప్రమాదం భారతీయ విమానయాన భద్రతపై మరోసారి క్షణ్ణంగా పరిశీలించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతోంది. 1988లో అహ్మదాబాద్ లో జరిగిన ఇండియన్ ఎయిర్ లైన్స్ విమానం ఐసి- 113 ప్రమాదంలో 130 మంది మరణించారు. 2010లో మంగళూరులో జరిగిన ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్ ప్రమాదంలో 158 మంది మరణించారు.

ఈ ప్రమాదాలు తరచు మానవ తప్పిదాలో, అననుకూల వాతావరణమో, సాంకేతిక సమస్యలతో జరిగిన విషాదాల చరిత్రను తేటతెల్లం చేస్తున్నాయి. ఎయిర్ ఇండియా బోయింగ్ 787 విమానాలపై భద్రతా పరమైన తనిఖీలు చేయాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఆదేశించింది. డ్రీమ్ లైనర్‌లో తయారీలో షాట్ కట్‌ల గురించి విజిల్ -బ్లోవర్ వాదనల తర్వాత బోయింగ్ సంస్థ కొత్త ఒత్తిడిని ఎదుర్కొంటోంది. అయినా బోయింగ్ విమానాలు అత్యంత సురక్షితమైనవని ఆ కంపెనీ నొక్కి చెబుతోంది. మణిపూర్‌కు సంబంధించినంతవరకూ, నగంథోయ్ , లమ్నుంథెమ్ లను కోల్పోవడం భారత విమానయాన చరిత్రలో ఓ కీలక ఘట్టం. ఉమ్మడి మానవత్వాన్ని గుర్తుచేసే హృదయ విదారక సంఘటన. వారి మరణాలు అహ్మదాబాద్‌లో కొవ్వొత్తుల వెలుగు జాగృతికి దారి తీశాయి. విభజిత మణిపూర్‌లో శాంతి కోసం పిలుపునిచ్చాయి.

వారికి ఆత్మశాంతి కలగాలని, వారి ఆత్మలు కలిసి శాంతితో విశ్రాంతి తీసుకోవాలని ప్రార్థిస్తున్నట్లు రాజ్యసభ ఎంపీ పిషెంబాసనా జవోబా ప్రార్థించారు. ఈ భావనను విచ్ఛిన్నమైన స్థితిలో ఐక్యతకు చిహ్నంగా చూస్తున్నారు. విమాన ప్రమాదం కారణాలను కనిపెట్టేందుకు పరిశోధకులు, విమానం శిథిలాలను గాలిస్తుంటే, వారి కుటుంబాలను తమ ప్రియమైనవారి మృతదేహాలను అందుకునేందుకు, డిఎన్ఏ పరీక్షల ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో మణిపూర్ కు చెందిన ఇద్దరి యువతుల కథ ప్రత్యేకంగా నిలుస్తోంది. జీవితంలో వారు విభజనకు అతీతంగా ఎదిగారు. చిరునవ్వులతో ప్రయాణికులకు సేవచేశారు. మరణంలో వారు తమ కుటుంబాలను విషాద స్థితిలో ఒక క్షణమైనా ఏకం చేశారు.

# రాముడు నడయాడిన 'రామతీర్థం'



**భక్తుల కొంగు బంగారంగా.. మెట్ట ప్రాంత ఆరాధ్య దైవంగా.. పతిభక్తికి ప్రతిరూపంగా.. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా.. అంటరానితనం నిర్మూలనకర్తగా.. వలస వాసుల వరాల తల్లిగా విరాజిల్లుతున్న నర్రవాడ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు ఈ నెల 23 నుంచి 27 వరకు జరగనున్నాయి. ఏటా జ్యేష్ట మాసంలో వచ్చే పౌర్ణమి దాటిన మొదటి ఆదివారం నుంచి గురువారం వరకు ఐదు రోజుల పాటు ఘనంగా జరుగుతాయి. ఉత్సవాలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన వారు హాజరవుతారు. లక్షలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో దేవదాయ శాఖ అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.**

వెంగమాంబ చరిత్ర

దుత్తలూరు మండలం నర్రవాడ పంచాయతీ మజరా గ్రామమైన వడ్డిపాళెం వాస్తవ్యులైన పచ్చవ వెంగమనాయుడు, సాయమ్మ దంపతులకు కుల దైవమైన రేణుకాదేవి అనుగ్రహంతో వెంగమాంబ జన్మించింది. వెంగమాంబకు చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక చింతన ఉండేది. వెంగమాంబకు నర్రవాడకు చెందిన వేమూరి గురవయ్యతో తల్లిదండ్రులు వివాహం జరిపించారు. వివాహానంతరం భర్తకు అనుకూలంగా ఉంటూ ఆదర్శ దంపతులుగా ఉండేవారు. కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడేవారు. అభాగ్యులను ఆదుకుంటూ ఆదర్శ గ ృహిణిగా నిలిచారు. అగ్రవర్ణాలు దళితులను మంచినీటి బావుల వద్దకు రాకూడదనే సమయంలో ఈమె నీటిని చేది దళితులకు అందించేవారు. వారి కోసం బావిని కూడా తవ్వారు.

ఇప్పటికీ ఆ బావిని వేమూరి వారి బావిగా పిలుస్తున్నారు. ఒక రోజు ఆమె భర్త గురవయ్యనాయుడు పశువులను మేపేందుకు గ్రామ సమీపంలోని అడవికి వెళ్లారు. దీన్నే దొడ్డకొండ అంటారు. అదే సమయాన వెంగమాంబ స్నేహితులతో కలిసి గడ్డికోసం అడవికి వెళ్లారు. ఇంతలో అకస్మాత్తుగా దొంగలు వచ్చి వెంగమాంబ, స్నేహితులను అటకాయించారు. దీంతో బిగ్గరగా కేకలు వేశారు. అడవిలో ఉన్న గురవయ్య ఒక్క ఉదుటున అక్కడికి చేరుకుని దొంగలతో తలపడ్డారు. దొంగలందర్నీ హతమార్చగా ఒక దొంగ చాటుగా ఈటెతో గురవయ్య గుండెకు విసిరాడు. దీంతో గురవయ్యకు తీవ్రగాయమై రక్తస్రావమై స్ప ృహ కోల్పోయారు. మూడు రోజుల పాటు భార్య వెంగమాంబ, గ్రామస్తులు ఎన్ని సపర్యలు చేసినా స్ప ృహలోకి రాలేదు.

దీంతో వెంగమాంబ తన భర్త మరణించకముందే ముత్తయిదువుగా అగ్నిగుండ ప్రవేశం చేయాలని నిర్ణయించుకొని తల్లిదండ్రులు, గ్రామస్తులను ఒప్పించారు. నర్రవాడ గ్రామంలోని మధ్యభాగాన అందరూ చూస్తుండగానే అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఆమె అగ్నిగుండ ప్రవేశం చేసిన తెల్లవారి అక్కడ వెంగమాంబ మంగళసూత్రాలు, పైటకొంగు కాలకుండా గ్రామస్తులకు కనిపించాయి. అనంతరం వెంగమాంబ తన స్నేహితురాలైన తుమ్మల పెదవెంగమ్మ, వెంగమాంబ బావగారైన ముసలయ్యనాయుడికి కల్లో కనిపించి తనకో దేవాలయాన్ని నిర్మించాలని కోరారు. అనంతరం వెంగమాంబకు దేవాలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఏటా అమ్మవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

అమ్మ పెట్టుబడితో వ్యాపారంలో అధిక ఆదాయాలు

వెంగమాంబ పేరంటాలు దేవస్థానం తరఫున అమ్మవారి నగదును భక్తులకు అందజేస్తారు. భక్తులు రూ.100 చెల్లిస్తే అమ్మవారి నగదును చిల్లర రూపంలో రూ.80 అందజేస్తారు. ఈ నగదును వ్యాపార పెట్టుబడిలో కలపగా అధిక ఆదాయాలు వస్తాయనేది భక్తుల నమ్మకం. ఈ విధంగా అధిక ఆదాయాలు పొందిన భక్తులు అమ్మవారి దేవస్థాన అభివ ృద్ధికి తమ వంతు కానుకలను అందిస్తున్నారు. అమ్మవారి పేరుతో పలు జిల్లాలు, రాష్ట్రాల్లో వ్యాపార సంస్థలు, హోటళ్లు నడుస్తున్నాయి.

దేవస్థానానికి చేరుకునేదిలా..

దుత్తలూరు మండలం నర్రవాడలో దేవస్థానం ఉంది. ఇక్కడికి చేరుకోవాలంటే నెల్లూరు నుంచి దుత్తలూరు మీదుగా పామూరు వెళ్లే మార్గంలో నర్రవాడలో దిగాలి. ఒంగోలు నుంచి కందుకూరు మీదుగా దుత్తలూరు వెళ్లే మార్గాన, కడప నుంచి బద్వేలు, ఉదయగిరి, దుత్తలూరు మీదుగా పామూరు వెళ్లే మార్గాన, పోరుమామిళ్ల నుంచి సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు మీదుగా పామూరు మార్గాన నర్రవాడకు చేరుకోవాలి.

బ్రహ్మోత్సవాల కార్యక్రమాలు

ఐదు రోజుల పాటు జరిగే అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 23న నిలుపు కార్యక్రమంతో ప్రారంభంకానున్నాయి. అదే రోజున సంతానం లేని మహిళలు అమ్మవారి ముందు వరపడతారు. 24న వెంగమాంబ, గురవయ్య రథోత్సవం, సంతానం లేనివారు వరపడతారు. 25న రథోత్సవం, 26న ఉదయం వెంగమాంబ, గురవయ్య కల్యాణోత్సవం, పసుపు, కుంకుమ ఉత్స వం, రాత్రికి ప్రదానోత్సవం, వివిధ సాంస్క ృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ఉత్సవాల్లో చివరి రోజైన 27న పొంగళ్లు, ఎడ్ల బండలాగుడు పందేలు, తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ సారి బ్రహ్మోత్సవాలు జరిగే అన్ని రోజుల్లో అన్నదా న, ప్రత్యేక సాంస్క ృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

# వేదమంత్రాల శక్తికి మూలం?



మంత్రాలకు చింతకాయలు రాలుతాయా? అని ప్రశ్నించే వారు వేదమంత్రాల మహాబలానికి మూలం తెలుసుకోవాలి. వేదాల జ్ఞానసంపదనుబట్టే దాని గొప్పతనం అర్థమవుతుంది. స ృష్టితోపాటు ఉద్భవించినట్టుగా భావిస్తున్న వేదవిజ్ఞాన సారాన్ని ఆనాటి మహర్షులే కనుక గ్రహించి మానవజాతికి అందించక పోయుంటే ఇవాళ భూమిపై ఈ కాస్తా ధర్మమైనా నిలిచేది కాదని ఆధ్యాత్మిక వేత్తలు అంటారు. అప్పుడు మానవుల జీవితాలు తెరచాపల్లేని నావల్లా అగమ్యగోచరం, నిరర్థకమేకాక నిస్సారమయ్యేవనీ వారంటారు. వేదవాఙ్మయం ఎప్పుడు, ఎలా పుట్టిందనడానికి ఇప్పటికే కొన్ని భావనలు ప్రచారంలోకి వచ్చాయి. ఎవరికి వారు ఏదో ఒక ఆధారాన్నిబట్టి నిర్ధారిస్తున్నారు. శాస్త్రీయ మూలాధారమే అత్యంత ప్రామాణికమవుతుంది. న్యూఢిల్లీకి చెందిన రిటైర్డ్ సీనియర్ ప్రొఫెసర్ ఏవీ మొహరిర్ వెలిబుచ్చిన ఇటీవలి ప్రతిపాదన ఈ కోణంలో ఆలోచింప చేసేదిగా ఉంది. ప్రపంచంలోనే అతిప్రాచీనమైన ఆధ్యాత్మిక తత్వంగా అద్వైత సిద్ధాంతాన్ని పేర్కొంటూనే, వేదమంత్రాలు స ృష్టి ఆరంభంలో విశ్వశక్తి ప్రేరణతోనే అత్యంత ప్రాక ృతికంగా ఆవిర్భవించినట్లు ఆయన తెలిపారు.

వేదాలు అపౌరుషేయాలని (ఎవరూ రాయనివి) భారతీయ తత్వవేత్తలు ఏనాడో తేల్చారు. మన పౌరాణికాల ప్రకారం ప్రళయాలు-ప్రణవాలు (స ృష్టి ఆరంభం) ఒక మహాకాలచక్రంలో భాగం. గత ప్రళయం తర్వాత క ృతయుగంతో మొదలై త్రేతా, ద్వాపర, కలి యుగాల పిమ్మట మళ్లీ ప్రళయం సంభవిస్తుంది. ఈ క ృతయుగ కాలం మొదట్లోనే శ్రీమహావిష్ణువు మత్స్యావతారం దాల్చి, వేదాలను ఎత్తుకెళ్లిన సోమకాసురుడు అనే రాక్షసుని వధించి వాటిని రక్షించాడు. కాబట్టి, అవి తొలియుగం నాటికే వున్నట్టుగా భావించాలి. హైందవ విశ్వాసం మేరకు క ృత(సత్య) యుగంతో స ృష్టి ప్రారంభమై ఇప్పటికీ అనేక లక్షల సంవత్సరాలు అయింది. వేదాల స ృష్టికర్త బ్రహ్మదేవుడే అన్న పౌరాణిక కథా వాడుకలో ఉంది. వేదనాగరికత క్రీ.పూ.1200 సంవత్సరం నాటిదని కొందరు, కాదు క్రీ.పూ.4000 సంవత్సరాల కిందటిదని మరి కొందరు భావిస్తున్నారు. వేదకాలం విషయంలో భిన్నాభిప్రాయాలున్నప్పటికీ అత్యధిక హైందవులు ఇవి అనాదిగా ఉన్నవేనని విశ్వసిస్తున్నారు. ప్రత్యేకించి ఎవరూ రాసినవి కాకపోయినా, లభ్యమవుతున్న సాహిత్య, చారిత్రకాది ఆధారాల మేరకు సంస్క ృత భాషలోనే వేదవాఙ్మయమంతా గ్రంథస్తం అయిందన్నది స్పష్టం. అసలు, ఈ దేవభాష (సంస్క ృతం)లోకి వేదాలు ఎలా రూపాంతరం చెందాయి? ఎవరూ రాయకపోతే వీటికి అక్షరరూపు ఎలా సిద్ధించింది? అన్న ప్రశ్నలకు రిటైర్డ్ ప్రొఫెసర్ ఏవీ మొహరిర్ విపులమైన అభిప్రాయాన్నే వ్యక్తంచేశారు. కిందటేడాది (2018) అక్టోబర్ 1-7 మధ్య వెలువడిన యూనివర్సిటీ ఆయన పరిశోధనాత్మక వ్యాసం (సైన్స్, స్పిరిచువాలిటీ అండ్ గాడ్: యాన్ అటెంప్టెడ్ సింథసెస్) ఈ విషయాన్ని సమగ్రంగా చర్చించింది. న్యూఢిల్లీలోని ఐఏఆర్ఐ (ఇండియన్ అగ్రికల్చరల్ రీసర్చి ఇన్‌స్టిట్యూట్)కు చెందిన డివిజన్ ఆఫ్ అగ్రికల్చరల్ ఫిజిక్స్‌కు అధిపతిగా, డీన్‌గా పనిచేసి ఆయన రిటైరయ్యారు. వేదాలు అనాదిగా ఉన్నవన్న సనాతన వాదుల అభిప్రాయాన్ని ఏకీభవించే రీతిలోనే ఆయన అభిప్రాయం ఉండడం గమనార్హం.

**సబ్‌కా మాలిక్ ఏక్ అన్న సందేశంతో యావత్ మానవాళికి శాంతి సందేశాన్నిచ్చిన సాయి భగవాన్ మందిరం మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లా షిర్డిలో ఉంది. ఫకీర్ అవతారంలో అనేక మహిమలు ప్రదర్శించిన సాయినాథుడు ఇప్పటికీ సమాధి నుంచే భక్తులకు అభయమిస్తాడని అసంఖ్యాక సాయి భక్తుల నమ్మకం. సాయి మందిరాన్ని దర్శించుకునేందుకు రోజు వేలాది భక్తులు షిర్డికి వస్తుంటారు.**

# సాయి సందేశం 'సబ్‌కా మాలిక్ ఏక్'

**శ్రద్ధ, సబూరి ..** శ్రద్ధ అంటే విశ్వాసం, భక్తి, సబూరి అంటే ఓర్పు, సాధన సందేశాలతో మానవాళికి అమూల్యమైన శాంతి సందేశాన్ని ఇచ్చారు. సాయినాథుడు ఎక్కడ జన్మించారు అన్న అంశంపై వేర్వేరు వాదనలు ఉన్నాయి. అహ్మద్‌నగర్ జిల్లాలోనే 19 శతాబ్దంలో జన్మించినట్టు కొందరు పర్బానీ జిల్లాలో జన్మించినట్టు మరికొందరు పేర్కొంటారు. అయితే ఈ వాదనలను పక్కనబెడితే హిందూ, ముస్లింల మధ్య సఖ్యతకు క ృషి చేసిన మహనీయుల్లో ఆయన అగ్రగణ్యుడు.

షిర్డిలోని పాత మసీదు మందిరాన్నే తన నివాసంగా చేసుకొని మత సామరస్యత కోసం శ్రమించారు. ఇప్పుడు ఆ మందిరాన్ని ద్వారకామాయిగా పిలుస్తున్నారు. సమాధి మందిరం పక్కన ఉన్న గురుస్థానంలో ఆయన కూర్చొని ఉండేవారు. తొలిసారిగా 1854లో బాలసాయిని వీక్షించిన గ్రామస్థులు ఆశ్చర్యపోయారు. ఎప్పుడూ ధ్యానంలో ఉండే సాయిని అనేక ప్రశ్నలు అడిగేవారు. అనంతరం ఆయన కొంతకాలం కనిపించలేదు.

**ఆవో సాయి..** షిర్డి గ్రామంలోని ఖండోబా మందిరంలో మహాల్సాపతి పూజరిగా ఉండేవారు. ఒకసారి సాయి ఆ గ్రామంలోకి తిరిగి ప్రవేశించారు. ఆయనను చూసిన మహల్సాపతి ఆవో సాయి అని ఆహ్వానించారు. దీంతో ఆయన నామం సాయిగా స్థిరపడింది. భగవంతునికి ఎలాంటి పేర్లు ఉండవు. భక్తులు ఏ పేరుతో పిలిస్తే పలుకుతారు అదే రీతిలో సాయిబాబాగా ప్రఖ్యాతిచెందారు. సాయి మహిమలను వీక్షించిన అనేక మంది ఆయన శిష్యులుగా మారారు. మహాల్సాపతి, శ్యామ, హరి సీతారాం, దామోదర్... తదితరులు ఆయన శిష్యగణంలో ఉండేవారు.



స్వామివారి మహిమలు దేశమంతటా వ్యాపించడంతో అనేకమంది భక్తులు షిర్డికి రావడం ప్రారంభించారు. 1918లో ఆయన సమాధి చెందారు. అయితే సమాధి నుంచే భక్తులను అభయమిస్తుంటాను అన్న ఆయన దివ్య వ్యాఖ్యల ఫలితంగా షిర్డిక్షేత్రం భక్తజన క్షేత్రంగా మారిపోయింది.

**సమాధిమందిర నిర్మాణం:** బాబా భక్తులలో నాగ్‌పూర్‌కు చెందిన గోపాల్‌రావు బూటి ఒకరు. ఆయన కలలో స్వామి కనిపించి తనకు సమాధి మందిరాన్ని నిర్మించమని కోరారు. దీంతో బూటి ఆయనకు మందిరాన్ని నిర్మించారు. అదే మనం నేడు చూస్తున్న సమాధి మందిరం. షిర్డి ప్రవేశమే అన్ని పాపాలకు పరిహారం అన్న బాబా సూక్తికి అనుగుణంగా రోజు వేల మంది భక్తులు సాయి సన్నిధానానికి వస్తుంటారు. మందిర ప్రవేశంతోనే స్వామి దివ్యమంగళ స్వరూపాన్ని వీక్షిస్తూ దివ్యానుభూతి చెందుతారు. ద్వారకామాయితో పాటు చావడి, గురుస్థానం, నందదీప్, లెండి గార్డెన్స్... తదితర ప్రాంతాలను మనం చూడవచ్చు. ఈ ప్రదేశాల్లో సాయి నడియాడిన అంశం మనకు గుర్తుకు వస్తే మనస్సులో




ఆధ్యాత్మిక భావన అలముకుంటుంది. సాయి సంస్థాన్ వారు బాబా వస్తువులతో ప్రత్యేకంగా ఒక ప్రదర్శనశాలను ఏర్పాటు చేశారు. వీటిని కూడా వీక్షించవచ్చు.

**వసతి సౌకర్యం ...**

సంస్థాన్ వారు అనేక వసతి సముదాయాలను నిర్వహిస్తున్నారు. వీటిని ఆన్‌లైన్ ద్వారా ముందుగానే రిజర్వ్ చేసుకోవచ్చు,

ప్రైవేటు వసతి గ ృహాలు ఎక్కువగా ఉన్నాయి. భక్తులు వారి ఆర్థిక స్థోమతకు తగినట్టుగా గదులను తీసుకోవచ్చు.

**ఎలా చేరుకోవచ్చు ..**

దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి షిర్డికి రైలు, బస్సు సౌకర్యముంది.

హైదరాబాద్ నుంచి అజంతా ఎక్స్‌ప్రెస్, సాయినగర్ ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. అజంతా ఎక్స్‌ప్రెస్‌లో వెళ్లేవారు నాగర్‌సోల్ స్టేషన్‌లో దిగాలి. అక్కడ నుంచి షిర్డికి అనేక వాహనాలు ఉంటాయి.

సాయినగర్ ఎక్స్‌ప్రెస్‌లో వెళితే నేరుగా షిర్డి చేరుకోవచ్చు.

షిర్డి సమీపంలో విమానాశ్రయాన్ని నిర్మించారు. ఇప్పటికే పలు విమాన కంపెనీలు సర్వీసులను అందిస్తున్నాయి.

ఔరంగాబాద్ విమానాశ్రయంలో దిగి వాహనాల ద్వారా షిర్డి చేరుకోవచ్చు.

సత్యమేవ జయతే

బుధవారం 18 జూన్ 2025

# వేగం... ఓ వ్యసనం! వీడితేనే... పదిలం!!

**చేతిలో స్టీరింగ్... కాలి కింద యాక్సిలేటర్... నరాల్లోకి మైకం మత్తులా కమ్మేస్తుంది... రోడ్డుపై వాహనం వందమైళ్ల వేగంతో దూసుకెళ్తుంది... ఆ అంతులేని వేగం అదుపు తప్పినవేళ... కారు, బైక్ తలకిందులవుతుంది... దేన్నైనా బలంగా ఢీకొడుతుంది... పడుచు ప్రాయానికి నూరేళ్లు నిండుతాయి... ఒకటా.. రెండా.. ఎక్కడో ఒకచోట నిత్యం ఇలాంటి ఘోరాలు జరుగుతూనే ఉన్నాయి... అయినా కుర్రకారు వాటి నుంచి పాఠాలు నేర్వరే! ఇంతకీ వీళ్లిలా రెచ్చిపోతూ కన్నవాళ్లకు గర్భశోకం మిగల్చడానికి దారితీసే కారణాలేంటి? యువతని ప్రమాదాలవైపు డ్రైవ్ చేసే అంశాలేంటి? తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి? మానసిక నిపుణులతో చర్చించాం. వారిచ్చిన సలహాలు.. అభిప్రాయాలు ఇవిగో.**

బైక్‌పై వేగంగా వెళ్తూ అదుపుతప్పి ఇద్దరు బీటెక్ కుర్రాళ్లు మృత్యువాత గుండెను మెలిపెట్టే ఇలాంటి సంఘటనలు రోజూ చూస్తున్నాం, వింటున్నాం. యువతకి థ్రిల్ కలిగించే వేగం ఎన్నో ప్రాణాల్ని కబళిస్తూనే ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రతి నాలుగు మరణాల్లో ఒకటి రోడ్డు ప్రమాదాల కారణంగానే సంభవిస్తోంది. అందులోనూ 15నుంచి 30 ఏళ్ల వయసువారే అత్యధికులవడం విషాదం. భారత్‌లో అయితే రోడ్డుప్రమాదం కారణంగా ప్రతి నాలుగు నిమిషాలకు ఒకరు చనిపోతున్నారు.అసలే కుర్రతనం... ఆపై యవ్వనాన్ని కవ్వించేలా క్షణాల్లో వంద కిమీల వేగం అందుకునే అత్యాధునిక కార్లు, బైక్‌లు. థ్రిల్, ఉత్సుకత, సాహసం పేరేదైతేనేం... దూసుకెళ్లడం షురూ. వంద కిలోమీటర్ల వేగంతో వెళ్తూ సడెన్‌గా బ్రేక్ కొట్టడం, సైడ్ పార్కింగ్ రాడ్‌ని రోడ్డుకి రాపాడిస్తూ నిప్పురవ్వలు రాజేయడం, అర్ధరాత్రి రేసింగ్‌లు... మద్యం, మత్తుపదార్థాలు తీసుకొని రోడ్డెక్కడాలు. వీటిలో అంతులేని ఆనందం వెతుక్కోవాలని చూస్తున్నారే తప్ప క్షణం ఏమరపాటులో పరలోకం చేరతామనే ప్రమాదాన్ని గుర్తించలేకపోతున్నారు యువత.



**స్టీరింగ్ ముందు :** ద్విచక్రవాహనం ఎక్కిన, స్టీరింగ్ పట్టుకున్న ప్రతి ఒక్కరూ ప్రమాదానికి గురవుతారా? వందమైళ్ల వేగంతో దూసుకెళ్తారా? 'కానేకాదు కాదు.. ఇంపల్సివ్ నేచర్ (దుందుడుకు స్వభావం) ఉన్నవారు మాత్రమే ఈ తరహా దుస్సాహసానికి ఒడిగట్టి ప్రమాదాల బారిన పడతారు' అంటారు సైకాలజిస్టు డా.టీఎస్‌రావు. వాళ్లకు ముందూ వెనకా ఆలోచన ఉండదు. వాహనం వేగంగా నడిపితే ఒకరకమైన థ్రిల్‌కి గురవుతారు. తర్వాత పరిణామాల గురించి అస్సలు ఆలోచించరు. సహజంగా మనిషిలో ఆలోచనల మెదడు, భావోద్వేగాల మెదడు ఉంటుంది. ఫీలింగ్ బ్రెయిన్ పాళ్లు ఎక్కువగా ఉన్నవారు అత్యుత్సాహాన్ని మాత్రమే కోరుకుంటారు. దీనికితోడు మద్యం, మత్తుపదార్థాలు తీసుకుంటే మనసు, శరీరం రెండూ నియంత్రణ కోల్పోతాయి.

**ఎందుకిలా? :** 'తాగుడు, పేకాటలాగే ర్యాష్ డ్రైవింగ్ కూడా వ్యసనమే' అంటారు మరో మానసిక నిపుణురాలు గీతా చల్లా. ఈ వ్యసనానికి లోనైన వాళ్లలో భయం, భక్తి ఏమీ ఉండదు. కారు పోతే కొత్త కారు వస్తుంది. డబ్బుతో దేన్నైనా మేనేజ్ చేయొచ్చనే అతి ఆత్మవిశ్వాసం. దాంతో తాగి డ్రైవ్ చేయడం, పొద్దంతా నిద్రపోయి రాత్రుళ్లు జల్సాలు చేయడం.. స్పీడ్ డ్రైవింగ్, రేసింగ్‌లో పాల్గొనడం తప్పు కాదనే భ్రమలో ఉంటారు. ఒకవేళ ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి.. ప్రసార మాధ్యమాల్లో విపరీతమైన ప్రచారం జరిగినా వీళ్లలో చిన్నపాటి మార్పు రాదు అంటారు గీతా. వ్యక్తిగతంగా ఎలాంటి బరువు బాధ్యతలు లేకపోవడం.. కన్నవాళ్ల అతిగారాబం. ఇంకొందరు పిల్లలు నయానోభయానో తల్లిదండ్రులను ఒప్పించి కార్లు, బైక్ కొనేలా చేస్తుంటారు. డబ్బున్నవాళ్లే కాదు.. పేదవారిలో సైతం ఈ తరహా స్వభావం ఉన్న కుర్రకారు లేకపోలేదు. స్నేహితులు, సహాధ్యాయుల ప్రభావం వీరిపై బలంగా పనిచేస్తుంది. వాహనాల్ని వేగంగా నడిపిస్తేనే మజా అనుకుంటారు. స్పీడ్ డ్రైవింగ్ ఇష్టం లేకపోయినా స్నేహితుల ఒత్తిడికి తలొగ్గి వారితో జత కూడి ప్రాణాలు కోల్పోతున్నవారెందరో. 'యవ్వనంలో శారీరకంగా సంభవించే మార్పులు సైతం ఈ ధోరణికి కారణం అవుతాయి. శరీరంలోని కీలక హార్మోన్లలో ఎడ్రినలిన్ ఒకటి. దీన్నే 'ఫైట్ ఆఫ్ ఫ్లైట్ హార్మోన్' అంటారు. శరీరానికి ఉద్రేకం కలిగినపుడు ఈ హార్మోను విడుదలవుతుంది. కండరాలు బిగుసుకుంటాయి. రక్తప్రసరణ పెరుగుతుంది. శరీరం నొప్పులు నీరసం, బాధల్ని తాత్కాలికంగా విదుల్చుకుంటుంది. దీనివల్ల ఒక ప్రశాంతత, హాయి కలుగుతుంది.. ఈ హాయికి అలవాటుపడితే రాష్ డ్రైవింగ్ వ్యసనం ముదురుతుంది' అని మరో కోణం వివరిస్తారు టీఎస్ రావు.

**ఏం చేయాలి?**

ఒక ప్రమాదంలో ఒకరు చనిపోతే మొత్తం కుటుంబమే విషాదంలో మునిగిపోతుంది. పిల్లలపైనే ప్రాణాలు పెట్టుకున్న తల్లిదండ్రుల బాధైతే వర్ణనాతీతం. ఈ ప్రమాదాల్ని అరికట్టాలంటే ఏం చేయాలి? బాల్యం నుంచే పిల్లలకు డ్రైవింగ్, నిబంధనల పట్ల అవగాహన కల్పించాలి. 12 నుంచి 18 ఏళ్లు డ్రైవింగ్‌కి సరైన వయసు. తల్లిదండ్రులు, స్నేహితులు, గురువులు..వారిని ఉత్తమ చోదకులుగా తీర్చిదిద్దాలి. రవాణాశాఖ, పోలీసులు రోడ్డుభద్రతా వారోత్సవాలు, కౌన్సిలింగ్‌లు నిర్వహిస్తుంటారు. ఇలాంటివి పాఠాలుగా మార్చి తరగతి గదుల్లోనే బోధించాలి. ఎవరైనా ర్యాష్ డ్రైవింగ్ చేసినా, తాగి పట్టుబడ్డా ఇంకోసారలా చేయకుండా వారిలో పశ్చాత్తాపం కలిగేలా చేయాలి. వెబ్‌సైట్లలో, రోడ్డు కూడళ్లలో వారి ఫొటోలు పెడుతుండాలి. తప్పు చేస్తే శిక్ష వెంటనే అమలు చేయాలి. ఇంటికి చలానాలు పంపిస్తాం, తర్వాత చూస్తాం.. అంటే తప్పు చేసే వారిలో ఒకరకమైన నిర్లిప్తత, తేలికభావం వస్తుంది. సమ వయస్కులు, సినిమా తారలు.. సమాజంపై అత్యధిక ప్రభావం చూపిస్తారు. దుందుడుకు స్వభావం ఉన్నవాళ్లకు వీరితో పాఠాలు చెప్పించాలి. తాగితే రోడ్డుమీదకు రావొద్దు. రోడ్డుమీదికొచ్చినా వేగాన్ని నియంత్రించేలా కారు, బైక్ ఏర్పాట్లుండాలి. దానికన్నా ముందు వాహనం తాళంచెవి ఇచ్చేముందే కన్నవాళ్లు తమ పిల్లలు ఏం చేస్తున్నారో గమనించాలి. రాత్రి 11 నుంచి తెల్లవారు జామున 4 ప్రమాదాలు అత్యధికంగా జరిగే కాలం. అత్యవసరమైతే తప్ప ఈ సమయంలో వాహనాలు బయటికి తీయొద్దు. అతివేగం ఇష్టపడేవారు సాధ్యమైనంతగా వాటిని నడపకుండా దూరంగా ఉండాలి. స్పీడోమీటరుపై కుటుంబసభ్యుల ఫొటోలు అతికించుకోవాలి.

# గెలవడానికి... ఫెయిల్యూర్ సీవీ

డిగ్రీలు చేతికొచ్చింది మొదలు.. అర్హత, అనుభవాలతో చక్కని రెజ్యూమ్ క్రియేట్ చేసుకుంటారు. కానీ, మీరెప్పుడైనా ఫెయిల్యూర్ సీవీ (కర్కులమ్ వీటా) క్రియేట్ చేసుకున్నారా? 'ఏంటిది.. ఉద్యోగాల వేటలో ఉన్నప్పుడు శుభం పలకకుండా.. ఓటములతో కూడిన ఫెయిల్యూర్ సీవీ గురించి మాట్లాడతారేంటి?' అనేగా మీ సందేహం. అయితే, మీకు ఫెయిల్యూర్ సీవీ గురించి తెలియదన్నమాట. ఇప్పటికైనా తెలుసుకుని రాసేయండి. చేజిక్కించుకోవాల్సిన మరెన్నో విజయాలకు ఈ సీవీ దారి చూపిస్తుంది. ఈ ఫెయిల్యూర్ సీవీ మీ కోసం మీరు రాసుకునేది. ఒకటి రెండు పేజీల రెజ్యూమ్ మీ కెరీర్‌కి ముందు మాట అయితే.. ఫెయిల్యూర్ సీవీ మిమ్మల్ని మీరు తర్కించుకుని రాసుకునే పుస్తకం అన్నమాట.

**ఎలా క్రియేట్ చేయాలి?**

రెజ్యూమ్‌లో అర్హతలు, వర్క్ ఎక్స్‌పీరియన్స్, మీకు ఉన్న అదనపు అర్హతల గురించి చూడ చక్కగా రాస్తారు.అది చదివిన వారు మీరు రాసిన వాక్యాల మధ్యే ఆలోచించొచ్చు. కానీ, మీకు తెలుసు రెజ్యూమ్ వెనుక జర్నీ గురించి. వాటికి అక్షర రూపం ఇస్తే మీ ఫెయిల్యూర్ సీవీ రూపుదిద్దుకుంటుంది. మీకు ఇంజినీరింగ్‌లో 70 శాతమే ఎందుకు వచ్చింది? ఏడాదిగా ఉద్యోగాల వేటలో ఉన్నా ఎందుకు ఉద్యోగం సాధించలేకపోతున్నారు? ఇంటర్వ్యూల్లో అడిగే ప్రశ్నలకు ఎందుకు తడబడుతున్నారు? లోపం ఎక్కడుంది?.. లాంటి ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే మీకు ఫెయిల్యూర్ సీవీ ఉండాల్సిందే. కాస్త ఓపికతో మీ లోపాల్ని గ్రహించి రాసుకోండి. ఇతరులకు సమర్పించే పత్రం కాదు. మీకు మీరు ఇచ్చుకొనే ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇది. నిజాయితీగా నిశిత పరిశీలనతో రాసుకోండి. మీ పరాజయాలు, పరిధుల్ని రాసుకుని, వాటి పక్కనే మీలోని పాజిటివ్ అంశాల్ని జోడించండి. ఎక్కడ లోపం ఉందో విశ్లేషించండి. దీంతో ఉద్యోగాల వేటలో చేసిన తప్పులే మళ్లీ చేయడానికి ఆస్కారం ఉండదు.

**ఏం నేర్చుకోవాలి?**

ఇంటర్వ్యూకి డైనమిక్‌గా రెడీ అయ్యి వెళ్లడానికి ముందే మీరెంత వరకూ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నారో తెలుసుకునేందుకు వీలుంటుంది. బలహీనతల్ని వెతికి పట్టుకునేందుకు రాసుకునే పత్రమే ఫెయిల్యూర్ సీవీ. పొందాలనుకునే ఉద్యోగం పట్ల మీరెంత నిబద్ధతతో ఉన్నారో ఇంటర్వ్యూ చేసేవారి కంటే ముందే మీకే తెలుస్తుంది. అంతేకాదు.. గతంలో మీరు చేసిన తప్పుల్ని ఒప్పుకొంటూ.. అవి పునరావృతం కాకుండా జాగ్రత్త పడొచ్చు. మీతో మీరు సెల్ఫ్‌చెక్ చేసుకోవడంతో.. గుర్తుంచుకోవాల్సిన అంశాలు మదిలో బలంగా నాటుకుంటాయి. అప్పటి వరకూ అత్యంత ఎక్కువ ఒత్తిడికి గురి చేసిన ఓటమిపై విజయం మీదవుతుంది.

**అందుకో సమాధానమే!**

ఇంటర్వ్యూల్లో మీరు సాధించిన విజయాలే కాదు. మీకు ఎదురైన ఓటముల గురించీ అడగొచ్చు. వాటిని మీరెలా స్వీకరిస్తారో తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. అలాంటప్పుడు మీ నుంచి వచ్చే సమాధానంలో మానసికంగా మీరెంత బలమైన వ్యక్తో తెలుస్తుంది. మీ కంటూ ఓ ఫెయిల్యూర్ సీవీ ఉంటే.. తడుముకోరు. సూటిగా వారి కళ్లలోకి చూస్తూ సమాధానం చెబుతారు. మీరు చేపట్టిన ప్రాజెక్టు ఎందుకు సక్సెస్ కాలేదో వివరిస్తారు. చేసిన పొరపాట్ల నుంచి మీరేం నేర్చుకున్నారో ఆత్మవిశ్వాసంతో చెబుతారు. ఎదుటివారిని నిందించడం మానేసి మీరు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటే బాగుండేదో వివరిస్తారు. దీంతో మీలోని నాయకత్వ లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. అంతే.. యూ విల్ విన్.

**'రివ్యూ' రాయడమే**

ఓడిపోతున్నామంటే గెలవడానికి ప్రయత్నిస్తున్నట్టే. ఎప్పటికైనా గెలవాలంటే? ఎందుకు ఓడిపోతున్నామో తెలుసుకోవాలి. ఉదాహరణకు చదువుకి తగిన ఉద్యోగం చేయాలనేది మీ కోరిక. ఇంటర్వ్యూల్లో పదే పదే ఫెయిల్ అవుతున్నారంటే.. ఎక్కడో మీరు పసిగట్టలేని లోపం మిమ్మల్ని ఇంటర్వ్యూ గేటు దాటనివ్వడం లేదు. అప్పుడు నిత్యం మీరు ఫార్వర్డ్ చేసే రెజ్యూమ్‌తో పాటు 'సెల్ఫ్ రెజ్యూమ్' క్రియేట్ చేసుకోండి. అది మీ సినిమాకి మీరు రాసుకునే రివ్యూ అన్నమాట. నిజాయితీగా రాస్తే లోపాలు ఎక్కడున్నాయో తెలుస్తాయ్. ఒకవేళ మీ సెల్ఫ్ రెజ్యూమ్‌లో మీకు తప్పులు దొరకకుంటే.. అమ్మకో.. నాన్నకో ఫార్వర్డ్ చేయండి. లేదంటే.. మీ ప్రియ మిత్రులకు పంపండి. సూచనలు కోరండి.



# ఉదుకురక్తానికి గుండెపోటా?



యువత చాలావరకు ఎక్కువసేపు కూర్చొని ఉండే ఉద్యోగాలు చేస్తున్నది. అయితే ఎక్కువ సేపు కూర్చుని ఉండే యువతను వైద్యులు హెచ్చరిస్తున్నారు. రోజుకు 9 గంటలకు పైగా కూర్చుండే ఉద్యోగం గనుక చేస్తే తప్పనిసరిగా కొన్ని అలవాట్లు చేసుకోవాలని చెప్తున్నారు.

ఇటీవల నార్వేజియన్ స్పోర్ట్స్ స్కూల్‌కు చెందిన పరిశోధకులు ఓ అధ్యయనం నిర్వహించారు. ఇందులో కూర్చుని 9 గంటలు పనిచేసే వారికి గుండెపోటు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. వీరు కనీసం రోజుకు 30 నిమిషాలు వ్యాయామం చేయాలని పేర్కొన్నారు. గుండెకు మేలు చేసే ఆహారాన్ని తీసుకోవాలని చెబుతున్నారు. రోజుకు తొమ్మిది గంటలు పనిచేసే 36 వేల మంది యువతపై అధ్యయనం చేశారు. వీరిలో శారీరక శ్రమ చేయని వారి గుండె పనితీరు మందగించిందని పేర్కొన్నారు. ఎక్కువ సేపు కూర్చొని ఉండేవారు కచ్చితంగా ప్రతిరోజూ వ్యాయామం చేయాలని వైద్యులు సూచిస్తున్నారు.

# వాట్సాప్ థీమ్ మార్చుకోవచ్చు




రోజురోజుకూ కొత్త అప్‌డేట్స్‌తో యూజర్లను మరింత మెప్పిస్తున్నది వాట్సాప్. తాజాగా మరో సరికొత్త అప్‌డేట్ ఇవ్వనుంది. గ్రీన్ కలర్‌లో ఎప్పుడూ కనిపించే వాట్సాప్ కలర్‌ను ఈ ఫీచర్‌తో మార్చుకోవచ్చు.

ఇన్నాళ్లు వాట్సాప్‌లో వాల్‌పేపర్ మాత్రమే మార్చుకునే సదుపాయం ఉంది. దానికి బదులు ఇప్పుడు థీమ్ కూడా మార్చుకోవచ్చు. వాల్ పేపర్ మార్చుకుంటే చాటింగ్ డిస్‌ప్లే స్క్రీన్ మాత్రమే కనిపిస్తుంది. దీని కోసం ఫొటో అయినా కలర్ బ్యాక్‌గ్రౌండ్ అయినా పెట్టుకోవచ్చు. ఇప్పుడు థీమ్ చేంజ్ వస్తే థీమ్‌ను బట్టి ఐకాన్‌లలోనూ మార్పును గమనించవచ్చు. అంతేకాదు, దీంతోపాటు వాట్సాప్ స్టిక్కర్లను యాప్‌లోనే ఉండేలా.. అంటే ఈమోజీలలాగే వాడుకునేందుకు వీలుంది. ఇప్పటికే టెస్ట్ వెర్షన్‌లా గ్రీన్ కలర్ థీమ్‌ను విడుదల చేసింది వాట్సాప్.

స్పందనను బట్టి ఆండ్రాయిడ్ వెర్షన్లలోనూ అందించేందుకు కృషి చేస్తున్నది. సోషల్‌మీడియాకు అనుగుణంగా అప్‌డేట్ అవ్వాలనే ఉద్దేశంతో ఇలా థీమ్స్ మార్చుకునే సౌకర్యం కల్పిస్తున్నట్లు వాట్సాప్ వెల్లడించింది.